www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 47 పుటలు : 52

జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ నిజ శ్రావణ బహుళ ద్వాదశి

11-17 సెప్టెంబర్ 2023

వెల: ₹20/-

మహదొడ్డ నాయకుడు..
మన వినాయకుడు...

ఎండిన నెత్తురు కింద తడియారని జ్ఞాపకాలు

నమోస్తు సూర్యాయ సహస్రరశ్మయే...

విజయవంతమైన ఆదిత్య ఎల్-1

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

మన ప్రియతమ భారత ప్రధాని

శ్రీ నరేంద్రమోదీ గారికి

(SEPT-17)

జన్మదిన శుభాకాంక్షలు..

వల్లూరు జయప్రకాశ్‌నారాయణ

బీజేపీ నాయకులు, ఆంధ్రప్రదేశ్

వాకాటి పాండురంగారావు స్మారక కథల పోటీ

జాగృతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక కోసం సుప్రసిద్ధ కథా రచయిత స్వర్గీయ వాకాటి పాండురంగారావు స్మారక 'కథల పోటీ - 2023' నిర్వహిస్తున్నాం. రచయితలకు ఆహ్వానం..

ప్రథమ బహుమతి : రూ. 12000/-
ద్వితీయ బహుమతి : రూ. 7000/-
తృతీయ బహుమతి : రూ. 5000/-

1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతి, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు జాగృతి పారితోషికం ఉంటాయి.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 3 కథలకు మించి పంపరాదు.
4. కథ తన స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. దీపావళి సంచిక నుంచి ఆరంభించి, వరుసగా ఈ కథలను ప్రచురిస్తాం.
6. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో టిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి. చేతి రాత అందంగా, న్యాయనిర్ణేతలకు అర్థమయ్యేలా ఉంటే స్కాన్ చేసి పంపినా పరవాలేదు. కొట్టివేతలు ఉన్నా, సరిగా స్కాన్ చేయకున్నా పోటీకి తీసుకోలేం.
7. కథను పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
8. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. సంపాదకునిదే అంతిమ నిర్ణయం.

కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 11 సెప్టెంబర్, 2023

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్కులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి. తుకారాం సర్కులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

జాగృతి చందా – సూచనలు

5 సం॥ల చందా రూ.4000, సంవత్సర చందా రూ.850, విడి ప్రతి రూ.20

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

చందా కట్టించే వారికి సూచనలు :

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

చందా పంపవలసిన చిరునామా :

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- **చెక్కు, డిడిపై Jagriti Prakashan Trust అని ఆంగ్లంలో రాయాలి.**

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి	అసోసియేట్ ఎడిటర్
సబ్ ఎడిటర్	**9959991304**

డిజైనర్ : సిహెచ్. కుమార్

లెక్కలేనన్ని నికృష్టపు పనులు చేసి, కేసుల కొద్దీ అపకీర్తి మూటగట్టుకున్న నేరగాడైనా సరే, హిందూధర్మాన్ని దూషిస్తే మరుక్షణంలో వాడొక వర్గానికి సాక్షాత్తు ప్రవక్తలా కనిపిస్తాడు. రేప్‌లు, హత్యలు, అవినీతి చేసి, జైలుకి వెళ్లొచ్చినా సరే, ఆర్ఎస్ఎస్ మీదనో, బీజేపీ మీదనో నోరు పారేసుకుంటే చాలు, వాడిలో గొప్ప పురోగామిని దర్శించే దౌర్భాగ్యానికీ ఈ దేశంలో కొదవలేదు. నిన్నటిదాకా బీజేపీని అంటకాగి, మైనారిటీ ఓట్ల కోసం గోడ దూకి పురాణాలను తగలబెట్టినా, వాడికి సామాజిక న్యాయ పోరాట యోధుడి బిరుదిచ్చి వీరతాళ్లు వేస్తారు. తమకంటూ చెప్పుకోవడానికి వెంట్రుక పాటి ఘనత లేకున్నా, తాత, తండ్రి అప్పనంగా ఇచ్చిన అందలం ఎక్కి, తన ప్రతిభే అనుకునేవాళ్లు కూడా హిందూ వ్యతిరేకతతో బతికేస్తున్నారు. ద్రవిడవాద పైత్యం తలకెక్కి, అధికారమదంతో కొవ్వెక్కి 'సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి' అంటూ వాగిన ఉదయనిధి స్టాలిన్ ఈ బాపతు మూకలలో ఎక్కడో ఒకచోట కనిపిస్తాడు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ కారుకూతలు కూసినవాడు ఇతడే. ఇప్పుడు దేశమంతా భగ్గుమంటున్నది ఈ నోటివాటం మీదనే.

అదేం పోయేకాలమో! కొందరు రచయితలు, కవులు హిందూ వ్యతిరేకతనే దేశ నిత్యావసరంగా, వ్యవస్థను రాత్రికి రాత్రికి మార్చేసే ఆయుధమన్నట్టు చెబుతారు. రైతుల చావులు, చేనేతల ఇక్కట్లు, విద్యార్థుల బలవన్మరణాలు ఏమీ అక్కర్లలేదు వీళ్లకి. హిందూ దేవుళ్ల దూషణే సమన్యాయాన్ని తెచ్చే మహోద్యమమని నమ్మించాలని చూస్తారు. అలాంటి వాళ్ల సనాతన ధర్మనిర్మూలనా మహానాడులో ఉదయనిధి ఈ ప్రేలాపన వినిపించాడు. సెప్టెంబర్ 2వ తేదీన చెన్నైలో జరిగిన తమిళనాడు ప్రోగ్రెసివ్ రైటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ సంఘం సమావేశంలో ఉదయనిధి తన మెదడులోని బురదనంతా కుమ్మరించాడు. దీనికే అక్కడ చేరిన మేధావి బిరుదాంకితులంతా పోటీపడి తప్పట్లు కొట్టారు. అసలు ద్రవిడవాదం సాహిత్యం, కళ, సినిమా పేరుతో బలిసింది. సనాతనం అనేది సంస్కృత పదమట. శాశ్వతమైనదని అర్థమట. ఇక మార్చడానికి వీల్లేనిదట. ఎవరూ ప్రశ్నించలేనిదట. కులం ఆధారంగా సమాజాన్ని విడదీస్తుందట. దీనిని ఖండించడం కాదు, నిర్మూలించాలని తేల్చిపారేశాడు ఉదయనిధి. అసలు సనాతనమంటే శాశ్వతమైనదని ఇతడికి

శాలివాహన 1945 శ్రీ శోభకృత్ నిజ శ్రావణ బహుళ ద్వాదశి

లోపలి పేజీలలో...

ముఖపత్ర కథనం
ఎండిన నెత్తురు కింద తడియారని జ్ఞాపకాలు
6లో

చర్చ
'ఒకే దేశం ఒకే ఎన్నిక' సాధ్యమే!



10లో

పాఠకులకు, ఏజెంట్లకు,
ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు
వినాయక చవితి
శుభాకాంక్షలు

జాగృతి

సంపాదకీయం

బోధించినవాడు ఎవడో వాడిని సత్కరించాలి. అంతేనా. సనాతన ధర్మం కరోనా, డెంగూ, మలేరియా వంటిదంటూ ముందురాత్రి సదరు రైటర్స్, ఆర్టిస్ట్‌తో కలసి పీకల వరకు సేవించిన మందు బాపతు మైకం దిగనట్టే వాగాడు.

ఉచ్ఛనీచాలు లేకుండా ఉదయనిధి వాగిన వాగుడు ఆశ్చర్యం కలిగించదు. వీళ్లంతా నమ్ముతున్నట్టు నటించే ద్రవిడవాదం, దాని పెద్ద పెరియార్ హిందూ దేవతల విగ్రహాలకు చెప్పుల దండలు వేసి ఊరేగించి, 'ఏదీ నాకేం కాలేదే' అంటూ చంకలు గుద్దుకున్న కుసంస్కారి. ఏడుపదుల వయసులో రెండు పదుల యువతిని పెళ్లిచేసుకున్నా కూడా ద్రవిడ పైత్యవాదులకి ఆదర్శపురుషుడుగా

ఆ బూట్లు నాకిన వారసత్వం కదా!

నిలిచినవాడే ఆ పెరియార్ రామస్వామి. భారతదేశం నుంచి ద్రవిడస్తాన్ అనే ప్రత్యేక దేశమే కావాలని క్రిప్స్ మిషన్‌కు వినతిపత్రం ఇచ్చిన వేర్పాటువాది. తనను తాను జిన్నాతో పోల్చుకోవాలని అనుకున్నా, ఆ ముస్లిం మతోన్మాది సైతం పెరియార్‌ను ఛీకొట్టాడు. ఇంతకీ 'నీ వికారపు ద్రవిడవాదం దళితులకు ఏం చేసిందో చెబుతావా' అంటే ఇప్పటికీ డీఎంకే పార్టీ నుంచి సమాధానం లేదు. ఈ వారసత్వం ఉన్న అధములు, అంగుష్టమాత్రుల మాటలలో ఇంతకు మించిన మర్యాద ఎలా ఉంటుంది? ఇంతకు మించి ఏం సంస్కారం ఆశిస్తాం? ఈ ద్రవిడ పైత్యపు మర్కటానికి, తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఇస్తున్న విద్యుదాఘాతాలు వెర్రెత్తిస్తున్నాయి. అవినీతిలో కూరుకుపోయిన తమిళనాడు ప్రథమ కుటుంబం గుట్టును బోషాణాల కొద్దీ తవ్వి తీసి గవర్నర్‌కు పంపారు అన్నామలై. ఇదే ఈ ద్రవిడ నాయకమూకను హిందూత్వ మీద ఇంతగా రెచ్చిపోవడానికి ప్రేరేపించింది.

దేశంలో సనాతన ధర్మాన్నే పాటించేవారు 80 శాతం ఉన్నారు. వారందరిని మూకుమ్మడిగా చంపాలన్నదే ఈ వెండితెర గంధోళిగాడి ఆంతర్యమని చాలా మంది నిశ్చితాభిప్రాయం. ఇది మొగల్ వంశ నరహంతల; చంఘీజ్‌ఖాన్, తామర్లేన్ వంటివాళ్ల ఆంతర్యాన్ని వ్యక్తీకరిస్తున్న మాటే అది. ఈ జుగుప్స మీద హిందూ సంస్థలు, ప్రధానంగా సంఘ పరివార్ భగ్గుమన్న తరువాత కూడా ఈ విషపు పురుగుకు జన్మనిచ్చిన ముఖ్యమంత్రి స్టాలిన్ బీజేపీని అడ్డం పెట్టుకుని హిందూత్వం మీద ఇంకాస్త విషం కుమ్మరించారు.

పైగా ఈ వాగుడుకు కట్టుబడే ఉంటాడట ఉదయనిధి. న్యాయపరంగా ఎలాంటి సవాలుకైనా సిద్ధమట. మరి ఇలాంటి దారుణమైన విధ్వంసకర వాగుడు గురించి కోర్టులు పట్టించుకుంటాయా? మణిపూర్ సహా చాలా అంశాల మీద సూమోటోగా స్పందించిన భారతీయ న్యాయస్థానాలు సనాతన ధర్మావలంబీకులను నిశ్శేషం చేయాలంటూ అత్యంత ప్రమాదకర, విధ్వంసకర వాగుడు వాగితే దానిని సూమోటోగా విచారణకు స్వీకరిస్తాయా? వేచిచూద్దాం! ఇప్పటికైనా హిందువులు మేల్కొనడం అవసరం. నా ధర్మాన్ని సమూలంగా నిర్మూలించాలని మాట్లాడేవాడికి, ఆ ధర్మాన్ని పాటించే వాళ్లని మూకుమ్మడిగా నాశనం చేయాలని అనుకున్నవాడిని నా ఓటుతో ఎందుకు గెలిపించాలి? అన్న ప్రశ్న వేసుకోవాలి. హిందూధర్మాన్ని ఇంత కసిగా దూషిస్తున్న వీళ్లందరి దృష్టి ఎటు ఉంది? క్రైస్తవం మీద. లేదంటే ఇస్లాం మీద.

దీనికో కొసమెరుపు: తెల్లజాతి బూట్లు నాకిన జస్టిస్ పార్టీ, నాస్తికత్వాల అక్రమ సంతానం డీఎంకే పార్టీ నేత ఈ సభలో ఒక పుస్తకం విడుదల చేశాడు. స్వతంత్ర సమరంలో ఆర్ఎస్ఎస్ అని కాబోలు దాని పేరు. అందులో రెండు తప్ప మిగిలినవి తెల్ల కాగితాలట. ఆ రెండింటిలో ఒకటి గాంధీ హత్య ఫోటోనట. రెండోపేజీలో సావర్కర్‌పై ప్రేలాపన తెల్లజాతి బూట్ల తీపి ఇంకా ఈ నాలుకల నుంచి వదల్లేదు. వాళ్లు నూరిపోసిన భారత విధ్వంసం సిద్ధాంతం ఆ మెదళ్ల నుంచి పోలేదు.ఈ కేన్సర్‌కు తొలికణం పెరియార్ అన్నమాటగా ఒకటి ప్రాచుర్యంలో ఉంది. 'మీ అడుగు అవుపేడలో పడకూడ దని అనుకుంటూనే మలంలో వేయించాను' అన్నాడట. ఇదైనా హిందువు లందరూ గుర్తించాలి. సనాతన ధర్మాన్ని పెకలించాలన్న క్రూర ఆలోచన ఉన్న డీఎంకేనే నిర్మూలించడానికి భారతజాతి కంకణం కట్టుకోవాలి. ★

కథ

స్నేహం

- యర్రమిల్లి ప్రభాకరరావు

సులభ్ - స్వచ్ఛ భారత్ మిషన్.. (నివాళి) - 14
మహా సంకల్పం-17 (ధారావాహిక నవల) - 20
మహాదొడ్డ నాయకుడు- మన వినాయకుడు (ప్రత్యేక వ్యాసం) - 23
విశ్వకర్మ యోజన: గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు.. (కొత్తచూపు) - 26
విజయపంతమైన ఆదిత్య ఎల్-1 (ముఖపత్ర కథనం) - 28
విద్యుత్ విధానంపై వైసీపీ తీవ్ర వైఫల్యం (వేదిక) - 38
భారత క్రీడారంగంపై మోదీ ముద్ర (క్రీడ) - 43
పరాజయాల పోలికతో గట్టెక్కిన 'ఖుషి' (సినిమా) - 50

సరిలేరు నీకెవ్వరు!

భారతదేశంలో ప్రతి పదిమందిలో ఎనిమిది మంది ప్రధాని, బీజేపీ నాయకుడు నరేంద్ర దామోదరదాస్ మోదీకి జేజేలు పలుకుతున్నారు. విశ్వసనీయ సర్వేలకు ప్రసిద్ధిగాంచిన ప్యూ రిసెర్చ్ సెంటర్ ఈ విషయాలు వెల్లడించింది. భారత ప్రతిష్ట ప్రపంచ వ్యాప్తంగా పెరిగిందని ప్రతి పదిమంది భారతీయులలో ఏడుగురు సగర్వంగా చెబుతున్నట్టు ప్యూ సర్వే తెలియచేసింది. మోదీ ఇంట గెలవడమే కాదు, రచ్చ గెలుస్తున్నారు కూడా. భారత్‌లో ఏర్పాటైన జి 20 ప్రపంచ సదస్సు నేపథ్యంలో ఈ సర్వే వెలువడింది. విదేశీయులు కూడా భారత్ పట్ల సానుకూలంగా స్పందించారు. భారత్ సహా 24 దేశాలలో, 30,000 మంది అభిప్రాయాలను ఇందుకు స్వీకరించారు.



23 దేశాలలో భారత్ పట్ల ఈ సానుకూల దృక్పథం వెల్లడైంది. ఆ దేశాలలో 46 శాతం భారత్ పట్ల సానుకూలత వ్యక్తం కాగా, 34 శాతం ప్రతికూలత కనిపించింది. 16 శాతం దేశాలలో ఎలాంటి అభిప్రాయం వ్యక్తం కాలేదు. ప్రపంచంలో అత్యంత ఎక్కువగా భారత్‌ను అభిమానిస్తున్న దేశం ఇజ్రాయెల్. ఇక్కడ 71 శాతం భారత్ పట్ల సానుకూలత ప్రకటించారు.బ్రిటిషర్లు కూడా 66 శాతం భారత్ పట్ల సానుకూలంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. అమెరికాలో 51 శాతం భారత్ పట్ల సదభిప్రాయంతో ఉన్నారు. 1952 నాటికి అమెరికా వారి దృష్టిలో భారత్ అంటే పాములు పట్టుకునే వాళ్లు ఉండే దేశం. కెన్యా, నైజీరియా, యూకేలలో కూడా సానుకూలతే వ్యక్తమైంది. కానీ దక్షిణాఫ్రికా ప్రజలు భారత్ పట్ల విమర్శనాత్మక

దేశ హితానికే విదేశీ

జాతి హితం కోసం దేశాధినేత చేసే విదేశీ పర్యటనలు సత్ఫలితాలనివ్వడమే కాదు, దేశ కీర్తి ప్రతిష్టలను శిఖర సమాన స్థాయికి తీసుకెళతాయని చెప్పడానికి నరేంద్రమోదీ ప్రధాని హోదాలో చేసిన విదేశీ పర్యటనలే గొప్ప ఉదాహరణ. ఇతర దేశాలకు మనపై ఉన్న అభిప్రాయాలను సానుకూలంగా మార్చుకోవడానికి ముఖాముఖి దౌత్యం అవసరం. దీన్ని గుర్తించకుండా, పర్యటనల ఖర్చు గురించి మాట్లాడే విపక్షాలు, ఆ పర్యటనలు సాధించిన విజయాలను విస్మరించడం విషాదం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించినప్పటికీ, తటస్థ వైఖరి అనుసరిస్తూ ఈ రెండు శిబిరాల మధ్య సమన్వయంతో దౌత్యాన్ని నెరపుతున్న దేశం భారత్ మాత్రమే. రష్యాతో పటిష్ట స్నేహాన్ని కొనసాగిస్తుండగానే, అగ్రరాజ్యం అమెరికా గతంలో ఎన్నడూ లేనివిధంగా యుద్ధ విమాన ఇంజన్ల టెక్నాలజీ బదలాయింపునకు అంగీకరించిందంటే ఈ

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

పర్యటనలతో పాటు పటిష్ట దౌత్యం కారణం. యు.కె., ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, పోర్చుగల్ వంటి యూరప్ దేశాలతో భారత్ సంబంధాలు మరింత బలోపేతం కావడం, యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం విషయంలో చర్చలు తిరిగి ప్రారంభమవడం, ఇండో-నార్డిక్ సదస్సును (నవీకరణలు, వాతావరణం, తయారీ అంశాలకు ఈ సదస్సు ప్రాధాన్యతనిస్తుంది) మనదేశం ప్రారంభించడం వంటి గొప్ప విజయాలు మోదీ రాజనీతిజ్ఞతతో కూడిన విస్తృత పర్యటనలతో పాటు, దౌత్యం వల్లనే సాధ్యమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు పసిఫిక్ ద్వీపకల్ప దేశాలతో సహా ఆఫ్రికా, యూరప్, లాటిన్ అమెరికా దేశాల్లో విస్తృతంగా ఫలితంగా18 ఆఫ్రికా దేశాల్లో భారత రాయబార కార్యాలయాలను తెరవాలన్న కీలక నిర్ణయం జరిగింది. పరాగ్వే, డొమెనికన్ రిపబ్లిక్, ఇస్తోనియా, లిథియేనియా వంటి దేశాల్లో భారత్ అడుగు పెట్టింది. భారత్ ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్‌లో ప్రస్తుతం వంద దేశాలు భాగస్వాములు! చంద్రయాన్-3 విజయవంతమైన నేపథ్యంలో భారత్ స్పేస్ ప్రోగ్రామ్‌లో సహకారం కోసం 60 చిన్న, పేద దేశాలతో ఒప్పందాలు చేసుకుంది. ఇందులో ఆఫ్రికా దేశాలు కూడా ఉన్నాయి. ఈ విధంగా ఒకవైపు ధనికరాజ్యాలతో మరోవైపు పేదదేశాలతో సమన్వయంతో కూడిన స్నేహసంబంధాలు నెరపడం ఒక్క భారత్‌కే సాధ్యమన్నది వర్తమాన చరిత్ర చెబుతున్న సత్యం. నేడు మనదేశం ఆస్ట్రేలియా గ్రూప్ (ఏజీ), మిస్సైల్ టెక్నాలజీ కంట్రోల్ రిజైమ్ (ఎంటీసీఆర్), వాసెనార్ అరేంజ్‌మెంట్ (డబ్ల్యూఏ) అనే మూడు "నాన్ ప్రొలిఫరేషన్ ఎక్స్‌పోర్ట్ కంట్రోల్ రిజైమ్స్‌లో సభ్యురాలు. అణుసరఫరా దేశాల్లో సభ్యత్వం కోసం భారత్ ప్రయత్నాలు సాగిస్తోంది. కేవలం చైనా సైంధవ పాత్రే మనకు సభ్యత్వం లభించడంలో జాప్యానికి కారణం. యాక్ట్ ఈస్ట్ పాలసీని మరింత విస్తరించడంతో సెంట్రల్ ఆసియా, ఆసియన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా దేశాలతో సంబంధాలు మంచి ఫలితాలి స్తున్నాయి.

ప్రధాని నరేంద్రమోదీ పర్యటనలు

ప్రధాని నరేంద్రమోదీ 2014 నుంచి ఇప్పటి వరకు జరిపిన 71 విదేశీ పర్యటనల్లో 66 దేశాలను సందర్శించారు. ఇందులో అమెరికా, ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ పర్యటనకూడా ఉన్నాయి. కొవిడ్ మహమ్మారి కాలంలో ఆయన విదేశీ

వైఖరితో ఉన్నారు. కొంత సిద్ధాంతపరమైన ఏకాత్మకత హంగెరి, ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్‌లలో భారత్ పట్ల మొగ్గుకు కారణమైందని సర్వే వ్యాఖ్యానించింది. వామపక్ష, ఉదారవాదాల ప్రభావాలలో ఉన్న దేశాలలో ఇంత సానుకూలత వ్యక్తం కాలేదు.

భారతీయులలో 55 శాతం మోదీ అంటే గాఢాభిమానం వ్యక్తం చేశారు.

పసిఫిక్ ద్వీప దేశాల ఐక్యతకోసం కృషికి, గ్లోబల్ సౌత్‌కు నేతృత్వం వహిస్తున్నందుకు పపువా న్యూ గ్యునియా దేశ అత్యున్నత పురస్కారమైన "కాంపేనియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ లోగోహు" పురస్కారాన్ని మోదీకి అందజేశారు. గ్లోబల్ లీడర్‌షిప్‌కు గుర్తుగా ఫిజి ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత పురస్కారం "కాంపేనియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ"ని ప్రదానం చేశారు. 2014, నవంబర్ 19న ఫిజిలో పర్యటించినప్పుడు, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరిగాయి. ఇదే సమయంలో 14 ఇండో-పసిఫిక్ ద్వీపదేశాల అధినేతలతో చర్చలు జరిపి "ఫోరం ఫర్ ఇండియా-పసిఫిక్ ఐలాండ్స్ కోఆపరేషన్" (ఎఫ్ఐపిఐసీ) ఏర్పాటుకు ప్రతిపాదించారు. మోదీ పర్యటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నవంబర్ 21, 2014న హడావుడిగా ఇవే ద్వీప దేశాల్లో పర్యటించడం గమనార్హం. ప్రపంచ నాయకత్వ స్థాయికి ఎదిగిందని చెప్పడానికి ఇవి గొప్ప ఉదాహరణలు. ఇది మోదీకి ఈ ఏటి జన్మదిన కానుకగా చెప్పవచ్చు. మోదీకి జన్మదిన శుభాకాంక్షలు.

యాత్రలు

పర్యటనలు తగ్గిపోయాయి. ఈ తొమ్మిదేళ్ల కాలంలో ఆయన అత్యధికంగా అంటే 8సార్లు పర్యటించిన దేశం అమెరికా కాగా, 7సార్లు పర్యటించిన దేశాలు ఫ్రాన్స్, జపాన్‌లు. ఇక జర్మనీ (6సార్లు), చైనా, నేపాల్, రష్యా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (5సార్లు), సింగపూర్ (4సార్లు), దక్షిణాఫ్రికా, శ్రీలంక, యునైటెడ్ కింగ్‌డమ్, ఉజ్బెకిస్తా న్ (3సార్లు), కాగా 15 దేశాలను రెండుసార్లు, 38 దేశాలను ఒక్కసారి సందర్శించారు. వీటిద్వారా అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై భారత్ అనుసరిస్తున్న విదేశీ విధానాన్ని ఆయన ఆయా దేశాలకు స్పష్టంగా చెప్పగలిగారు. ఆవిధంగా మనదేశంపై అప్పటివరకు ఉన్న ప్రపంచ దేశాల దృక్కోణాన్ని సమూలంగా మార్చివేగలగడమేకాదు, దేశాన్ని గ్లోబర్ లీడర్ స్థాయికి తీసుకెళ్లారు. సోవియట్ యూనియన్ పతనంతో అమెరికా ఆధిపత్యంతో ఏకధృవాత్మక ప్రపంచాన్ని, బహుళ పాక్షిక ప్రపంచంగా మార్చాలన్న అవసరాన్ని ఆయన ప్రపంచం దృష్టికి తీసుకెళ్లారు. వాతావరణమార్పులు, ఉగ్రవాదం, సైబర్ సెక్యూరిటీ అంశాలపై ప్రపంచం ప్రధానంగా దృష్టిసారించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పడమే కాదు, అప్పటివరకు ఉన్న ఆయా దేశాల ఆలోచనా ధోరణుల్లో మార్పు తీసుకొనిరాగలిగారు. నేడు ప్రపంచంలోని 201 దేశాలతో భారత్ దౌత్య సంబంధాలు నెరపుతోంది. వీటిల్లో పాలస్తీనా, హోలీ సీ (దీన్నే సీ ఆఫ్ రోమ్, పెట్రీన్ సీ, అపోస్టోలిక్ సీ, గవర్నమెంట్ ఆఫ్ వాటికన్ సిటీ అనే పేర్లతో కూడా పిలుస్తారు), నియు (న్యూజిలాండ్‌లోని స్వయంపాలిత ప్రాంతం) కూడా ఉన్నాయి.

ముస్లిం దేశాలతో బలమైన స్నేహం

మోదీ నాయకత్వంలో ముస్లిం దేశాలతో సంబంధాలు బలోపేతమయ్యాయి. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో మనదేశంతో గతంలో ఎన్నడూ లేని రీతిలో సాన్నిహిత్యంగా ఉంటున్నాయంటే మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానమే కారణం. ఇక పశ్చిమాసియా/మధ్యప్రాచ్య దేశాలతో కూడా భారత్ సంబంధాలు సుస్థిరంగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఆరు గల్ఫ్ సహకార దేశాలతో భారత్ సంబంధాలు కీలకం. ఎందుకంటే దాదాపు 8 మిలియన్ల మంది భారతీయులు ఈ దేశాల్లో ఉపాధి పొందుతున్నారు. వీరి భద్రతకు మోదీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఇటీవలనే భారత్ యు.ఎ.ఇ.తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 2015లో ప్రధాని హోదాలో నరేంద్ర మోదీ సందర్శించిన మొట్టమొదటి గల్ఫ్ దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్. అంతకుముందు 34 సంవత్సరాల కాలంలో ఆ దేశాన్ని సందర్శించిన మొట్టమొదటి

ప్రధాని మోదీ. మనదేశంలో మౌలిక సదుపాయాల విస్తరణకు యు.ఎ.ఇ.75 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాలన్న లక్ష్యాన్ని ఇరు దేశాలు నిర్దేశించుకున్నాయి. ఉగ్రవాద నిరోధం, మనీలాండరింగ్‌ను అరికట్టడం వంటి అంశాల్లో భారత్– గల్ఫ్ దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు కొనసాగుతున్నాయి. పశ్చిమా సియా/మధ్యప్రాచ్య దేశాల్లో సౌదీ అరేబియా, యు.ఎ.ఇ, బహ్రైన్, పాలస్తీనా వంటి దేశాలు అత్యున్నత అవార్డులతో ప్రధానిని సత్కరించాయి. ఈ దేశాలతో మనదేశానికి ఒకవైపు సంబంధాలు పెరుగుతుండగా, పాకిస్తాన్‌తో వీటి అనుబంధం తగ్గుతూ రావడం గమనార్హం. ఫలితంగా భారత్–పాకిస్తాన్ సమస్యల విషయంలో పాకిస్తాన్‌కు వీటి మద్దతు తగ్గిపోవడం మోదీ ప్రభుత్వం దౌత్యపరంగా సాధించిన విజయం. ఇదే సమయంలో వీటికి బద్ధవిరోధి ఇజ్రాయిల్‌తో మన సంబంధాలు అత్యంత బలీయంగా కొనసాగుతున్నాయి. 2017లో ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయిల్‌ను సందర్శించారు. ఆవిధంగా ఈ దేశాన్ని సందర్శించిన తొలి ప్రధానిగా చరిత్ర సృష్టించారు. ఇదే సమయంలో ఐ1యూ2 (ఇజ్రాయిల్–ఇండియా, యుఎస్–యుఎఇ) ఏర్పాటు కూడా ఇజ్రాయిల్–గల్ఫ్‌దేశాల మధ్య నెలకొన్న అగాధాన్ని తొలగించింది. ఆవిధంగా బద్ధవిరోధ దేశాలను కూడా మన దౌత్యం దగ్గర చేస్తున్నది.

వ్యాక్సిన్ క్యాపిటల్‌గా...

మనం అనుసరిస్తున్న "వసుదైక కుటుంబకం" విధానం ఇప్పుడు అన్నిదేశా ల్లో మంచి పేరుతెచ్చి పెట్టింది. ముఖ్యంగా కోవిడ్‌మహమ్మారి విస్తరిస్తున్న కాలంలో అభివృద్ధి చెందిన దేశాలు, వ్యాక్సిన్ పేటెంట్ హక్కులను తాత్కాలికంగా రద్దు చేసేందుకు అంగీకరించకపోవడంతో, మనదేశం వంద దేశాల తరపున ఈ వైఖరిని ఖండించింది. మనదేశంలోనే

వ్యాక్సిన్లను తయారుచేసి 300 మిలియన్ల వ్యాక్సిన్లను వందకు మించిన దేశాలకు ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు సరఫరా చేయడం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలందుకుంది. దేశీయంగా 2.2 బిలియన్ డోస్‌లను ప్రజలకు ఇవ్వడం ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తేలా చేసింది. ఇదే సమయంలో దేశం 'వ్యాక్సిన్ క్యాపిటల్'గా ఎదగడం విశేషం.

భారత్‌కే సాధ్యం

ఇటీవలికాలంలో ప్రధాని నరేంద్రమోదీ మూడు దేశాల్లో పర్యటించారు. 12 మంది ప్రపంచ నాయకులతో చర్చలు జరపడమే కాదు, 3 సదస్సుల్లో పాల్గొన్నారు. జీ–7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా జపాన్ ప్రధానితో సహా పలువురు నాయకులను కలుసుకొని అంతర్జాతీయ పరిణామాలపై చర్చించారు. వీరిలో అమెరికా అధ్యక్షులు జో బైడెన్, ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్‌స్కీ, యు.కె. ప్రధాని రుషి సౌనక్‌లున్నారు. ఈ ఏడాది మే 20న హిరోషిమాలో జరిగిన క్వాడ్ సమావేశంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిడా, అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో సమావేశమయ్యారు. చైనాకు వ్యతిరేకంగా ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి సుస్థిరలకోసం ఏర్పాటు చేసిన "క్వాడ్ గ్రూపు"లో భారత్ సభ్యురాలు. ఇదే సమయంలో పశ్చిమ దేశాల ఆధిపత్యానికి, జీ–7 దేశాలకు దీటుగా ఏర్పాటు చేసిన "బ్రిక్స్"లోనూ మనదేశం భాగస్వామి. అంతేకాదు "షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్"లో కూడా సభ్యత్వాన్ని కలిగివుంది. ఈవిధంగా పరస్పర వైరుధ్య దేశాలతో వ్యవహరించే విధానం భారత్ సొంతం. ఇప్పటి వరకు మరే ఇతర దేశానికి ఈ "దౌత్య నైపుణ్యం" సాధ్యం కాలేదు.

నైబర్ ఫస్ట్ విధానం

ప్రధాని పదవిని చేపట్టిన దగ్గరినుంచి ప్రధాని ''నైబర్ ఫస్ట్'' విధానాన్ని అనురిస్తున్నారు. బంగ్లాదేశ్‌తో మన సంబంధాలు 1975 తర్వాత ఎన్నడూ లేని స్థాయిలో అభివృద్ధి చెందాయి. 2015, జూన్, 2021 మార్చిలో మోదీ ఢాకా పర్యటన, 2017, ఏప్రిల్, 2019 సెప్టెంబర్‌లో షేక్ హసీనా భారత్ పర్యటన రెండు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేశాయి. 2014లో మోదీ మొట్టమొదటి సారి నేపాల్‌లో పర్యటించారు. 17 సంవత్సరాల తర్వాత మొట్టమొదటిసారి ప్రధాని ద్వైపాక్షిక సందర్శన రెండుదేశాల సంబంధాలను మరింత సుస్థిరం చేసింది. ఆతర్వాత 2018లో జనక్‌పూర్‌కు, 2022లో లుంబినికి ప్రధాని వెళ్లారు. ఈ రెండూ ద్వైపాక్షిక పర్యటనలు కాగా, 2014లో సార్క్ సమావేశానికి, 2018, ఆగస్టులో బిమ్‌స్టిక్ సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని నేపాల్ వెళ్లారు. నేపాల్ ప్రధానిగా కె.పి. శర్మ ఓలి పదవిని చేపట్టిన తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు ఇబ్బందులకు లోనైనప్పటికీ, ఆయన పదవీచ్యుతితో మళ్లీ మామూలు స్థాయికి చేరుకున్నాయి. 2015లో

'కార్టూన్ పోటీ - 2023'లో ప్రోత్సాహక బహుమతికి ఎంపికైనది



ప్రధాని హోదాలో నరేంద్రమోదీ మొట్టమొదటిసారి శ్రీలంకకు "సముద్రయాత్ర" చేశారు. 28 సంవత్సరాల తర్వాత మనదేశ ప్రధాని జరిపిన తొలి ద్వైపాక్షిక యాత్ర ఇది. ఇటీవలి కాలంలో ఆర్థికంగా కుప్పకూలిన శ్రీలంకకు భారత్ 4 బిలియన్ డాలర్లు ఉదారంగా సహాయం అందించి నిజమైన మిత్రుడెవరో తెలిసేలా చేసింది. ఇక పాకిస్తాన్ విషయానికి వస్తే, ఉగ్రవాదాన్ని ఎగదోసే ప్రక్రియను నిలిపేస్తేనే శాంతి చర్చలు జరుపుతామని స్పష్టం చేసింది. హింస-శాంతి ఒకేసారి సాధ్యం కాదని తెగేసి చెప్పింది. పుల్వామా దాడులకు ప్రతీకారంగా 2016లో బాలాకోట్ దాడులు జరిపింది. ఆక్రమించిన కశ్మీర్ ప్రాంతాన్ని ఖాళీచేయాలని పాక్‌ను తీవ్రంగా హెచ్చరించింది. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాక్ విషయంలో మనదేశ వైఖరి పూర్తి కఠినంగా మారిపోయింది. ఆఫ్ఘనిస్తాన్‌కు 3బిలియన్ డాలర్ల విలువైన ఆహార పదార్థాలు, మందులను భారత్ అందించింది. తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించకపోయినప్పటికీ గోధుమలు, ఇతర మానవతా సహాయాన్ని భారత్ అందిస్తూనే ఉంది. కాబూల్‌లో రాయబార కార్యాలయాన్ని ప్రారంభించింది. ఇదే సమయంలో పాక్-ఆఫ్గనిస్తాన్‌లలో పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులు ఉన్న నేపథ్యంలో భారత్ తన జాగ్రత్తలో తాను మెలుగుతూనే ఉంది. 2018లో మాల్దీవుల్లో భారత వ్యతిరేక అబ్దుల్లా యామీన్ ప్రభుత్వం పడిపోయి ఇబ్రహీం సోలె అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు దేశాల సంబంధాలు పురోభివృద్ధి సాధించాయి.

చైనాతో ఇబ్బందులు

చైనాతో సంబంధాలు గల్వాన్ సంఘర్షణ తర్వాత మరింతగా క్షీణించాయి. తాజాగా అరుణాచల్ ప్రదేశ్‌ను, అక్సాయ్‌చిన్‌ను తమ దేశంలో భాగాలుగా చూపుతూ మళ్లీ చైనా పితలాటకాన్ని లేవదీయడం, దీన్ని భారత్ తీవ్రంగా ఖండించడం వరుస పరిణామాలు. ఆఫ్రికాలో జరిగిన బ్రిక్స్ సమావేశంలో మోదీ, షీ జిన్‌పింగ్‌లు పాల్గొన్నారు. కానీ ఇప్పుడు సెప్టెంబర్ జి-20 దేశాల సదస్సుకు చైనా అధ్యక్షుడు దుమ్మా కొట్టవచ్చన్న వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా బ్రిక్స్ సదస్సులో చైనా ఆధిపత్య ధోరణిని భారత్ విజయవంతంగా అడ్డుకున్న నేపథ్యంలోనే, చైనా అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకొని ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

యుఎస్, జపాన్, ఆస్ట్రేలియాలతో

గత తొమ్మిదేళ్ల కాలంలో భారత్-యుఎస్ సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి ఎదిగాయి. ప్రధాని మోదీ ఈ కాలంలో ముగ్గురు అమెరికా అధ్యక్షులతో పనిచేశారు. వీరు ముగ్గురితో ఆయన మంచి స్నేహ సంబంధాలను కొనసాగించారు. రెండు దేశాల మధ్య దాదాపు 60 అంశాల్లో బలీయ సంబంధాలు కొనసాగుతున్నాయి. అమెరికాతో భారత్ అత్యధిక సైనిక విన్యాసాలు జరుపుతోంది. ఒకవిధంగా చెప్పాలంటే చైనా అనుసరిస్తున్న విస్తరణ విధానాలు, దుందుడుకు వైఖరే భారత్-అమెరికాలను సన్ని హితం చేశాయని చెప్పవచ్చు. జపాన్-ఆస్ట్రేలియా దేశాలతో రాజకీయ, రక్షణ, ఆర్థిక, వ్యూహాత్మక రంగాల్లో సంబంధాలు ఇటీవలి కాలంలో మరింత ఊపందుకున్నాయి. 2023 మార్చిలో జపాన్ ప్రధాని ఫ్యుమియో కిషిదా మనదేశంలో పర్యటించారు. అయితే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో జపాన్ సరికొత్త దృక్పథంతో వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసింది. ఇదే నెలలో భారత్ సందర్శిం చిన ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మనదేశాన్ని అత్యున్నత స్థాయి భద్రత భాగస్వామిగా ప్రకటిం చారు.

జి-20 నాయకత్వం

ప్రస్తుతం జి-20 అధ్యక్ష రాలిగా ఉన్న భారత్ 'వసుదైక కుటుంబం' అంటే "ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే లక్ష్యంతో ముందుకెళుతోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా నరళరా శృంఖాలు తీవ్రంగా దెబ్బతిన్న తరుణంలో, భారత్‌పై ప్రపంచ దేశాలు గొప్ప ఆశలు పెట్టుకున్నాయి. ముఖ్యంగా ఇటు రష్యాతో అటు పశ్చిమ దేశాలతో సన్నిహిత సంబంధాలు నెరపుతున్న నేపథ్యంలో ఈ సమస్యకు పరిష్కారం భారత్ వల్లనే సాధ్య మన్న దృఢవిశ్వాసం ప్రపంచ దేశాల్లో వ్యక్తమవుతోంది. గతంలో జి-20 అధ్యక్షత స్థానం వహించిన దేశాలకు భిన్నంగా ప్రస్తుతం భారత్ ముందుకెళుతోంది. ఇందులో భాగమే గత జనవరిలో "గ్లోబల్ సౌత్ సదస్సు" నిర్వహణ. ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ప్రాంతాలకు చెందిన అభివృద్ధి చెందిన దేశాల సమస్యలను తెలుసుకొని, వాటిని జి-20 నదస్సులో ప్రస్తావించడమే దీని లక్ష్యం. దాదాపు 125 దేశాలు ఈ సదస్సులో పాల్గొనడం విశేషం. ఈవిధంగా గ్లోబల్ సౌత్‌కు నాయకత్వం వహించే స్థాయికి ఎదిగింది.

దేశ ప్రయోజనాలే ముఖ్యం

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమ దేశాలనుంచి ఎంతగా వత్తిడి వచ్చినా లొంగకుండా దేశ ప్రయోజనాలకే మోదీ ప్రభుత్వం పెద్దపీట వేసి రష్యాతో సంబంధాలు కొనసాగిస్తోంది. విచిత్రమేమంటే రష్యాపై కూడా ఆంక్షలు విధించిన పశ్చిమ దేశాలు భారత్‌పై ఆపని చేయలేకపోయాయి. అదీ భారత్ సత్తా అంటే! ఈ యుద్ధం నేపథ్యంలో ఐక్యరాజ్య సమితిలో రష్యా విషయంలో భారత్ తటస్థ వైఖరినే అనుసరిస్తోంది. ఇదే సమయంలో రష్యా నుంచి క్రూడాయిల్ దిగుమతులు మనదేశానికి పెద్దమొత్తంలో పెరగడం ఈ యుద్ధం తెచ్చిన పరిణామం. ఇదే సయంలో ఉక్రెయిన్ ప్రజలకు మానవతా సహాయాన్ని భారత్ అందిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 10-12 తేదీల్లో ఉక్రెయిన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి ఎమైన్ జపరోవా మనదేశంలో పర్యటన కారణంగా, భారత్-ఉక్రెయినల్ మధ్య సహకారం, అవగాహనకు అవకాశం ఏర్పడిన అంశాన్ని ఇక్కడ గుర్తుంచుకోవాలి. విచిత్రమేమంటే

బ్రిక్స్ సమావేశంలో (జొహెన్నెస్‌బర్గ్) దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసాతో మోదీ

ఈ యుద్ధం కారణంగా చైనా-రష్యాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావడం, రష్యా క్రమంగా చైనాకు అనుయాయిగా మారుతున్న నేపథ్యం భారత్‌కు ఇబ్బంది కలిగించే అంశం. భారత్‌నుంచి రష్యాను మరింత దూరం చేయడానికి పశ్చిమ దేశాలు ఎట్లా కృషి చేస్తున్నాయో, చైనా కూడా అదే మాదిరి యత్నిస్తున్నది. ఈ నెలలో జి-20 సదస్సుకు పుతిన్ హాజరు కాకపోవడం వెనుక చైనా ప్రమేయం ఉన్నదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ అంతర్జాతీయంగా రష్యాను ఎప్పటి కప్పుడు దౌత్యపరంగా ఆదుకోగలిగిన దేశం భారత్ మాత్రమే. ఈ విషయం పుతిన్‌కు తెలియంది కాదు. నాటి సోవియట్ యూనియన్ అందించిన సహాయాన్ని భారత్ ఎన్నడూ మరచిపోదు. స్నేహధర్మాన్ని విడనాడదు! ★



మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

'ఒకే దేశం ఒకే ఎన్నిక' సాధ్యమే!

ఒకే దేశం ఒకే ఎన్నిక (వన్ నేషన్- వన్ ఎలక్షన్) లేదా ఒకే దేశం ఒకేసారి ఎన్నికలు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిజేపీ చెబుతున్న అంశం. తాజాగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాలకు పిలుపును ఇవ్వడంతో ఈ అంశం మరోసారి చర్చకు వచ్చింది. దీని సాధ్యాసాధ్యాల పరిశీలనకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ఏడుగురు సభ్యులతో కేంద్రం ఓ కమిటీని కూడా ఏర్పాటు చేయడం, ఎన్నికల నిర్వహణలో సమూల మార్పులు తీసుకువచ్చేందుకు కూడా కేంద్రం యోచిస్తున్నట్లు జోరుగా చర్చ మొదలు కావడంతో దేశం దృష్టి ఇటు మళ్లింది.

గతంలో దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు జరిగినా, వివిధ కారణాలతో ఆ విధానం కొనసాగ లేదు. అయితే ఒకేసారి ఎన్నికలు అంత తేలికైన పని కాదు. ఇది కేంద్రానికి తెలియనిదీ కాదు. కాని సాధ్యమే. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నిర్వహణ. సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. పలు కీలక బిల్లులతో పాటు జమిలి ఎన్నికలకు సంబం ధించి బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందనే వార్తలు వస్తున్నాయి.

రాష్ట్రాల అసెంబ్లీలు, లోక్‌సభకు దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరగడమే జమిలీ ఎన్నికలు. అదే ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలతోపాటు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వ హిస్తున్నారు. మిగతా రాష్ట్రాల్లో వివిధ సమయాల్లో ఆయా శాసనసభలకు ఎన్నికలు జరుగుతున్నాయి.

అయితే ఈ ఒకే దేశం ఒకే ఎన్నిక అమల్లోకి



ఒకే దేశం ఒకేసారి ఎన్నికల అంశాన్ని పరిశీలించేందుకు న్యాయ మంత్రిత్వ శాఖ నియమించిన సంఘంలోని ఎనిమిది మంది సభ్యులు–

రామ్‌నాథ్ కోవింద్ (మాజీ రాష్ట్రపతి, కమిటీ అధ్యక్షుడు), అమిత్‌షా, అధీర్ రంజన్ చౌధురి (తాను కమిటీలో ఉండబోనని ప్రకటించారు), గులాం నబీ ఆజాద్, ఎన్‌కె సింగ్, సి. సుభాశ్ కాశ్యప్, హరీశ్ సాల్వే, సంజయ్ కొఠారి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ప్రత్యేక ఆహ్వానితునిగా సమావేశాలకు హాజరవుతారు. ఈ ప్యానెల్ కార్యదర్శిగా న్యాయ వ్యవహారాల కార్యదర్శి నితేన్ చంద్ర వ్యవహరిస్తారు.



తీసుకురావడం అంత తేలికైన విషయం కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు కాని ప్రయత్నం చేస్తే సాధ్యమే అంటున్నారు విశ్లేషకులు. దీనికి సంబంధించిన బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందాలంటే రాజ్యాంగ సవరణలు చేయాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఈ సవరణలకు లోక్‌సభలోని 543 స్థానాల్లో కనీసం 67 శాతం మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటు వేయాలి. అటు రాజ్యసభలోని 245 సీట్లలో 67 శాతం ఈ బిల్లును సమర్థించాల్సి ఉంటుంది. దీనికి అదనంగా దేశంలో ఉన్న రాష్ట్రాల్లో కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఈ ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లుకు ఆమోద ముద్ర వేయాల్సి ఉంటుంది.

జమిలి ఎన్నికల బిల్లు ఆమోదం పొందాలంటే 14 రాష్ట్రాలు సమర్థిస్తూ తీర్మానం చేయాలి. ప్రస్తుతం 10 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది. ఇక బీజేపీకి మద్దతు ఇచ్చే పార్టీలు మరో 6 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయి. లోక్‌సభలో ఎన్డీఏ కూటమికి దాదాపు 333 సీట్ల బలం ఉంది. 543 స్థానాలకు గానూ ఈ 333 సీట్లు అంటే 61శాతానికి సమానం. మరో 6 శాతం ఓటింగ్‌ను సంపాదించడం ఎన్డీఏ కూటమికి కష్టమేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇక అటు రాజ్యసభలో 38 శాతం సీట్లు మాత్రమే ఎన్డీఏకు ఉండటంతో అసలు ఈ జమిలీ ఎన్నికల బిల్లు ఆమోదం పొందుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కానీ గతంలో ఇలాంటి పరిస్థితుల నుండి చాలా బిల్లులను పార్లమెంట్‌లో బీజేపీ నెగ్గించుకుంది.

అసలు జమిలి ఎన్నికల అవసరం ఏమిటి? రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభ ఎన్నికల కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తోంది. వేర్వేరు సమయాల్లో ఎన్నికలు నిర్వహించడం వల్లే ఖర్చు అత్యధికంగా ఉంటోందని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఇలా ప్రజా ధనం వృథా అవుతోందని దాన్ని అరికట్టేందుకే జమిలి ఎన్నికలను తీసుకురావాల్సిన అవసరం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ. 10వేల కోట్లు ఖర్చు చేసినట్లు అంచనా. అదే సమయంలో ఒక్కో రాష్ట్రానికి సంబంధించిన ఎన్నికలను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 250 కోట్ల నుంచి రూ. 500 కోట్ల దాకా వెచ్చిస్తోంది. వీటికి తోడు ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలుచేసే ఖర్చును కూడా లెక్కపెడితే ఆశ్చర్యపోవాల్సిందే. 2019 లోక్‌సభ ఎన్నికలకు అన్ని పార్టీలు కలిపి దాదాపు రూ. 60 వేల కోట్లు ఖర్చు చేశాయని అప్పట్లో సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ సంస్థ తెలిపింది. దీంతో భారత దేశ చరిత్రలోనే 2019 లోక్‌సభ ఎన్నికలు అత్యంత ఖరీదైనవిగా నిలిచాయి.

లోక్‌సభ, అసెంబ్లీలకు కలిపి ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే.. భారీగా ప్రభుత్వ ధనం వృధా తగ్గి, ఖర్చులు కలిసి వస్తాయని భావిస్తోంది. దీంతోపాటు అధికార యంత్రాంగాన్ని కూడా సమర్థంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. సాధారణంగా అధికారులు ఎన్నికల విధుల్లో పూర్తిగా నిమగ్నమై ఉంటే పరిపాలనపై ప్రభావం పడుతుంది. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే సమయం ఆదాతో పాటు రెండుసార్లు ఎన్నికలు జరగకుండా వారు పరిపాలనపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుంది. దీంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుకు తరచూ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడం కూడా తగ్గుతుంది. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఓటర్లు ఒకేసారి వచ్చి ఓటింగ్ వేయడం వల్ల పోలింగ్ శాతం కూడా పెరుగుతుందని లా కమిషన్ వెల్లడించింది.

అయితే జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా కొన్ని రాజ్యాంగ సవరణలు తీసుకు రావాలి. ప్రజా ప్రాతినిధ్య చట్టం సహా ఇతర పార్లమెంటరీ ప్రొసీజర్లను కూడా సవరించాలి. దీని కోసం రాష్ట్రాల అంగీకారం కూడా కావాలి. ఒకే దేశం ఒకే ఎన్నిక అమల్లోకి వస్తే ప్రచారంలో జాతీయ అంశాలే అధిక ప్రాధాన్యత కలిగి, స్థానిక అంశాలు, సమస్యలు కనిపించకుండా పోతాయని ప్రాంతీయ పార్టీలు తీవ్రంగా భయపడుతున్నాయి. దీనికి తోడు ఎన్నికల ఖర్చులో కూడా జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీలు పోటీపడాల్సి రావడం మరింత ఇబ్బందిగా ఉంటుందని భావిస్తున్నాయి. అయితే 2015లో నిర్వహించిన ఓ సర్వే ప్రకారం.. దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహిస్తే 77 శాతం మంది ప్రజలు ఒకే పార్టీ లేదా కూటమికి ఓటు వేయనున్నారని తేలింది. అసెంబ్లీకి పార్లమెంట్‌కు వేర్వేరుగా నిర్వహిస్తే ఒకే పార్టీని ఎన్నుకొనే అవకాశాలు 61శాతానికి తగ్గినట్లు వెల్లడైంది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1967 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు జరిగేవి. ఆ తర్వాత కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలు రద్దు కావడం, 1970లో ఏడాది ముందే లోక్‌సభ రద్దు చేయడంతో ఈ విధానం మారిపోయింది. అయితే 1983 లో ఎన్నికల కమిషన్ మరోసారి జమిలి ఎన్నికల ప్రతిపాదనను తెరపైకి తెచ్చినా ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. 1999లో లా కమిషన్ నివేదిక ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని లేవనెత్తినా అది కూడా ఆచరణ లోకి రాలేదు.

2016లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ జమిలి ఎన్నికల ఆలోచనను ప్రతిపా దించగా, 2017లో నీతి ఆయోగ్ కసరత్తు చేసింది. 2019లో ఈ అంశంపై వివిధ పార్టీల నేతలతో ప్రధాని మోదీ సమావేశం ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ సహా చాలా ప్రతిపక్షాలు హాజరు కాలేదు. అయితే 2022లో జమిలి ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధమేనని సీఈసీ సుశీల్ చంద్ర ప్రకటించారు. 2022 డిసెంబర్‌లో జమిలి ఎన్నికలపై లా కమిషన్ వివిధ పార్టీలు, ఈసీ, అధికారులు, విద్యావేత్తలు, నిపుణుల అభిప్రాయా లను ఆహ్వానించింది. ★

గుగులోతు వెంకన్ననాయక్
బీజేపీ రాష్ట్ర నాయకులు (తెలంగాణ)

హైదరాబాద్ సంస్థానం నిజాం నియంత పాలన నుంచి భారత యూనియన్‌లో భాగం కావడం దేశ చరిత్రలో ప్రత్యేక ఘట్టం. ఆపరేషన్ పోలో పేరుతో సాగిన పోలీసు చర్య నిజాం పన్నిన పెద్ద కుట్రను భగ్నం చేసింది. చాలా సమస్యల నుంచి దేశాన్ని రక్షించి, భారతదేశ భవిష్యత్తుకు కశ్మీర్ స్థాయి సమస్య మరొకటి ఎదురుకాకుండా చేసిన చర్య కూడా. సంస్థానాల విలీనంతోనే భారత స్వాతంత్ర్య సమరానికీ, దాని ఫలితానికీ పరిపూర్ణత లభించింది. 565 స్వదేశీ సంస్థానాలను భారత యూనియన్‌లో అంతర్భాగం చేయకపోయి ఉంటే భారతజాతి సమైక్యత, సమగ్రతల కోణం నుంచి ఒక పెను ప్రమాదంలో శాశ్వతంగా ఉండిపోయేది. ఇటు భారత్‌కు లొంగను, అటు పాకిస్తాన్‌లో చేరబోను అంటూనే తెరచాటు వ్యవహారాలు నడిపించాడు నిజాం. ఎట్టకేలకు సెప్టెంబర్ 17, 1948న తన సంస్థానాన్ని భారత రిపబ్లిక్‌లో విలీనం చేయకతప్పలేదు. నాటి ఉపప్రధాని, హోంశాఖ మంత్రి సర్దార్ పటేల్ ఎదుట చేతులు కట్టుకుని నిలబడక తప్పలేదు. అందుకే అది చారిత్రక ఘట్టం. నిరంతరం పాఠాలు నేర్చుకోదగిన చారిత్రక సందర్భం.

డా॥ దేమె రాజారెడ్డి
న్యూరో సర్జన్, అపోలో

ఇంత ప్రాముఖ్యం ఉన్నది కాబట్టే ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక సెప్టెంబర్ 18, 1949 నాటి సంచికను విమోచన తొలి వార్షికోత్సవ సంచికగా వెలువరించింది. దీనికి రాసిన సంపాదకీయం శీర్షిక, 'చారిత్రక దినం'. 'హైదరాబాద్‌లో ప్రస్తుత పరిస్థితి- పూర్వాపరాలు' (జనాబ్ బకర్ అలీ మీర్జా), 'హైదరాబాదు-ఆర్థికాభివృద్ధి' (శ్రీ మందుముల నరసింగరావు), 'సంస్థానంలో కమ్యూనిజం స్వరూపం' (శ్రీ బూర్గుల రామకృష్ణారావు), 'హైదరాబాదులో శ్రీ కె.యం.మున్షీ (శ్రీ పెండ్యాల వామన రావు), 'భారతదేశ ఆర్థిక వ్యవస్థలో హైదరాబాద్ సమీకరణ' (శ్రీ లక్ష్మీనారాయణ గుప్త), 'రచనా స్వాతంత్ర్యానికై అనువులర్పించిన అమరజీవి- షోయిబుల్లా ఖాన్' (శ్రీ పులిగడ్డ సుబ్బారాయుడు), 'హైదరాబాద్‌పై భారత ప్రభుత్వ పోలీసు చర్య' (వ్యాసకర్త పేరు లేదు) ఇతర రచనలకు చోటు కల్పించారు.

పరిపూర్ణ విముక్తి చ

గోలకొండ ముఖచిత్రంతో, లోపలి పేజీలలో ఆ చారిత్రక ఘట్టానికి సంబంధించిన చిత్రాలు, కొందరు వ్యక్తుల చిత్రాలను కూడా అందించారు.

ఆంధ్రపత్రిక వ్యవస్థాపకులు కాశీనాథుని నాగేశ్వరరావు. ఆయన గాంధేయ వాది. జాతీయవాది. స్వాతంత్ర్యోద్యమంలో అగ్రభాగాన నిలిచినవారు. తన పత్రికను స్వరాజ్యోద్యమానికి అంకితం చేశారని అనుకున్నా అతిశయోక్తి కాదు. కాబట్టి ఆ పత్రిక వెలువరించిన 'విముక్తి' ప్రత్యేక సంచికను, అందులోని అంశాన్ని ఆ కోణం నుంచి చూడాలి. ఆ వాస్తవమే, ఆ దృష్టి కోణమే ఆ సంచికకు రూపురేఖలు ఇచ్చి ఉంటుందంటే సత్యదూరం కూడా కాదు. కొన్ని వ్యాసాలతో ఉన్న ప్రత్యేక సంచిక మొత్తం విముక్తి పోరాట చరిత్రకు అద్దం పట్టేది కాదు. అయినా ఇలాంటి ప్రయత్నం హర్షణీయం. 1980 దశకం వరకు కూడా నిజాం విముక్తి పోరాటానికి సంబంధించిన సమగ్ర గ్రంథం వెలువడలేదన్న వాదన కూడా ఉన్నది. ఆ నేపథ్యంలో చూసినా ఈ ప్రత్యేక సంచికకు కొన్ని పరిధులు తప్పవనే భావించాలి.

ఆంధ్రపత్రిక ప్రత్యేక సంచిక అందించిన సంపాదకీయ 'చారిత్రక దినం' 1946 తరువాతి పరిస్థితుల మీద చేసిన బలమైన వ్యాఖ్యానం. 'భారత ప్రభుత్వము అతి సౌమ్యముగా, అతి ఉదారముగా, స్నేహభావమున జరిపిన రాయబాములన్నియూ విఫలమాయెను. చివరకు భారత ప్రభుత్వమునకు దండోపాయమే శరణ్యమైనది. హైదరాబాదు విషమ పరిస్థితులను వేయికళ్లతో కనిపెట్టి వున్నామనియు, ఆ అదను వచ్చిన వెంటనే స్థితిగతులు పరిపక్వము కాగానే తగిన 'శస్త్ర చికిత్స' చేసెదమనియు పలుమార్లు అభయహస్తమిచ్చిన భారత ప్రధాని నెహ్రూ, ఉపప్రధాని సర్దార్ పటేల్ ప్రభృతులు 'పోలీసు చర్య' ద్వారా తమ వాగ్దానమును చెల్లించి, ప్రజల కృతజ్ఞతకు పాత్రులైరి,' అని వ్యాఖ్యానించింది ఈ సంపాదకీయం. ఆపరేషన్ పోలో పూర్తయిన తరువాత సంవత్సరం పాటు మిలటరీ ప్రభుత్వం కొన్ని సంస్కరణలు తెచ్చిన సంగతిని కూడా ఈ సంపాదకీయం ప్రస్తావించింది.

'హైదరాబాద్‌లోమ ప్రస్తుత పరిస్థితి' అన్న వ్యాసంలో కొన్ని అంశాలు వాస్తవికతకు దూరంగానే ఉన్నాయి. అక్కడ ఉత్పన్నమైన మత విద్వేషాలు ఇటీవలివే అని అభిప్రాయపడడం వాస్తవానికి విరుద్ధమే. అదే నిజమైతే అంత పెద్ద పోరాటం ఎందుకు జరిగింది? కానీ నైజాం చేసిన గాయం భవిష్యత్తులో కూడా ఇరువర్గాల ప్రజలను వైషమ్యాల మధ్య మనుగడ సాగించకుండా జాగ్రత్త పడ డానికి ఈ లేపనం పూసి ఉండవచ్చు. ఇది తప్పుకాదు. హైదరాబాద్ రాష్ట్ర సహజవనరులు, ఆర్థిక పరిస్థితి గురించి మందుముల నరసింగరావు తన వ్యాసంలో చర్చించారు. ఇక్కడి పంటలు, మానేరు, తుంగభద్ర, కృష్ణ నదుల మీద నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల గురించి ఈ చిన్న వ్యాసంలో ఆయన చర్చించారు.

నిజాం సంస్థానంలో చైతన్యం, అది ఉద్యమ రూపం దాల్చడం గొప్ప పరిణామ క్రమం. అందులో సాంఘిక, మత, విద్యా విషయాలు తమ వంతు పాత్ర వహించాయి. ఆర్య సమాజ్, గ్రంథాల యోద్యమం వంటివీ ఉన్నాయి. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కూడా పనిచేశాయి. కానీ తెలంగాణ పోరాటమంతా తమ సొంతమన్నట్టు కమ్యూనిస్టులు ఈనాటికీ చెప్పుకుంటారు. అందులోని వాస్తవం ఎంతో బూర్గుల రామకృష్ణరావు తన వ్యాసం 'సంస్థానంలో కమ్యూనిజం స్వరూపం' తొలి వాక్యాల లోనే తేల్చేశారు. 'అప్పుడప్పుడూ హైదరాబాద్ కమ్యూనిస్టు సమస్యకూ, ఆ సమస్యా పరిణామం, తీవ్రతకు పోలిక లేనట్టి అతిశయోక్తికరమైనట్టి ప్రాముఖ్యత ఇవ్వబడుతోంది. తెలంగాణంలో కమ్యూనిస్టులు పోలీసు చర్యకు పూర్వం చేసినట్టి, తర్వాత చేస్తున్నట్టి చర్యలకు బోలెడు ప్రచారం

లభించింది. ఈ ప్రచారానికి అనేక కారణాలున్నాయి. ముఖ్యమయినది ప్రచారం చేసుకోవటంలో వారికిగల నిపుణత్వమే,' అన్నారాయన. బూర్గుల అభిప్రాయంలో ఆంధ్ర మహాసభను తమ ఆధిపత్యంలోకి 'లాక్కొని', 'విచ్ఛిన్నం' చేశారు కమ్యూనిస్టులు. కొందరు రచయితలు రజాకారులు చేసిన అత్యాచారాల కంటే యూనియన్ సైన్యం చేసిన అరాచకాలే తీవ్రమైనవని వాదిస్తారు. ఈ వితండవాదంలో కమ్యూనిస్టుల దుందుడుకు చర్యలు మరుగున పడవేసే ప్రయత్నం జరిగింది. 'తెలంగాణలో కమ్యూనిస్టుల చరిత్రను క్లుప్తంగా చెప్పివేయవచ్చు. ముందుగా వారి దౌర్జన్య కార్యక్రమం జనగామ తాలూకా (నల్గొండ జిల్లా)లో ఆరంభమయ్యాయి. ఆ తాలూకా ప్రజల్ని పీడించడంలో ఆరితేరిన విస్నూరు రామచంద్రారెడ్డి అనే ఒక చిన్న భూస్వామికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు చర్యలారంభించారు. ఈ చర్యల ఫలితంగా కమ్యూని స్టులకు, భూస్వామిక తత్త్వాన్నెదుర్కోగలిగే నాయకులని, పీడిత రైతుల

ిత్ర ఎప్పుడు?

పాలిట రక్షకులని పేరు ప్రతిష్ట లభించి, బీదల సానుభూతి సహకారాలు కూడా లభించాయి. పోలీసు, రెవెన్యూ అధికారులు అవినీతిని వదిలి పేదరైతుల స్థితి గతుల్ని సకాలంలో సక్రమంగా విచారించినట్టయితే కమ్యూనిస్టులకు నిలవనీడ ఉండేది కాదు' అన్నారు బూర్గుల.

కేంద్రం కేఎం మున్షిని నిజాంలో ఏజెంట్ జనరల్‌గా నియమించింది. ఈయన ఘనతను వివరించే వ్యాసం 'హైదరాబాదులో శ్రీ కె.యం. మున్షి.' బొలారం రెసిడెన్సీలో మొదటిగా జనవరి 5,1948న భారత పతాకం ఎగురవేసిన వారు మున్షియేనన్న సంగతి ఈ వ్యాసంలో వామనరావు గుర్తు చేశారు. ఏజెంట్ జనరల్‌గా ఆయన పదవి నల్లేరు మీద నడకలా మాత్రం సాగలేదు. 'చివరకు మున్షిని హత్య చేయటానికి కూడా ప్రయత్నాలు ప్రారంభమైనట్టు నమ్మకంగా తెలియసాగింది' అంటారు వ్యాసకర్త. వ్యాసం చివరి పేరా చదివితే పోలీసు చర్య కోసం వస్తున్న సైన్యానికీ, నిజాం సేనకీ మధ్య మరింత ఘర్షణ జరగకుండా నిరోధించినవారు మున్షియేనని అర్థమవుతుంది.

'సెప్టెంబర్ 16 తారీకు రాత్రికి అసలు ఈ పోలీసు చర్య వైనమేమో తెలుసుకోవాలిని నైజాంకు కోర్కె పుట్టింది. మున్షిని పిలిచి సలహా అడగక తప్పలేదు. రెండు మూడురోజుల్లో భారత సైన్యాలు హైదరాబాదులో ప్రవేశించి నట్లయితే, చాలా దారుణ చర్యలు జరిగేవి. కానీ మున్షీ చతురత వల్ల హైదరాబాదు ప్రజల ప్రాణాలూ, భారత ప్రభుత్వ గౌరవమూ దక్కాయి. నైజాం, తాను లొంగిపోయినట్టు ఒప్పుకుని భారత సైన్యాలను ఆహ్వానించడానికి తయారైనాడు. మున్షీ తన సహజ ఔదార్యంతో నైజాంకు దారి చూపి పోలీసు చర్యకు దారుణ ఫలితాలేవీ సంభవించకుండా జాగ్రత్త వహించాడు. హైదరాబాదుకు కష్టకాలంలో ఆయనకు మిత్రుడిలా సాయపడ్డాడు.' అని పేర్కొన్నారు వామనరావు.



'ఒక చిన్నవర్గం హైదరాబాద్‌ను భారతదేశం నుంచి రాజకీయంగానూ, ఆర్థికంగానూ విడగొట్టాలని ప్రయత్నం చేసినప్పటికీ హైదరాబాద్ సమస్యలెప్పుడూ భారతదేశ సమస్యల్తోనే ముడిపడి ఉన్నాయి' అన్నారు 'భారత ఆర్థిక వ్యవస్థలో హైదరాబాద్ సమీకరణ' వ్యాసకర్త లక్ష్మీనారాయణ గుప్త. అలాగే 'ఆర్థికశాస్త్రం తెలిసినవారికి హైదరాబాద్‌కెన్నడూ స్వతంత్ర ద్రవ్య చలామణి లేనేలేదని తెలిసిన విషయమే.' అన్నారాయన.

'ఆధునిక నాగరికయుగంలో రచనా స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అర్పించి చరిత్రలో అమర స్థానాన్ని పొందాడు పత్రికా రచయిత షోయిబుల్లాఖాన్' అంటూ ఘనంగా నివాళి ఘటిస్తూ సాగిన వ్యానం 'రచనా స్వాతంత్ర్యానికై అసువులర్పించిన అమరజీవి'. ఒక ఘననివాళి అర్పిస్తూ రాసిన వ్యాసమిది. ఖాన్ జీవిత విశేషాలు, నిజాం మీద పోరాటంతో ఎదుర్కొన్న ఇక్కట్లు, ఇమ్‌రోజ్ పత్రిక నిర్వహణ, ఆఖరికి రజాకారుల చేతిలో మరణించడం ఇవన్నీ ఇందులో సవివరంగా వర్ణించారు.

ఆఖరి వ్యాసం 'హైదరాబాద్‌పై భారత ప్రభుత్వ పోలీసు చర్య'. ఆపరేషన్ పోలో పేరుతో ప్రసిద్ధిగాంచిన ఈ చర్య పూర్వాపరాలను మొదటి పేరాలలో వర్ణించి, తరువాత అచ్చంగా ఇలాగే పూర్వం జరిగిన మరొక చారిత్రక ఘట్టం గురించి కూడా ఈ వ్యాసంలో గుర్తు చేశారు. ఆనాటి చారిత్రక ఘట్టం కూడా 1948 నాటి విమోచన ఘట్టం మాదిరిగానే సెప్టెంబర్ 13ననే ఆరంభం కావడం విశేషం. 'సెప్టెంబర్ 13 అనడంతోనే వెనుకటి చరిత్ర జ్ఞాపకం రాక తప్పదు. 1727 సెప్టెంబర్ 13న ఇట్టి సంఘటనే జరిగింది. అదీ నిజాం గర్వభంగానికి సంబంధించినదే. మహారాష్ట్ర వీరుడు పీష్వా బాలాజీరావు ఇల్లాగే అప్పటి నిజాం నవాబు అధికార దురహంకారాన్ని అణచివేయడానికి ఆ రోజున హైదరాబాదు సంస్థానంపై దండయాత్ర ప్రారంభించాడు. ఆ నిజాం దాసోహం అని దాసుని తప్పు దండంతో సరి అని దణ్ణం పెట్టి ప్రాణాలు కాపాడుకున్నాడు.' ఆఖరి నిజాం మీద జరిగిన దండయాత్రలో గూర్ఖాలు, సిక్కులు, మద్రాసు, సెంట్రల్ ప్రావిన్స్, బొంబాయి పోలీసులు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక సంచికతో అర్థం చేసుకోవలసినది– నిజాం పాలనలో హైదరాబాద్ సోదరులు పడిన కష్టాల పట్ల అందరికీ సానుభూతి ఉంది. సంస్థానం భారత యూనియన్‌లో కలవడం పట్ల ఆనందం కూడా ఉంది.

'వీర తెలంగాణా– నా అనుభవాలు జ్ఞాపకాలు (రావి నారాయణరెడ్డి), 'నా మాటే తుపాకీ తూటా' (మల్లు స్వరాజ్యం), తెలంగాణ ప్రజా పోరాటం–పాఠాలు (పుచ్చలపల్లి సుందరయ్య), 'ఎర్రజెండాలు' (గంగినేని వెంకటేశ్వరరావు) వంటి పుస్తకాలు వచ్చినా ఒక పార్శ్వానికి పరిమితమైన పుస్తకాలే. నిజాం నవాబు సంపద మీద ఈ వ్యాసకర్త (డాక్టర్ రాజారెడ్డి), తెలంగాణ ఆంధ్ర మహాసభ, మరికొన్ని అంశాల మీద కుర్రా జితేంద్రబాబు వెలువరించిన పుస్తకాలు కూడా పూర్తి చిత్రాన్ని ఇచ్చేవి కావు. తెలంగాణ సాయుధ పోరాటం నాటికి ఐక్యంగా ఉన్న కమ్యూనిస్టులు తరువాత వేర్వేరు శిబిరాలలోకి వెళ్లారు. వాళ్ల అభిప్రాయాలు మారాయి.

కమ్యూనిస్టులే కీలకంగా ఉన్నారని చెప్పుకునే చరిత్రను అక్షరబద్ధం చేయడం దగ్గర కూడా అవి ప్రతిఫలిం చాయి.తెలంగాణ చరిత్ర సమగ్ర చిత్రం అందకపోవడానికి ఇదీ ఒక కారణమే. అయితే అది గతం. నిజాం విముక్తి పోరాటం 75 ఏళ్ల సందర్భంగా అయినా, తెలంగాణ పేరుతో, తెలంగాణ ఆత్మ గౌరవం పేరుతో అధికారంలోకి వచ్చిన రాజకీయ పక్షం, ఆ పార్టీ ప్రభుత్వం కొన్ని సంపుటాలుగా ఆ సమగ్ర చరిత్రను జనానికి అందించే ప్రయత్నం చేయకపోవడం విచిత్రమే.

★

ఎండిన నెత్తురు కింద

'నైజాం విముక్తి స్వాతంత్ర్య అమృతోత్సవాలు' ముగుస్తున్నాయి. కానీ ఆ పోరాటం వెనుక ఉన్న జ్ఞాపకాలు ఎప్పటికీ అమృతోపమానమే. అందులో మన ముందు తరాల చేదు అనుభవాలు ఉన్నాయి. కొన్నయినా వీరోచిత గాథలు ఉన్నాయి. ఏ అనుభవమైనా కన్నీటితో తడిసినదే. నెత్తుటి చారికల కింద తడియారకుండా మిగిలి ఉన్న జ్ఞాపకమే. పాఠాలు నేర్పగలిగే సంఘటనలే అవన్నీ. ఎలా మరిచిపోతాం? ఓ బైరాన్‌పల్లిని, ఐలమ్మను, గోలకొండ పత్రికనీ, దాని స్థాపకుడు సురవరం ప్రతాపరెడ్డిని ఎలా మరచిపోతాం? కృష్ణరాయాంధ్ర భాషా నిలయాన్ని ఎలా విస్మరిస్తాం? అది రగిలించిన భాషాభిమానం ఎలా చెరిగిపోతుంది? భాషాభిమానం నిలిపిన ఆత్మగౌరవ జాడ ఎలా మరపునకు వస్తుంది? నిజాంకు వ్యతిరేకంగా రాసిన నేరానికి తెగిపడిన షోయబుల్లా కుడి చేయి.. ఇంకా ఇలాంటివి ఎన్నింటినో మరచిపోలేం. అవి తెలంగాణ ప్రజల, తెలుగువారి గుండెలలో ఎప్పుడూ ఉంటాయి.

ఐదేళ్ల వయసులో చూసినా రజాకార్ రక్తపాతం, అందులోని విషాదం జీవితాంతం మరుపునకు రాదు. అందులో గూడు కట్టుకున్న విషాదం, దాని సాంద్రత అలాంటివి. అందుకే ఆ జ్ఞాపకాలు అక్షరబద్ధమవుతూనే ఉన్నాయి. ఇంకా అవుతాయి. డాక్టర్ బండ సరోజిని 'బర్రెంక చెట్టు... ఓయాది' అలాంటిదే. ఇవన్నీ గతంలో జరిగిన గాయాలను రేపుకోవడమని ఎవరు అనుకున్నా, అది ఆత్మవంచన. అది మన తాతముత్తాల అస్తిత్వం పోరాట స్మరణ, వారి ఆత్మక్షోభకు నివాళి. లద్నూర్‌లో ఏప్రిల్ 3, 1941న డాక్టర్ సరోజిని జన్మించారు. రజాకారులు ఘాతుకాలు తారస్థాయికి చేరేనాటికి ఆమె 5 లేక 6 సంవత్సరాల బాలిక. నిజానికి ఆమె రాసినది ఓ కథ అనే కంటే ఓ గొప్ప చారిత్రకాధారంగా గౌరవించ దగినది. బైరాన్‌పల్లె సంఘటన జరిగిన సమయంలోనే జరిగిన మరో ఘోరానికి ఆమె కుటుంబ సభ్యులు సాక్షులే కాదు, బాధితులు కూడా. అదే లద్నూర్ దాడి. "గా రోజు పుట్టిన గుడ్డు కాంచి తెలుగోల్లను పూర్తిగా సంపాలనే పిలాను వేసిన్రని బండ సరోజను నాయన పిలిచి సెప్పిండు." ఈ వాక్యం రజాకార్ల రక్తదాహానికి అద్దం పడుతుంది. ఇక్కడ తెలుగోల్లు అంటే స్థానికులు. ఇంకా చెప్పాలంటే ముస్లిమేతరులు.

ఐదు సంవత్సరాల వయసులో సరోజినిని పాఠశాలలో చేర్చారు. చేరిన మూడు నెలలకే 17-09-1948 రజాకార్ల దాడి (వాళ్ల నాయన జెప్పగ యిన్నదట) జరిగింది. లద్నూర్‌ను తగులబెట్టారు. 'దాంట్లె బడి గుడ నామ్ నిషాన్ లేకుండ కాలిపోయింది. గప్పుడప్పుడు యాది కొచ్చినప్పుడల్లా గా కాలిపోయిన బడికి వోయి అంతా కలె దిరిగి వచ్చేదట. కిలాసుల తాను కూకున్న జాగ చూసుకుంటుంటే చెప్పలేనంత ఏడుపొచ్చేదట (అయినా ఓ పక్క చిరు ఆనందం స్కూలుకు వెళ్ల నవసరం లేదు).

నిజానికి నిజాం విముక్తి పోరాటం ప్రజ్వరిల్లే వరకు హైదరాబాద్ రాష్ట్రంలో ఉన్నదంతా తుపాను ముందు ప్రశాంతతే. గుండె నిండా మంట ఉన్నా నిస్సహాయంగా ఉన్నారు. ఆ జీవితం ఎలా ఉంది? 'సేన్లు, సెలకలల్ల పగులంతా పనిజేసిన. గూట్లో దీపం నోట్లో ముద్ద అన్నట్టు సద్దిబువ్వ దిని యెన్నెల్ల ఈత సాపలు పరుసుకొని కూసోని దునియా ముచ్చట్లకు వెడుదురు. అవ్వ నాయనమ్మ మంచి మంచి కతలు, మస్తు పొడుపు కతలు సెప్పుదురు. రుద్రమ్మ, మల్లమ్మ, జాన్సిలచ్చిమి అలెగ్జాండర్, పురుషోత్తముడు, అంబి కతలు, తానీషా, అక్కన్న, మాదన్న, రామదాసు చెరిత్ర జేప్పేటోల్లు'.

ఈ రచయిత్రి కూడా బడి ఎగ్గొట్టేదిట. బడిగంట యాల్లకు పిడకల కుచ్చెలు, గడ్డివాములు మక్కజొన్న జూలల్ల దాక్కునేదట. ఒగో త్యావ బడిగంట కొట్టేవరకు నిధురవోయినట్టు జేసేదట. స్కూలు "చెప్పరాసి" తాతమ్మా అని పిలిసేటోడు. నాయనమ్మ ఇంక పిల్ల లేవలేదని సేప్పేది ఆ గండం గట్టెక్కేది. లేసి మొకం కడుక్కొని ఊరి మీద పడేదిట. గవుండ్ల ఎల్లవ్వ, కురుమ లచ్చిమి పెద్ద చాలి సిద్దవ్వ, పటేండ్ల రంగవ్వ, కాపోల్ల అంజివ్వతోని ఆట లాడేదిట.

దూం పుల్ల ఆట ఆడేటప్పుడు **'కుక్కకు మాంసం దొరికినది/అది వంతెన మీదగ పోయినది/ తన నీడను తానే సూచినది / వేరొక కుక్కని తలచినది / భౌ భౌ భౌ భౌ అరిచినది/ ఉన్నది కాస్త పోయినది...** అన్న గీతం అనుకుంటూ ఎగురుకుంట దూకే టోల్లట. తమ్ముడు గాలిలో అచ్చరం రాయాలి. గులక రాళ్లు ఏరు కొచ్చి ఆ అచ్చరాన్ని పేర్చాలి. దోస్తులంతా రెండు జట్లుగా విడిపోతారు. వారు ఆడపిల్లోల్లు, మగపిల్లోల్లు. పాట రూపంలో సాగేవి వాదోపవాదాలు.

ఆడపిల్లోల్లు: సిబ్బిలేనింటికి నా బిడ్డ నిస్తినీ
తాన తండయ్య గోగు పువ్వయ్యలో
మగపిల్లోల్లు:అప్పుడెందుకిచ్చినవు అరికాలి చెప్పే
ఆడ:కనరాని కంతలకు నా పిల్లనిస్తినీ
మగ : సిగ్గెగ్గు లేకుంట నా ఇంటి కొస్తివి
ఆడ: పిల్ల నిచ్చేటప్పుడు ఇల్లు సూడాలమ్మ
మగ: ఇల్లు సూడకుంటా పిల్లనెట్లిస్తివి
ఆడ : ఎరుక లేకిచ్చిన ఎనుగుల్ల వడ్డ...

ఈ కథలోనే నిత్య జీవితానికి సంబంధించిన కొన్ని ఆనవాళ్లు కూడా ఉన్నాయి. అవ్వ చిన్నప్పుడు తమ్ముణ్ణి కాళ్ల మీద వేసుకొని నువ్వుల నూనెతో కాళ్లు చేతులకి సున్నిపిండి పెట్టి ఉడుకు నీళ్లతో స్నానం జేయించేది. సరోజిని కూడా తన చెక్క బొమ్మకు అట్లనే చేసేదట. పెద్దయ్యాక పాలకురికి సోమన్న రాసిన బసవ పురాణం కతలో ఉన్న జెజ్జ మహాదేవి 'పాటం' బాగా మనసు కెక్కిందట. వాళ్ల అవ్వకు పాటలు, కీర్తనలు నాలుక మీదనే ఉండేవట. గురుబోధకు సంబంధించిన పదాలు చెప్పేది. పంచ

తడియారని జ్ఞాపకాలు



కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

భూతాల గురించి వివరించేది. ఈ విధంగా తెలంగాణ మట్టి పరిమళాలను మనకు అందించ గలిగారు, సరోజిని. బర్రెంక చెట్టు నీడలో ఇవన్నీ జరిగేవి. కానీ ఈ జ్ఞాపకాలు రజాకారులు రాసిన నెత్తుటి చరిత్రలో మౌనంగా ఉండిపోలేదు. నెత్తుటి మరకల తడి కూడా ఆరలేదు. ఇదే అందుకు ఉదాహరణ:

'ఓ రోజు సందాల్ల లద్నూరు చెర్వు కట్టమీంచి ఓ మూడొందల మంది జై కొట్టుకుంట ఒత్తున్నరు. సేన్లు సెలకల నుంచి జనాలు గప్పుడే వచ్చి ఎసర్లు వెట్టి బువ్వాండి వారవెట్టుకున్నరు. ముసల్మాన్లు నమాజు చేసుకుంటున్నరు. మా నాయనమ్మగా సప్పుడేందో సూడమని తన అన్నని నిచ్చెనెక్కించింది. అన్న కొట్టం మీంచి సూసిండు. తెప్పలెక్క జనాలు ఒత్తన్నరని సెప్పిండు." అది రజాకార్ల కాలం. వాడ కట్టులున్న దగ్గిర దగ్గిర ఇండ్లోల్లు సరోజిని ఇంటికి చేరుకునేవారు. బెడం పెట్టుకొని (లోపల తలుపుకు అడ్డంగా పెద్ద కర్రను రెండు వైపుల గోడలో దూర్చి ఉంచడం) ఏరే ఊర్లల్ల రజాకార్లు ఏమేమి జేసింది సెప్పుకుంట పానాలు అరిసేతుల పెట్టుకొని కూసునేవారు.

బండ సరోజిని గారి మేనత్తది బైరాన్‌పల్లి. ఆ ఊరి మీద దాడి జరిగిన నాడు వీళ్ల మేనత్త ఒంటి మీద నగలు ఒలుచుకున్నారు. ఆ ఊళ్లోనే వారి తాత గాడిపెల్లి రామయ్యను తుపాకీతో కాల్చారు. దాడి జరిగాక వీరి నాయనమ్మ ఈమెను దీసుకుని రొండు బుడ్ల బియ్యం పోసి బండిగట్టి పంపించింది. ఆ తల్లీకూతుర్లు ఒకరినొకరు కౌగిలించుకుని ఏడ్చారు. తాత మీద పేలిన తుపాకీ గుండు ఎలా పోయింది చూపెట్టింది. ఆ ప్రాంతం మొత్తం నెత్తురుమయ మయింది. నెత్తురు మయమయిన ఆ జాగా ఇంకా తనకు గుర్తుందని సరోజిని చెప్పారు.

అలాగే సరోజిని నాయనమ్మ తమ్ముడు పిట్టల కిట్టయ్య. ఎల్దండ గ్రామవాసి. ఆయనను రజాకార్లు కాల్చి చంపారు. అమాయకుల ఉసురు పోసుకున్నారు. నిజంగా ఈ గాథ అమానుషానికి చిరునామాగా ఉంటుంది. కిట్టయ్య మక్కజొన్న చేనులో ఉన్నప్పుడు రజాకార్లు అక్కడికి వెళ్లారు. ఆయన చేతనే మక్కజొన్న కంకులు విరిపించుకొని, కాలిపిచ్చుకున్నారు కూడా. అరుచుకుంటూ, నవ్వుకుంటూ రచ్చ రచ్చ చేస్తూ ఆ కంకులు ఒలుచుకు తిని, తాగేందుకు నీళ్లు కావాలని అడిగారు. కిట్టయ్య లొట్టి తీసుకుపోయి మోట బావి నుంచి నీళ్లు తెచ్చాడు. నీళ్లు తాగి రజాకార్లు చివరిగా బండి కట్టమన్నారు. కిట్టయ్య భయం భయంగా ఎడ్లను దెచ్చి బండి కట్టాడు. ఆయనను బండికి ఎదురుగా నిలవెట్టి తుపాకీతో కాల్చేశారు. దీంతో ఎల్దండ ఊరంతా గజగజ వణికిపోయింది.

హిందువుల ప్రాణాలు గాలిలో దీపం కంటే అన్యాయంగా ఉండేవి. నిరంతరం చావు భయంతో ఉండేవారు. ఈ ఉదాహరణ చూడండి: 'గప్పుడు రజాకార్ల జమానా జోరుగుండె. ఫౌజు (సైన్యం) దిగేది. గాల్లు రాంగానే తెలుగోల్లందరు బెడాలు వెట్టుకొని, తలుపులు దగ్గరేసుకొని గొళ్ళేలు వెట్టుకొని బిక్కు బిక్కు మనుకుంట ఇండ్లల్ల కూసునేది. జైలు కానాల ఉన్నట్టు ఉండేది. పోరగాల్లం తలుపు సందుల నుంచి సూసేది. ఫౌజోల్లు గుర్రాల మీద ఊర్ల తిరిగేది. గుర్రాల డెక్కల సప్పుడు, పౌజోల్ల బూట్లు సప్పుడే ఇనబడేది. ఎటు వోయినా భయంగా వుండేది. గప్పుడే మా రామక్క (రచయితకు వరసకు అక్క) బిడ్డ కాల్లు సేతులకున్న వెండి కడియాలు, గుండు వోగులు తీస్కోని సంపి బాయి లేసిన్రు. ఎంత అమానుషం?'

బైరాన్ పల్లె మీద చేసిన దాడి తరహాలోనే లద్నూరు మీద కూడా చెయ్యాలని రజాకార్లు పథకం వేశారు. ఎందుకంటే ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి కొలిపాక నుండి లద్నూరు వచ్చి పోతున్నారు. అలాగే నల్ల నర్సిములు, సర్వారెడ్డి గూడా వచ్చి వెళుతున్నారు. అందుకే ఈ ఊరిని లక్ష్యంగా చేసుకున్నారు. దాడి జరిగింది. ఊరుని పీనుగుల పెంట చేశారు. ఆ చీకట్లో హిందువులు, ముస్లింలని అన్న తేడా లేకుండా ఎవరికి దొరికిన దారిలో వాళ్లు అడవిలోకి, పక్క ఊర్లకు పారిపోయారు. సరోజిని అవ్వ కూడా అదే చేసింది. ఈ చిన్న పిల్లల్ని తీసుకుని ఎల్దండకు చేరుకుని, ఎల్లక్క ఇంట్లో తలదాచుకున్నారట. వీళ్లు చదువుకునే స్కూలు కూడా నామా రూపాలు లేకుండా కాలిపోయిందట.

'బర్రెంక చెట్టు' చదవడమంటే తెలంగాణ సామాజిక రాజకీయ చరిత్ర ఆకులను, పూలను, కొమ్మలను, రెమ్మలను చేతుల్లోకి తీసుకొని ఒక జీవిత పత్ర హరితాన్ని మనసులోకి దింపుకోవడం. మన ముందు తరం జీవితానికి మాంత్రిక లేపనం అద్ది మళ్లీ మొలకెత్తించడం. తెలంగాణ సాంస్కృతిక మూలల్లోకి దిగుడు బావిలోనికి దిగినట్లు దిగిపోవడం. సాధారణంగా బర్రెంక చెట్టు పుల్లల్ని పంటి బలానికి మంచిదని దంత ధావనానికి వాడుతుంటారు. ఈ కథ కూడా తెలంగాణ సంస్కృతిక వారసత్వానికి ప్రతీక.

నిజాం రాజ్యంలో రజాకారులు, ముస్లిం మతోన్మాదులు చిందించిన నెత్తురు తక్కువేమీ కాదు. ఆ నెత్తుటి చారికలు ఎండిపోయి ఉండవచ్చు. కానీ వాటి కింద ఏ కాలమూ తీర్చలేని బాధలో నానుతున్న జ్ఞాపకాలు అలానే ఉన్నాయి. ఇప్పటికీ వాటి తడి ఆరలేదు. ఇంతకాలం ఈ కాలమ్‌లో మనం గుర్తు చేసుకున్నది వాటినే. అలా ఆ జ్ఞాపకాలను, నిస్సహాయత కింద నగిలిపోయిన కొన్ని తరాల క్షోభను గౌరవించుకున్నాం. స్మరించుకున్నాం. వారందరికి నివాళి ఘటిస్తూ ఇప్పటికి సెలవు.

(ఈ శీర్షిక ఈ వారంతో ముగిసింది)

సెప్టెంబర్ 17 నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల ముగింపు సందర్భంగా

హైదరాబాదు ప్రాంతంలో నర్గుండ ఒక చిన్న సంస్థానం. ఈ సంస్థానం స్వాతంత్ర్యేచ్ఛకు స్థావరము, వీరత్వానికి పుట్టినిల్లు. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో నర్గుండ రాజు భాస్కరరావు బాబాసాహెబు స్వాతంత్ర్య సమరసేనాని, విప్లవ నాయకుడైన నానాసాహేబు పీష్వా పంపిన స్వాతంత్ర్య సందేశాన్ని స్వీకరించాడు. తన పటాలాలకు సమర్థంగా తర్ఫీదు ఇచ్చాడు. రోహిలాలు, అరబ్బీలు, పఠానులు మున్నగువారు నవ్యరీతులలో యుద్ధ శిక్షణ పొందేరు.

సాయంకాల సంధ్యారుణకాంతులు నర్గుండ కోటకు అనతి దూరములో నున్న భైరవ దుర్గంపై ప్రసరించి నలుపుతో కలిసిన ఎరుపు శోభను ప్రసాదిస్తున్నాయి. భైరవదుర్గం నల్లని సానరాతితో కట్టబడి ఉంది. అరుణ పతాకం నీరెండలో ప్రకాశిస్తూంది. దుర్గంలో భవానీ దేవాలయంలో సాయంకాల పూజా చిహ్నంగా గంటలు ఘణ ఘణ మ్రోగుతున్నాయి. దుర్గపు సింహద్వారాన్ని బలిష్ఠులైన యిరువురు యోధులు కాపలాకాస్తున్నారు. కొందరు వీరయోధులు తమ గుర్రాలను చెట్ల గుంపు మధ్యన కట్టి విప్లవ చిహ్నంగా గులాబి పుష్పాలను కాపలా వారికిచ్చి లోనికి ప్రవేశించారు. ఆ యోధుల ప్రవేశాన్ని చుట్టుపట్ల ఎవరూ గమనించినట్లు లేదు.

భవానీ దేవాలయంలో గర్భగృహానికి ముందుగా పదహారు స్తంభాల మండపం ఉంది. ఒక్కొక్క స్తంభంపైన ఒక్కొక్క కళారూపిణియైన దేవీమూర్తి చిత్రమై ఉంది. పరాశక్తిని షోడశ కళల రూపంలో ఆరాధించే విధానానికి మూల పురుషుడు రాజా భాస్కరరావు బాబాసాహెబు.

మంటపంలోని ఒక శిల్పఖండం! అది పాలరాతి విగ్రహం. అది అష్ట త్రిపుర భవానీ విగ్రహం. ఆ శిల్పంలోని ప్రతి అంగము దైవిక రూప సంపత్తి కల్గి యథా శాస్త్రోపేతంగా అమరి శోభిస్తోంది. "మనోహరం" అనే ఒకానొక అవ్యక్త నిర్గుణరూపం ఆ శిల్పంలో ఇమిడి సారూప్యభావాన్ని పొంది భాసిస్తోంది. ఆ రూపఖండంలో గాంభీర్యం, సౌందర్యం, వీరత్వం, అఖండత్వం – ఇత్యాది రూపకళలు శరీరంలో లావణ్య ఝరివలె ప్రవహిస్తున్నాయి. ఇన్ని కళలతో పుంజీభవంచిన ఆ మూర్తిలో సౌమ్యత, ప్రేమ, కరుణ, మాతృత్వం ఒకే ఒక కన్నుల జంటలో ఇమిడ్చాడు మహాశిల్పి.

ఆ విగ్రహాన్ని చూచి ఆ యోధులు చేతులు జోడించి అప్రయత్నంగా "జగజ్జననీ! సమస్త చరాచర జీవరాసులకు నీవు మాతృమూర్తివి. మేము తలపెట్టిన ఈ స్వాతంత్ర్య సంగ్రామంలో విజయం చేకూర్చు తల్లీ!!" అని ప్రార్థన చేసేరు.

అరుణజ్యోతి

శ్రీ డి.సీతారామారావు

ఇంతలో సింహబలుడైన యువవీరుడు భుజాన తుపాకి ధరించి లోనికి వచ్చాడు. ఆ యోధులు వినమ్రులై నిలబడ్డారు. ఆ వచ్చినవాడు మరెవరో కాదు 'విప్లవజ్యోతి' భాస్కరరావు. ఆలయంలో ప్రవేశించిన ఆ వీరయోధులను చూచి గంభీర స్వరంతో ఆయన 'అచంచల దీక్షా పవిత్ర హృదయాలతో నిండిన, హైందవ శ్రేయోకాముల, నిరంతర సేవాత్యాగాలతో వెలిగే ఈ అఖండ భారత దివ్య స్వాతంత్ర్య జ్యోతి అల్పమైన ఈ ఆంగ్లేయ కీటకాల అలజడికి ఆరిపోతుందని మీరు ఏలా భావిస్తూన్నారో నాకు తెలియకున్నది. అదిగో! అటువైపు చూడండి! సత్వగుణ ప్రధానురాలైన భారతమాత నేడు తమో గుణాన్ని ఆవహింపచేసుకొని సాక్షాత్తూ తామసమూర్తియై రౌద్రాకారం తాల్చి కాళీమూర్తియైనది. మాతృదేశ గౌరవం, యశస్సు, శక్తి సంపన్నత స్వాతంత్ర్యం నశిస్తూన్న ఈ సమయంలో చావు బ్రతుకుల సమస్య ఏర్పడింది. క్షణ క్షణం కుదించుకుపోతూన్న మన దేశ సరిహద్దులను విస్తరింపజేసి విశాల భారతభూమిని నిర్మించాలి. భారతీయతను మీరంతా అటు హిమాలయాలు మొదలు ఇటు కన్యాకుమారి వరకు స్వాతంత్ర్య ఘోష ప్రతిధ్వనిస్తోందాయనునట్లు ఒక్కసారిగా ప్రళయకాల ప్రభంజనంలా విజృంభించి కంటికి కనుబడిన ప్రతి ఆంగ్లేయుని తెగనరకండి! లేవండి! ముందంజ వేయండి!' అని ధైర్యాన్ని ఇస్తూ ఆ వీరయోధులను హెచ్చరించాడు.

* * *

ఆనాడు ఆదివారం 1858 సం॥ మే నెల 25 తారీకు. ఆంగ్ల సిపాయిలకు శలవు దినం. 'బ్రిగేడియర్ మాస్సన్' విడిది చేసిన భవంతిలో 'చుట్ట పొగ' గదుల నిండా దట్టంగా అలుముకొని ఉంది. మంచాలు, కుర్చీలు, బెంచీలు నేల గదులన్నిటి నిండా, కూర్చునీ పడుకొనీ తప్పత్రాగి మనుష్యులాక్రమించు కొన్నారు. బీరు గ్లాసులూ, తుపాకులూ కలిసి మెలిసి అంతటా కాలుపెట్టే జాగా లేకుండా చిందరవందరగా పడి ఉన్నాయి.

ఆకాశంలో నీలిమబ్బుల బారులు తెలి వెన్నెల వెలుగులతో దోబూచులాడు కొంటూన్నాయి. నేలమీద వెలుగు నీడలు ఒండొంటిననుసరించి పరుగు లారంభించాయి. ఆకాశాన్ని అంటుతున్న కొండమల్లి పూలు విరబూసి వెలుగు నీడల్లో నవ్వుతూ సువాసనలు విరజిమ్ముతున్నాయి.

ఊపిరి దిగబట్టుకొని ఒక యువవీరుడు మామిడిచెట్టు చిటారు కొమ్మ మీదకు ఎగబ్రాకుతున్నాడు. ఒళ్లు అక్కడక్కడ కొంచెం చీరుకుపోయినా అతనికి చీమ కుట్టినట్టయినా అనుపించలేదు. దట్టముగా అలుముకొన్న చిగురుటాకుల గుబురులో పొంచియున్నాడు. తన సంగతి ఎవరైనా పసికడుతున్నారేమో అని చాలా జాగ్రత్తగా ఆ గుబురులో నుంచి నేల నాలుగు చెరుగులా పరిశీలించాడు. చెక్కు చెదరని ఆ ఉక్కు లాంటి శరీరం; గూటాల్లాంటి దండలు, దూలాల వంటి తొడలు; నలుపైనా నిగనిగలాడే దేహచ్ఛాయ, పొడుగాటి ముక్కు, ముక్కుకు తగ్గ, ఉబ్బిన, గుండ్రని, ఎఱ్ఱని, పెద్ద ముఖంతో, ఆ మృత్యుభీషణమూర్తిలా ఉన్న ఆ గౌరిల్లా యుద్ధవీరుని చూడగనే "ధీరోద్ధతో సమయతీవ ధరిత్రీమ్" అనే లోకోక్తి జ్ఞప్తికి వస్తుంది. అతడు 'అరుణ జ్యోతి' భాస్కరరావు.

రాత్రి రెండో యామం కూడా గడిచిపోతూంది. మబ్బుల మాటున దాగిన చందమామ తెర తొలగించుకొని యావలకు వచ్చి భవంతి పరిసర భాగం అంతా వెలుగులలో ముంచెత్తుతున్నాడు. ఇంతలో మారుమూల ఒక జాగిలం మొరిగింది. అతడు శిరస్సు బాగా పైకెత్తి భవంతి గవాక్షముపైపు లోపల పరిశీలిం చాడు. అతని అదృష్టం పండింది. ఆ వెలుగులో నెమ్మది నెమ్మదిగా నిద్ర ముఖముతో అడుగులో అడుగు వేసుకొంటూ మత్తుగా తూలుతూ 'మాస్సన్ సేనాని' మేడ పరండావైపు వచ్చి చుట్టుప్రక్కల కలయజూస్తున్నాడు. ఇదే సమయమనుకొని తుపాకి సరిగా గురిపెట్టి ఒక్క గుండుతో పిట్టని నేల రాల్చినట్లు నేల రాల్చినాడు భాస్కరరావు. ఈ దెబ్బ భవంతిలో ఇతర సేవనులకు కార్ మనిపించింది. వెనువెంటనే ఊపిరి బిగబట్టి ఒక్క దూకులో మేడ కిటికీ మీదకు ఎగిరి ఊచ గట్టిగా పట్టుకొని అతి కష్టంమీద వరండా మీదకు చేరుకొని ప్రళయకాల నటరాజులా 'మాస్సన్' మీదకు విజృంభించి ఒకే ఒక వేటుతో అతని తల తెగనరికి వెల్లువలా ప్రవహిస్తున్న కవోష్ణ రక్తంతో భవానీదేవి పాద పద్మములను కడిగేడు. దీనితో భవంతిలోనున్న మిగతా ఆంగ్ల సిపాయిలు అండచ్యుతి పొందిన ఇంద్రదేవునిలాగై పోయారు. ఇంతలో భవంతి ప్రక్క పొదలలో పొంచి ఉన్న దేశభక్తుల తుపాకి గుండ్లు అగ్నివర్షంలా మీదికి వస్తున్నాయి. అన్ని వైపులా ఏకోన్ముఖంగా, పెను తుపాన్‌లా పురోగమిస్తున్న హైందవ యోధులను చూడగనే ఆంగ్లేయులకు కార్‌మనిపించింది. దీనితో చెల్లాచెదురై పారిపోతున్న ఆంగ్ల సిపాయిలను నిలువునా ఎక్కడికక్కడ కాల్చివెయ్యడమే హిందూ సైనికుల పని అయిపోయింది. విప్లవకారులు సాగించుచున్న ప్రళయసంగ్రామం ముందు మిగత ఇంగ్లీషు సేనానులు 'నీలూ, బ్రిగేడియర్ పార్క్' రక్షణకు దారి తెన్ను కానక చిందరవందరైన పీనుగు పెంటలను త్రొక్కుకుంటూ, క్షతగాత్రులను వదలి పరారయ్యారు.

(26.7.1971 'జాగృతి' సంచిక నుండి)

సులభ్ – స్వచ్ఛ భారత్ మిషన్: పారిశుద్ధ్యం, దాని ఆవల...

గ్రామీణ బిహార్‌లో 1960ల్లోని తన స్వంత అనుభవాల నుంచి, స్వచ్ఛ భారత్ మిషన్ దాకా సాధించిన అభివృద్ధి వరకు దేశంలో పారిశుద్ధ్య ప్రాజెక్టుల పురోగతిని గురించి సులభ్ వ్యవస్థాపకుడు, దార్శనికుడు డాక్టర్ బిందేశ్వర్ పాఠక్ సెప్టెంబర్ 2022లో రాసిన వ్యాసమిది. స్వచ్ఛత దిశగా భారత్ ప్రయాణంలో కీలక తత్వవేత్త, కార్యకర్త అయిన పాఠక్ ఇటీవలే మరణించారు. ఆయనకు నివాళిగా ఆయన మాటల్లోనే ...

2.4.1943 – 15.08.2023

గ్రామీణ పారిశుద్ధ్యానికి సంబంధించిన శాస్త్రీయత, ఆర్థిక కోణాలను తొలిసారి 1968లో తీవ్రంగా ఎదుర్కొన్నాను. గ్రామీణ బిహార్‌లో పుట్టిపెరిగిన నాకు, బహిరంగ మలవిసర్జన, లేదా డ్రై లెట్రిన్‌ల వల్ల కలిగే హాని గురించి బాగా తెలుసు. అయితే, బెతియాలో బిహార్ గాంధీ సెంటెనరీ కమిటీకి స్వచ్ఛంద కార్యకర్తగా పని చేస్తున్న సమయంలో ఈ అంశానికి సంబంధించిన పలు కోణాలను పూర్తిగా అవగాహన చేసుకోగలిగాను. వాస్తవానికి, మలవ్యర్థాల అశాస్త్రీయ నిర్వహణ కారణంగా ఎదురయ్యే సవాళ్లు సంక్లిష్టమైనవే కాదు, ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నవి కూడా. అది కేవలం పారిశుద్ధ్యానికి సంబంధించిన విషయం కాదు, గ్రామీణ ఆరోగ్యం, వ్యక్తి ఆత్మగౌరవం, మహిళా సాధికారత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో ముడిపడిన విషయం. 2022లో మనం మహాత్ముని 153వ జయంతిని జరుపుకుంటున్న నేపథ్యంలో, స్వాతంత్ర్యానంతర భారతదేశంలో పారిశుద్ధ్య ఉద్యమ గతిని, ప్రాధాన్యతలను, ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014లో స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బిఎం)ను ప్రారంభించిన అనంతరం పారిశుద్ధ్య సంవాదపు అద్భుత పునరుజ్జీవనాన్ని సమీక్షించుకోవడం ఎంతో అవసరం, లాభదాయకం.

తొలినాళ్లలో సవాళ్లు

మార్చి 1970లో సులభ్‌ను ప్రారంభించక ముందుకాలంలో, భారత్ 'క్యాచ్ 22' (పరస్పర ఆధారిత పరిస్థితుల కారణంగా తప్పించుకోలేని సందిగ్ధ లేదా క్లిష్టమైన స్థితి) అన్న నానుడిలో చిక్కుకుని ఉంది. పట్టణ మురుగునీటి వ్యవస్థ బాధాకర స్థాయిలో అసమగ్రం కాగా, గ్రామీణ మురుగునీటి వ్యవస్థ అసలు లేదు. దీనితో, డ్రై లెట్రిన్లు, బహిరంగ మలవిసర్జన మధ్యనే ఎంపిక చేసుకోవలసి వచ్చేది. దురదృష్టవశాత్తు ఈ రెండు ఎంపికలూ కూడా సమానంగా హానికరమైనవి. రెండూ దుర్వాసనతో కూడిన మురుగుకు దారి తీయడమే కాక, మట్టి లేదా భూకాలుష్యానికి, భూగర్భ జలాలు కలుషితం కావడానికి కారణ మయ్యాయి. మలంలో గల ప్రమాదకర సూక్ష్మక్రిములు ఎంత చలనశీలమైనవి, సమర్థవంతమైన వంటే, అవి దాదాపు 30 అడుగుల దూరం వరకూ నీటి మూలాలను కలుషితం చేయగలవు. దీనిపై ఇసుక వేయడమన్నది పరిస్థితికి పాక్షిక విరుగుడు అయినప్పటికీ, భారత్‌లో సర్వసాధారణమైన వరదల సమయంలో పరిస్థితి అత్యంత దారుణంగా మారే అవకాశాలు ఉండేవి. అందుకే గ్రామీణ భారతంలో తరచుగా కలరా, నీటి ద్వారా సంక్రమించే ఇతర వ్యాధులు పెచ్చరిల్లు తుండేవి.

అత్యవసర వైద్య పరిస్థితులకు మాత్రమే కాకుండా, డ్రై లెట్రిన్లు, బహిరంగ మలవిసర్జన అన్నవి ఇతర సమస్యలకు కూడా దారి తీసేవి. పరిశుభ్రత, ఆరోగ్యం, ధర్మనిష్ఠ మధ్య గల తాత్విక లంకెలను పట్టి చూపే ఉపదేశాలు మన ప్రాచీన భారతీయ గ్రంథాలలో ప్రముఖంగా ఉన్నప్పటికీ, మన సమాజం ఎందుకో పారిశుద్ధ్యాన్ని ఒక సీమాంత లేక పరిధీయ సంభాషణగా మార్చింది. అలాగే, దానికి సంబంధించిన ప్రతినిధులను, అంటే పారిశుద్ధ్య కార్మికులు, పాకీ పని చేసే కార్మికులను అస్పృశ్యులుగా ముద్రవేసి,

పందులు, పశువులతో కలసి గ్రామ శివార్లలో నివసించేలా బహిష్కరించారు. ఈ సామాజిక కళంకం లేదా మచ్చ ఎంత కఠినంగా ఉండేదంటే, ఆ వర్గానికి చెందిన వ్యక్తులకు వేరొక వృత్తిని చేపట్టే అవకాశమే ఉండేది కాదు.

భారతదేశంలో, ముఖ్యంగా పేదల జీవనోపాధి, ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత (వాటర్, శానిటేషన్ అండ్ హైజీన్ – WASH) సేవలు కీలకం. అపరిశుభ్ర పరిసరాలు, పరిస్థితుల్లో జీవిస్తున్నప్పుడు మహిళలు, ఐదేళ్లలోపు పిల్లలు అత్యధికంగా ప్రమాదానికి లోనవు తారన్నది శాస్త్రీయంగా నిరూపితమైన అంశం. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఆరోగ్య సంక్షోభం, వేగంగా ఆర్థిక కష్టాలకు గురయ్యే పరిస్థితి తరచుగా ఆ తరాన్ని మాత్రమే కాక తర్వాత తరాలను ప్రభావితం చేసేలా పెరుగుతాయన్నది సులభ్ ఐదు దశాబ్దాల సుదీర్ఘ వృత్తిలో గమనించిన విషయం. ఈ కారణాల వల్లే, మల అశాస్త్రీయ నిర్వహణకు పరిష్కారం కనుక్కోవడం అన్నది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపైనే కాదు, దాని సామాజిక నిర్మితిపై కూడా సానుకూల ప్రభావం చూపుతుందని మనకు తెలుసు.

మురుగునీటి నెట్‌వర్క్ పరిమితం అయినందున, సులభ్ రెండు గుంతల ఫ్లష్ టాయిలెట్ (టూ పిట్ పోర్–ఫ్లష్ టాయిలెట్) అన్నది అత్యంత స్థిరమైన, తక్కువ ఖర్చుతో కూడిన వ్యవస్థగా ఉద్భవించింది. ఇది అందుబాటు ధరలో, తేలికగా నిర్మించగల, విసర్జించిన మలపదార్థాన్ని ఎరువుగా మార్చడం ద్వారా కాలుష్యం, వ్యాధులకు కారకమైన దానినే మట్టిని మళ్లీ పునరుజ్జీవం చేసేదానిగా మార్చడం అన్న లాభాలను కలిగించింది.స్వచ్ఛ భారత్ మిషన్ సమయంలో గరిష్ట సంఖ్యలో నిర్మించిన మరుగుదొడ్లు సులభ్ టెక్నాలజీని ఉపయోగించాయన్న వాస్తవం దాని సాఫల్యతకు ప్రమాణంగా నిలుస్తుంది.

ఎస్‌బిఎం: ప్రధాన స్రవంతిలోకి పారిశుద్ధ్య చర్చను తేవడం

పారిశుద్ధ్యం, పరిశుభ్రత అన్నవి కేవలం ఉమ్మివేయడం, చెత్త వేయడం, బహిరంగ స్థలాలలో మూత్ర లేదా మల విసర్జన వంటి అనారోగ్యకరమైన అలవాట్లకు మాత్రమే పరిమితం కాదన్న విషయాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. అవి శరీరానికి, మనసు రెండింటికీ సంబంధించిన అలవాట్లతో కూడి ఉంటాయి. సంపూర్ణమైన పరివర్తనకు అవసరమైన మూడు ముఖ్యాంశాలు – సమస్యలపై నిరంతర చర్చ, బలమైన విధానపరమైన జోక్యం, చురుకైన రాజకీయ నాయకత్వం అని నా అనుభవం సూచిస్తుంది.

మహాత్మాగాంధీ ఈ మూడింటినీ అవిశ్రాంతంగా, అనేకసార్లు తానే ఉదాహరణగా ఉంటూ ముందుకు తీసుకు వెళ్లారు. అయితే, 1948 అనంతర సంవత్సరాలలో, గ్రామీణ పారిశుద్ధ్యాన్ని తొలి పంచవర్ష ప్రణాళిక కార్యక్రమం (1951–56) పొందుపరిచినప్పటికీ, ఈ విషయంలో సుదీర్ఘకాల స్తబ్దతకు దేశం సాక్షిగా ఉంది. శాస్త్ర, సాంకేతిక రంగాలలో భారీ ప్రగతిని సాధించి, అస్పృశ్యతను నిర్మూలించేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకున్నప్పటికీ, పారిశుద్ధ్య స్థితిగతులు దాదాపుగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. అదృష్టవశాత్తు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తొలిసారి చారిత్రక ఎర్రకోట నుంచి మాట్లాడుతూ, 'మహాత్మా గాంధీ హృదయానికి అత్యంత సన్నిహితమైన' రెండు లక్ష్యాలు – పరిశుభ్రత, పారిశుద్ధ్యం పట్ల తమ ప్రభుత్వ నిబద్ధతను ప్రకటించారు. తర్వాత 2 అక్టోబర్ 2014లో ఎస్‌బిఎంను అధికారికంగా ప్రారంభించారు.

భారతదేశంలో పారిశుద్ధ్య స్థితిగతుల గురించి ప్రధానమంత్రి స్పష్టమైన అభిప్రాయాలు, కొంత మందికి అసంతృప్తిని కలిగించినప్పటికీ, పారిశుద్ధ్యంపై బహిరంగ చర్చను పునరుజ్జీవింపచేశాయి. దాదాపు ఆరు దశాబ్దాల అంతరం తర్వాత పారిశుద్ధ్య అంశాన్ని ప్రధాన స్రవంతిలోకి తెచ్చి, దేశంలో అత్యున్నత ప్రాధాన్యం కలిగిన దానిగా చేస్తారనేందుకు ఇది స్పష్టమైన సంకేతం. ఈ ఉద్యమం సంచలనాత్మకమే కాక, ఇప్పటివరకూ తెరమరుగైన విషయాన్ని హఠాత్తుగా సర్వవ్యాప్తం చేసింది.

ఎస్‌బిఎం 2, దాని ఆవల

ఏదైనా ప్రగతిశీల చర్చను ముందుకు తీసుకు వెళ్లేందుకు తగిన మౌలిక నదుపాయాలను సృష్టించడం అత్యవసరం. ప్రస్తుత ప్రభుత్వం చెప్పింది చేసిందనే విషయాన్ని అంగీకరించడానికి నాకు ఎటువంటి సంకోచం లేదు. పారిశుద్ధ్యం రాష్ట్ర అంశమైనప్పటికీ, ఆర్థిక, సాంకేతిక తోడ్పాటును కేంద్రం రాష్ట్రాలకు అందించింది. ఇందులో, ఇంట్లో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ. 12,000 ప్రోత్సాహకం, వ్రజా పారిశుద్ధ్య సముదాయాలు (సిఎస్‌సిలు)కి నిధులను సమకూర్చింది. పరిశుభ్రత ప్రవర్తనకు సంబంధించిన అంశమైనా, ప్రజలలో అవగాహన పెంచేందుకు భారీ స్థాయిలో సామర్థ్య నిర్మాణ విన్యాసాలు, బహుళ మార్గాల ద్వారా సమాచారం, విద్య, కమ్యూనికేషన్ (ఐఇసి) చొరవలను ప్రారంభించారు. సులభ్ స్కూల్ శానిటేషన్ క్లబ్‌లకు సంబంధించిన నా స్వంత అనుభవం, ఐఇసి కార్యక్రమాల ప్రభావం సమర్థవంతం, శాశ్వతం.

ప్రధాని మోదీ సామాజిక ఆధారిత విధానం అత్యంత లాభాలను అందించింది. 2014–15, 2019–20 మధ్య కాలంలో 10 కోట్లకు పైగా మరుగు దొడ్డను నిర్మించి, అక్టోబర్ 2, 2019న గ్రామీణ భారతం బహిరంగ మలవిసర్జన రహితమని ప్రకటన చేశారు. ఎస్‌బిఎం2ను 2020లో ప్రారంభించడమే కాక గోబర్‌ధన్ పథకం కింద బయో–గ్యాస్‌ను ప్రోత్సహిస్తూ గ్రామాలను బహిరంగ మల విసర్జనరహితంగా ఉంచడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాకుండా తన లక్ష్యాలను విస్తృతం చేసి, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ (ఎస్ఎల్ దబ్ల్యు ఎం)ను కూడా ఇందులో పొందుపరిచి, చెత్తరహిత నగరాలను సాధించాలని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. వార్షిక స్వచ్ఛ భారత్ సర్వేక్షణ్ (2017లో ప్రారంభించిన) లో గ్రామానికి ఒడిఎఫ్ హోదా లేదా ఒక నగరానికి ర్యాంక్ ఉండటం అన్నది ప్రస్తుతం అత్యధిక సామాజిక లాభాలను కలిగి ఉంది. అంతేకాక, ఆ ర్యాంకులు పాలన స్థితిగతుల ప్రత్యక్ష ప్రతిఫలం. "మనం మన చెత్త అలవాట్ల నుంచి బయటపడి, మరుగుదొడ్లను మెరుగుపరచుకోకపోతే, మనకు స్వరాజ్యం పట్ల విలువ ఉండదు" అని ఒకసారి గాంధీ పేర్కొన్నారు. ఎస్‌బిఎంతో స్వరాజ్ నుంచి పారిశుద్ధ్యాన్ని వేరుచేయలేని ప్రాథమిక అంశంపై పట్టుబట్టడం అన్నది వాస్తవికతకు మరింత సన్నిహితం అయింది.

(ఆర్గనైజర్ నుంచి)

"నువ్వు కంగారు పడకు. ఇది స్టడీస్ టైమ్. నాలుగయిదు రోజుల్లో కోపం తగ్గాక వస్తుందని అనుకోవద్దు. ఆద్య పట్టుదల నాకు తెలుసు. నేను తొందర్లో వస్తాను. మనం మాట్లాడుకుందాం" అంది స్వప్న.

"ఈ విషయం శ్వేతకు చెబుతావా?"

"ఆలోచిస్తాను. నేను శ్రీనివాస్‌తో కూడా మాట్లాడతాను" అంది స్వప్న.

* * *

గోవింద్ బుద్ధ రామకృష్ణకి ఏదో విషయం చెప్పాడు.

"నిజమా" అన్నాడాయన.

తలూపాడు. "మంచిదే బుద్ధా... జనరేషన్ మారుతోంది. ఎవరి ప్లాన్స్ వారికి వుంటాయి. లెట్ దెమ్ ప్రోసీడ్" అన్నాడు.

ఆ తర్వాత "నాకు ముంబయ్ వెళ్లాలని వుంది" అన్నాడు.

"కొంత కాలం మీరు ఇక్కడ వుంటే బాగుండునని పిస్తోంది సర్. మనం అనుకుంటున్న పనులు ఇప్పుడు ఓ రూపంలోకి వస్తున్నాయి. ఇప్పుడు మీరు ముంబయ్ అంటే రిత్విక్‌ని మీ దగ్గరకు పంపించాలి. నేను కూడా కొన్ని పనుల్లో బిజీగా వున్నాను. మన ముగ్గురం వుంటే మాట్లాడుకోవచ్చు".

"అలాగే... ఇప్పుడు నేను ముంబయ్ వెళ్లి చేయగల పనులు లేవు. రిత్విక్‌కి వీసా తీసుకునే పనిలో వుండు బుద్ధా".

"యు.యస్. వీసానా?"

"కాదు. యు.కే. వీసా... అది ఎంత త్వరగా పూర్తి అయితే అంత మంచిది".

"ఈ రోజు నుంచే ఆ పనిలో వుంటాం సర్" అన్నాడు గోవింద్ బుద్ధ.

* * *

యూనివర్సిటీకి వెళ్లబోతోంది శ్వేత.

అప్పుడు స్వప్న వచ్చి "అయిదు నిమిషాలు నీతో మాట్లాడాలి" అంది. తలూపింది.

"ఆద్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది".

"నాకు తెలుసు మమ్మీ... నాకు చెల్లి ఫోన్ చేసి చెప్పింది".

"నువ్వు నాతో ఎందుకు చెప్పలేదు?" ఆశ్చర్యంగా అడిగింది స్వప్న.

"తను చదువుకుంటానికి ఫ్రెండ్ రూమ్‌కి షిఫ్ట్ అయింది. ఇంటి దగ్గర కంటే కంబైన్డ్ స్టడీ అయితే బాగుండును అనుకుంది. అయినా ఆద్య విషయం పిన్ని నీకు చెబుతుందని నాకు తెలుసు".

తన భావాలను అణుచుకుని "ఆద్య ఇంకేమన్నా చెప్పిందా?"

"అంటే...."

"ఇంట్లో గొడవల గురించి, తను ఇంటి నుండి ఎందుకు రూమ్‌కి వెళ్లాల్సి వచ్చింది. ఇలాంటి విషయాలు".

"నాకు ఏమీ చెప్పలేదు మమ్మీ... నేను ఫ్రెండ్ రూమ్‌కి మారాను అని మాత్రం చెప్పింది. ఏమన్నా గొడవలు జరిగాయా?"

"ఏదొకటి జరగకపోతే ఇంత సడన్‌గా బయటకు ఎందుకు వెళ్తుంది" అంది స్వప్న.

"ఒకటి మాత్రం నేను చెప్పగలనమ్మా.. ఆద్య అంటే నాకు ఎడ్మిరేషన్ వుంది. నేను కొన్ని విషయాల్లో తన అభిప్రాయాలు తెలుసుకుంటుంటాను. ఐ.ఎ.ఎస్.లో అనేక సబ్జెక్ట్ లు వుంటాయి. ఒక్కోసారి తన విశ్లేషణ నాకు ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆద్య తొందరపడదు అని నా అభిప్రాయం. పిన్నితో చిన్న చిన్న డిఫరెన్సెస్ వున్నా... ఆ రిలేషన్‌ని తెంచుకునే అంత మూర్ఖంగా ఆద్య వుండదని అనుకుంటున్నాను".

అప్పుడు స్వప్న ముఖం మారిపోయింది.

"నేను ఆద్యని కలుసుకుంటాను. మాట్లాడతాను. ఇలాంటి వాటి విషయంలో ఆలస్యం జరగటం మంచిది కాదు. అప్పుడు సమస్యలు మరింత కాంప్లికేట్ అవుతాయి. నేను వస్తాను" అని వెళ్లిపోయింది.

స్వప్న అలానే నిలబడిపోయింది. అప్పుడు శ్రీనివాస్ వచ్చాడు.

"నువ్వింకా ఆద్య గురించే ఆలోచిస్తున్నావా?" అనగానే అతనికేసి తిరిగింది.

"అలా వున్నావేంటి?" అన్నాడు.

"మనం శ్వేత గురించి కూడా ఆలోచించాలి శ్రీనివాస్" అంది.

"ఇప్పుడేమయింది?"

"ఏమీ కాలేదు. నేను అఖిల దగ్గరకు వెళ్లి వస్తాను" అంది.

* * *

ఎండివై రామమూర్తి స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

''హారికా... నేను వీసాకోసం ఈ రోజు వెళ్తున్నాను".

"అమెరికన్ వీసాకా?"

"కాదు. యు.కె. వీసా కోసం".

"అవుతుందంటారా?"

''అవుతుందనుకుంటున్నాను. సీనియర్ సిటిజన్స్‌కి అభ్యంతరం పెట్టరు. అలాగే నేను ఓ ప్రముఖ కంపెనీ తరపున వెళ్తున్నాను. అందులోనూ విజిటర్స్ వీసా కదా".

"మొట్టమొదటిసారి విదేశం చూడబోతున్నారు. అందులోనూ ఈ మధ్య కాలంలో మీకు పాస్‌పోర్ట్ రెన్యూల్ అయింది. నాకు చాలా సంతోషంగా వుంది".

"నువ్వు కూడా నా పక్కన వుంటే ఇంకా నాకు సంతోషం".

"నాకు ఇల్లే లండన్. అమెరికా!"

ఇద్దరూ నవ్వుకున్నారు.

"ప్రయాణం ఎప్పుడో తెలిసిందా?"

"ముందు వీసా కన్ ఫామ్ కావాలి. ఇప్పుడు నాకు ఏమనిపిస్తుందో తెలుసా? ఇది నా అదృష్టం. ఇప్పటికే నేను లెజెండ్స్‌తో జర్నీలో వున్నాను. గోవింద్ గారు నా వెనక వుంటాను అన్నారు. అయితే ఇంత అదృష్టం అందిస్తారని నాకు తెలియదు. ఇప్పటి వరకు నా ప్రయాణం వేరు. ఇప్పుడు చేయబోతున్నది వేరు. నాకు టైం అవుతోంది. మళ్లీ మాట్లాడతాను" అని ఫోన్ కట్ చేసి వెనక్కి తిరిగాడు.

అక్కడ గోవింద్ నిలబడి వున్నాడు.

"హారికతో...."

"విన్నాను. ఆశయాలలో, ఆవేదనలో నిండుగ నిలిచే తోడొకరుండిన అదే భాగ్యమూ, అదే స్వర్గమూ అనే వదాలు నాకు చాలా ఇష్టం రిత్విక్'' అన్నాడాయన.

* * *

తులసి వసుంధర దగ్గరికి వచ్చింది. అప్పుడు తను సరయూతో మాట్లాడుతోంది. కూతురుతో మాట్లాడుతున్నప్పుడు వసుంధర కళ్లల్లో కనిపిస్తున్న ఆనందాన్ని గమనిస్తోంది. వసుంధరకి అమ్మ అడుగుల చప్పుడు కూడా వినిపించలేదు. ఫోన్ మాట్లాడటం పూర్తి అయ్యాక తృప్తిగా చూసుకుని తల పంకించింది. అప్పుడు అమ్మని గమనించింది.

"ఎంత సేపయిందమ్మా వచ్చి..."

"నువ్వు సరయూతో మాట్లాడుతున్నప్పుడు".

వసుంధర ముఖంలో సన్నటి రేఖ మెరిసి మాయం అయింది.

పి. చంద్రశేఖర ఆజాద్
9246573575

"నన్ను పిలిస్తే వచ్చే దాన్ని కదమ్మా".

"అడుగులు వేయాలనిపించింది వసూ..." అని....

''నేను ఇండియా వెళ్తాను'' అనగానే ఉలిక్కిపడింది.

"ఇండియానా?"

"అవును".

"ఇప్పటికిప్పుడు నీకు తోడుగా రావటానికి నాకు కుదరదమ్మా".

"జయమ్మ వుందిగా నాతో వస్తుంది".

"నిలబడి మాట్లాడుతున్నావు. కూర్చోమ్మా".

''ఫర్వాలేదు. ఇప్పటి దాకా విశ్రాంతి తీసుకున్నాను. నన్ను నిలబడనీ".

"ఇప్పుడు నీకు ఇండియా వెళ్లాలని ఎందుకు అనిపించింది" అదోలా అంది వసుంధర.

"అక్కడ నా రూట్స్ వున్నాయి వసూ... ఇప్పటి దాకా సరయూతో మాట్లాడుతుంటే నీ ఆనందాన్ని చూసాను. నాకు ఇంకో కూతురు వుంది. అలాగే రసజ్ఞ వుంది. కారణాలు ఏమైనా వారిని నేను మిస్సవుతున్నాను. ఇప్పుడు ఆలోచిస్తుంటే ఈ వయసులో నాకు పట్టుదలలు అవసరమా అనిపిస్తోంది..."

"భువన దగ్గరికి వెళ్తే నీకు అవమానాలు జరుగుతాయి. ఈ వయసులో అవన్నీ నీకు అవసరమా?"

"వసూ... సరయూ నీకు ఒక్క ఆడపిల్ల కావచ్చు. రేపు ఇలానే వుంటుందా? ఏమయినా జరగవచ్చు. అప్పుడు సరయూని కాదనుకుంటావా?"

వసుంధర మాట్లాడలేకపోయింది.

"ఎక్కువ సమయం లేదు పరిష్కరించవలసిన సమస్యలు చాలా వున్నాయి. కొంతమందికి నేను క్షమాపణలు చెప్పాలి. కొంతమందిని కౌగలించుకుని తనివి తీరా ఏడవాలని వుంది" అంటున్నప్పుడు ఆమె గొంతు వణికింది.

"ఇప్పటికి కూడా ఇలాంటి పని చేయకపోతే భగవంతుడు ఇంకో అవకాశం ఇవ్వడు. అప్పుడు బతికినంతకాలం ఏడుపు తప్ప ఇంకేం మిగలదు. అందుకని త్వరగా టిక్కెట్లు బుక్ చేయించు" అని వెనక్కి తిరిగి తన గదికి వెళ్లిపోతుంటే వసుంధరకి

ఏం చేయాలో అర్థం కాలేదు.

అప్పుడు ఫోన్ రింగ్ అయింది.

"రమేష్... సమయానికి ఫోన్ చేసావు. అమ్మ ఇండియా వెళ్తాను అంటోంది".

"నిజమా!"

"ఇప్పుడే టిక్కెట్లు బుక్ చేయమంది. జయమ్మని తీసుకుని వెళ్తాను అంది".

"నువ్వు ఆ విషయం గురించి ఆలోచించకు. తను ఏదో ఎమోషన్‌లో వున్నారు. నాలుగు రోజులు ఆగితే మళ్లీ మామూలుగా అయిపోతారు".

"నాకు అలా అనిపించటం లేదు రమేష్. అమ్మ మనసులోకి ఇలాంటి ఆలోచన రాకూడదు. వస్తే తను అనుకున్నది చేస్తుంది".

రమేష్ మాట్లాడలేదు.

"నేను ఓడిపోతున్నాను అనిపిస్తోంది!"

"ఎవరి మీద?"

"భువనేశ్వరి మీద".

"నాన్సెన్స్ వనూ...నీ చెల్లి మీద నువ్వు ఓడిపోవటం ఏమిటి! అసలు వారికీ మనకూ ఏ విషయంలో పోలిక వుంది. ఆస్తుల విషయంలోనా... ఇంకే విషయంలో అయినా వాళ్లు మనకు సరితూగరు. నువ్వు వారికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తున్నావు. ఇందులో గెలుపు, ఓటములు ఏంటో నాకు అర్థం కావటం లేదు. అత్తయ్యని వెళ్తే వెళ్లమను. ఏమవుతుంది? మనది వేరే ప్రపంచం. ఇందులో నువ్వూ, నేనూ, సరయూ, రాహుల్ వున్నాం చాలు. నేను లంచ్‌కి రావటం లేదు. అది చెప్పటానికి ఫోన్ చేసాను" అని కట్ చేసాడు.

తన ముందు ఇంకో వసుంధర నవ్వుతున్నట్లు అనిపించింది.

ఈ పరిస్థితిని ఆమె జీర్ణించుకోలేకపోతోంది.

* * *

ఎయిర్ పోర్ట్ నుండి శ్వేతని ఆద్య రూమ్‌కి తీసుకు వచ్చింది. అప్పుడు జూలీ వుంది. అక్కను పరిచయం చేసింది. "ఇంతకు ముందు మీ గురించి ఆద్య చెప్పింది. తను మీ గురించే ఎక్కువ మాట్లాడుతుంది. మీరంటే తనకు అడ్మిరేషన్. మీరు కాబోతున్న కలెక్టర్ కదా... నాకు కొంచెం పనుంది. మనం లంచ్‌లో కలుద్దాం" అని గడగడ మాట్లాడి వెళ్లిపోయింది జూలీ.

"నేనంటే నీకు అంత ఎడ్మిరేషనా ఆద్యా" అంది శ్వేత.

"అవును. నాకు వుంది నువ్వే కదా అక్కయినా, ఫ్రెండయినా!"

"ఇప్పుడు చెప్పు" అంది.

"ప్రత్యేకంగా చెప్పటానికి ఒకే విషయం వుంది అక్కా...! ఇప్పటి వరకు మనం కొన్ని విషయాలు పట్టించుకోలేదు. మనది చదువుకునే వయసు. మన ఇంట్లో చాలా ఘర్షణలు జరిగాయి. అవన్నీ మనకు లీలగానే తెలుసు. ఆ ఘర్షణల సమయంలో గది తలుపులు మూసుకునేవి. మనల్ని దగ్గరకు రానిచ్చే వారు కాదు"

"పిల్లల ముందు తగాదా పడటానికి ఏ తల్లిదండ్రులూ ఒప్పుకోరు ఆద్యా" అంది శ్వేత.

"అది మంచి లక్షణమే. నేను కాదనటం లేదు. మనం ఔట్ సైడర్స్‌గా మిగిలాం. కొన్ని విషయాలను ఓ పక్క నుండి మాత్రమే విన్నాం అవునా?" అంది ఆద్య.

తలూపింది.

"ఇప్పుడు నువ్వు కలెక్టర్ కాబోతున్నావు. మెల్లగా నీకంటూ ఓ జిల్లాని కేటాయిస్తారు. ఇంకో డిపార్ట్‌మెంట్‌కి పంపించవచ్చు. అక్కడ కొన్ని వేల మంది ప్రజలు నీ నిర్ణయాల మీద ఆధారపడి వుంటారు. రేపు నేనూ అంతే. నా దృష్టిలో ఒకటుంది. అందుకు నేను ప్రిపేర్ అవుతున్నాను. దాని గురించి తర్వాత చెబుతాను. మన ఇంటిలో సమస్యలు వున్నాయి. అవి పరిష్కరించుకోకుండా ఇంకొకరికి ఏదన్నా చెప్పాలన్నా నాకు సిగ్గుగా అనిపిస్తోంది" అంది ఆద్య.

"అవును... నాకు ఎప్పటి నుంచో ఇలాంటి ఆలోచన వుంది. దేనికయినా సమయం రావాలంటారు. అది ఇప్పుడు వచ్చింది అనుకుంటున్నాను".

"మన రెండు కుటుంబాల మధ్య ఆస్తుల తగాదా లేదు".

"ఇప్పటి వరకు అమ్మా – పిన్నీ ఈ విషయంలో గొడవలు పడటం లేదు. అంత వరకు కరెక్ట్..."

"మరి తాతగారితో గొడవలు ఎందుకు? మనల్ని తాతగారితో మాట్లాడవద్దని ఎందుకు ఆంక్షలు పెట్టారు? చిన్నప్పటి నుంచి నాకు గాని నీకు గాని, తాతగారి ప్రేమ మాత్రం తెలుసు. మనల్ని రెండు కళ్లు అనుకున్నారు. ఆయన్ని ఎందుకు మనకు దూరం చేసారు. ఇది నా బాధ"

"ఇవన్నీ ఇగో ప్రాబ్లమ్స్ ఆద్యా".

"నేను తాతగార్ని సపోర్ట్ చేయను. అలా అని వ్యతిరేకించను. పూర్తిగా ఏం జరిగిందో నాకు తెలియదు. నేను విన్నది కేవలం ఓ కోణం. ఇలా ఎన్ని రోజులక్కా?"

చిన్నగా తలూపింది శ్వేత.

"ఇంత ద్వేషమా... మాటలకి శక్తి వుంటుంది. నేను కాదనను. దాని వెనకాల ప్రేమ కూడా వుంటుంది. తాత తన కూతుర్లని ఏదో అనుంటారు. ఆయనకు తెలియకుండా గాయపరిచి వుంటారు. ఓసారి పంతాలు, పట్టుదలలు వచ్చినప్పుడు ఆ మాటలు ఓ పక్కనే వుండవు. తాతను ఏమీ అనలేదని అమ్మా-పెద్దమ్మా చెప్పగలరా?" అంది కాస్త ఆవేశంగా.

"నేను అర్థం చేసుకుంటాను ఆద్యా".

"ఇంట్లో నీకూ-పెద్దమ్మకి మధ్య ఘర్షణ వాతావరణం వుందో లేదో నాకు తెలియదు. నా విషయం చూడు. నేను జూలీతో స్నేహం చేయకూడదు. ఇది అమ్మ శాసనం. జూలీ డ్రెస్ చూసావు. తను వైన్ తాగుతుంది. సిగరెట్ తాగుతుంది. అది తన పర్సనల్ ఛాయిస్... బట్ షీ కెన్ ఎనలైజ్ ఎనీ థింగ్... అందులో మనకి నచ్చేవి వుంటాయి, నచ్చనివి, అంగీకరించ లేనివీ వుంటాయి. తనేం నన్ను ఫాలో అవమని నన్ను బలవంతం చేయదు. అసలు నేను ఇంటిలో నుండి ఎందుకు బయటకి వచ్చాను. నన్ను అర్థం చేసుకోమని వాళ్లు అంటారు. మీరు తాతని ఎందుకు అర్థం చేసుకోరు అని నేనూ అంటాను కదా!"

"చెప్పాను కదా... ఇవన్నీ ఇంతకు ముందు చిన్న స్థాయిలో వుండేవి. ఇప్పుడు డబ్బుల సమస్య కాదు. అందరూ సంపాదిస్తున్నారు ఆద్యా". **(సశేషం)**

'కార్టూన్ పోటీ - 2023'లో సాధారణ ప్రచురణకు ఎంపికైనది



శ్రీమతి పఠానేని శ్రీశైల భ్రమరాంబ

మహాదొడ్డ నాయకుడు – మన వినాయకుడు

మనదేశంలో త్రిమూర్తులతో సమానంగా వినాయకుని పూజిస్తారు. ఏ మహత్కార్యానికైనా ముందుగా వినాయకుని పూజించి, తమ సత్కార్యాన్ని నిర్విఘ్నంగా కొనసాగించమని ప్రార్థిస్తారు. అక్షరాధ్యానం చేసే ముందు 'గణేశాయ నమః' అని గణపతికి నమస్కారం చేస్తారు. పంచమ వేదముగా పరిగణిస్తున్న మహాభారత రచనకి వ్యాసమహర్షి దగ్గర గణపతి లేఖకుడుగా ఉండి, భారతం భూలోకంలో శాశ్వతంగా ఉండేటట్లు ప్రతిష్టించాడు. మానవుల చేతనే కాక దేవతల వల్ల కూడా వినాయకుడు సర్వదా పూజలు అందుకుంటూనే ఉంటాడు. వినాయకుని పుట్టుకను గురించి అనేక పురాణాల్లో ఎన్నో విధాలైన గాథలున్నాయి. అది ఆయన గాథకు ఉన్న ప్రాచుర్యానికి నిదర్శనం. ఈ విశాల దేశంలో పలు ప్రాంతాలలో పలు గాథలు ఆయన పేరుతో ప్రసిద్ధమైనాయి.

లింగ పురాణంలో విఘ్నేశ్వరుని జన్మ ఇలా ఉంది. రాక్షసులు శివుని కోసం ఘోర తపస్సు చేసి అనేక వరాలు పొంది, దేవతలను హింసించే వారట. రాక్షసుల హింసలు సహించలేక దేవతలు శివునకు మొర పెట్టుకున్నారు. శంకరుడు విఘ్నేశ్వరుని సృష్టించి, రాక్షసుల తపస్సుకు విఘ్నాలు కల్పిస్తూ దేవతలకు తోడ్పడమని ఆజ్ఞాపించాడు. ఈతడు విఘ్నాలు కల్పించడానికి, విఘ్నాలు నివారించడానికి కూడా సమర్థుడు, కనుక అప్పటి నుంచీ ప్రతి కార్యారంభంలోనూ.. పూజలు అందుకుంటున్నాడు. కాబట్టి విఘ్నేశ్వరుడను నామంతో ప్రసిద్ధి.

ఈ వినాయకుణ్ణి గురించి ఎన్నో గాథలున్నాయి. ఆయనకు అనేక నా మాలున్నాయి... గజ రూపుడనీ, ఏకదంతుడినీ, మూషిక వాహనుడనీ, బ్రహ్మ చారియని, లంబోదరుడనీ వర్ణిస్తూ స్తోత్రాలు చేస్తారు.

"మరొక పురాణంలో వినాయకుడు బ్రహ్మచర్య దీక్షా స్వరూపుడుగా వర్ణించ బడినాడు. బ్రహ్మచర్యం సకలార్థ సిద్ధిదాయకమని మన పూర్వుల దృఢ విశ్వాసం. అందుచేతనే విఘ్నేశ్వరునకు కూడా వివాహం చెయ్యకుండా ఉంచేశారు. అందుకే "విఘ్నేశ్వరుని పెండ్లికి వేయి విఘ్నాలు" అనే సామెత కూడా ఉంది. శివపురాణం మాత్రం వినాయకునకు సిద్ధి, బుద్ధి అనే ఇద్దరు భార్యలు ఉన్నట్లు చెబుతుంది.

వినాయకుని గురించి ఇంకా ఎన్నెన్నో గాథలు ఉన్నాయి. గణపతిని అనేక పేర్లతో పూజిస్తారు. వాటిలో ముఖ్యమైనవి ఎనిమిది. 1.లక్ష్మీగణపతి 2. క్షిప్రగణపతి, 3. సిద్ధి గణపతి, 4. చింతామణి గణపతి, 5. శక్తి గణపతి, 6. ఉచ్ఛిష్టగణపతి, 7. ఏకాక్షర గణపతి 8. కుమార గణపతి.

భాద్రపద శుద్ధ చతుర్థికి సిద్ధివినాయకుని పూజిస్తే ఆటు పైన సరిగ్గా ఆరు నెలలకు వచ్చే ఫాల్గుణ శుద్ధ చవితినాడు పుత్రగణపతి వ్రతం.. ఇల్లాంటివన్నీ పంచాంగంలో ఉన్నాయి.

భాద్రపద శుద్ధ చవితినాడు సిద్ధి వినాయక వ్రతం చేసి పాండవులు విజయం పొందారనీ, ఈ వ్రతాన్ని చెయ్యమని ధర్మరాజుకు శ్రీకృష్ణుడే ఉపదేశించాడనీ స్కంద పురాణంలో ఉన్నట్లు హేమాద్రి వ్రత ఖండంలో తెలిపాడు. భవిష్యోత్తర పురాణంలో కూడా ఈ వ్రత మహాత్మ్యం చాలా గొప్పగా వర్ణించబడింది.

వినాయక చవితినాడు చంద్రదర్శనం చేస్తే, నీలాప నిందలు వస్తాయనీ, ఆ పరిహారార్థంగా శ్యమంతకో పాఖ్యానం కథ చెప్పుకోవాలనీ, వినాలనీ పురాణా ల్లోనూ, వ్రతాల్లోనూ ఉంది. ఈ భాద్రపద మాసం వర్షాకాలంలో ఉత్తర భాగం కాబట్టి ప్రకృతి అంతా ప్రౌఢ వయఃపరిపాకంలో, అతి రమణీయ మనోహరంగా, ఇంద్రధనుస్సులతో ఎంతో ఇంపుగా ఉంటుంది. తొలికారు సస్యములన్నీ ఫలోన్ముఖానికి వస్తూంటాయి. సిద్ధముగానున్న అపూర్వ సస్య ఫలాగమము, మధ్యా సరసస్య ఫలాభ్యుదయము నిర్విఘ్నముగా సాగ వలెనని వాంఛిస్తూ వినాయక చవితి పర్వదినం నాడు సిద్ధి వినాయకుని పూజిస్తాము.

వినాయకుని పుష్పములతోనూ, పత్రములు, దూర్వాంకురములతోను పూజించి, ఉండ్రాళ్లు, కుడుములు నైవేద్యం పెట్టి వ్రతం పరిసమాప్తి చేసిన అనంతరం వినాయకునకు ఉద్వాసన చెబుతారు. సర్వ కార్యము ముగిసిన తర్వాత పూజింపబడిన వినాయక విగ్రహం ధాన్యపు గాదెలో దాచుట కూడా ఒక ఆచారము. గాదెలో ధాన్యం ఎప్పుడూ అక్షయమై ఉండాలనే వాంఛతో సిద్ధి వినాయక విగ్రహాన్ని అందులో ఉంచుతారు. అలా ఆ విగ్రహం గాదెలో ఉన్నందువల్ల వినాయకుని వాహనమైన మూషికాలు ఆ గాదెను ఖాళీ చెయ్యవని కూడా ఒక నమ్మకం. దేవతలచేత, మానవులచేత, అన్ని లోకాల వారిచేత

ముందుగా పూజింపబడే వినాయకుని పూజ భాద్రవద శుద్ధచవితినాడు ప్రారంభించి తొమ్మిదిరోజులు వరుసగా చేస్తారు. ఆ రోజులనే గణపతి నవరాత్రులు అని అంటారు. తర్వాత గణపతిని ఊరేగింపుతో అన్ని వీధులూ త్రిప్పి, ఆ విగ్రహాన్ని చెరువులోనో, బావిలోనో కలుపుతారు. వెంటనే ఆ చెరువులోని మట్టిని గణపతి విగ్రహం తీసుకువెళ్లిన పళ్లెంలో వేసుకుని ఇంటికి తెచ్చుకుంటారు. ఆ మట్టిని ధాన్యపు కొట్లల్లోనో, పురులకో, గాదెల్లోనో, లేక ధాన్యం పెట్టుకునే గదుల్లోనో చల్లుతారు. ఇవి మన పూర్వ సాంప్రదాయాలు.

యుగయుగాల నుండి కూడా మహాదొడ్డ నాయకుడుగా మన వినాయకుడు ప్రసిద్ధి వహించాడు. అట్టి వినాయకుని పర్వదినమైన చవితినాడు వినాయక పూజకి ఉపక్రమిద్దాం–చవితి నుంచి తొమ్మిదిరోజులూ ద్విగ్విజయంగా ఈపూజలు జరగాలని వేడుకొందాం. యావత్తు భారత దేశంలోని పంటలూ సమృద్ధిగా పండించమని ప్రార్థిద్దాం.

(31.8.1962 'జాగృతి' సంచిక నుంచి కొన్ని భాగాలు)

జాతీయోద్యమ గణేశుడు

హిందూ సమాజ పునరుజ్జీవనోద్యమానికి గణేశుడి ఆశీస్సులు ఉన్నాయి. లోకమాన్య బాలగంగాధర తిలక్ నిర్మించిన ఈ పునరుజ్జీవ నోద్యమం వెనుక వినాయకుడు ఉన్నాడు. కొంత రూపురేఖలు మారినా ఇవాళ దేశమంతా కనిపిస్తున్న సామూహిక వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనోత్సవాలు తిలక్ మహరాజ్ ప్రారంభించినవే.

భారతీయ సమాజం తనదైన ఉనికిని, అస్తిత్వాన్ని కోల్పోయి సాంస్కృతికంగా నిస్తేజంగా మిగిలి ఉన్న సమయంలో తిలక్ గణేశుడి ఉత్సవాలను ప్రారంభించారు. 1893లో ఆయన మహారాష్ట్రలో ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. మనదైన జీవనం కోసం, మనదైన తాత్వికతను పునరుద్ధరించడం కోసం ఆయనకు ఆ సమయంలో అలాంటి ప్రయత్నం అవసరమైంది. అనేక విధాలుగా చీలిపోయి ఉన్న హిందువులను ఆయన సామూహిక వినాయక పూజలతో ఐక్యం చేయాలని సంకల్పించారు. అంతకు ముందు పీష్వాలు కూడా ఇలాంటి ప్రయత్నం చేశారు. కానీ తిలక్ కాలానికి ఇలాంటి సామూహిక భక్తి కార్యక్రమం అవసరం మరింత పెరిగింది. అందరూ ఎవరి ఇళ్లలో కూర్చుని వారు వినాయకుడిని పూజించే కంటే, సామూహిక ఉత్సవాలలో అందరినీ ఏకం చేస్తే కాగల కార్యాన్ని గణేశుడే పూర్తి చేస్తాడని తిలక్ నమ్మారు. ఆయన ఆలోచన 1893లో కార్యరూపం దాల్చింది. తొమ్మిదిరోజుల పాటు కులాల సంగతి మరచి, ఆ తారతమ్యాలు పక్కన పెట్టి అంతా కలసి ఒకే పందిరి కింద విఘ్న నాయకుడిని పూజిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అలాగే అంతా కలసి నిమజ్జనోత్సవంలో పాల్గొనడం మరొకటి. కలసి పూజలు చేయడం, అడుగులో అడుగు కలిపి

చవితి చంద్రుడిని ఎందుకు

భాద్రపద శుద్ధ చవితినాడు వినాయకుని పూజించుట మన సాంప్రదాయము, 'సర్వాత్వా కర్మాణి కుర్వీత" అను వాక్యముననుసరించి మనము చేయు ప్రతి కర్మను తెలిసి చేయవలయును. మన భారతీయ పర్వ దినములలో "వినాయక చతుర్థి" ఒకటి. దీనిని గూర్చి శాస్త్రములందు అనేక విధములుగా యున్నది. ఇందు వినాయకుని స్వరూపం, వాహనము, వివాహము విషయములు సమగ్రముగా చర్చించబడుచున్నవి.

పురాణ కథలు

వినాయకునిగూర్చి పురాణగాథలెన్నో గలవు. చవితి వినాయకునకు ప్రీతికరమైన తిథియని ధర్మశాస్త్రములు తెల్పుచున్నది. ఇందులో పార్వతి నలుగు పిండితో చేసిన బొమ్మ ఉదంతం చాలా ప్రసిద్ధి.

దక్షిణాయణమున దేవతలు నిద్రింతురు. అందు తదియ గౌరి, విదియ విశ్వకర్మ, చవితి గణపతి ఇట్లే ఆయా తిథిలందు ఆయా దేవతలు నిద్రింతురు. నిద్రించు తిథిగాన చవితినాడు పూజనీయుడు గణపతియని వామన పురాణము వలన తెలియును. పార్వతితో చెలికత్తెలగు జయా విజయాలు "శివునికి నందీశ్వరాది పరివారము చాలా యున్నది. నీకు లేకుండుట చాలా చిన్నతనము గాన నీవును పరివారమును సంపాదింపుము" అనిరి. ఆ మాటపై ఆమె స్నానం చేయుచూ నలుగు తీసి యొక బాలునిగా యొనర్చి వస్త్రాభరణములు అలంకరించి ద్వారముకడ నిలబెట్టెను. శంకరుడంతలో అచటకు వచ్చి లోపలకు పోబోవ ప్రయత్నింప ఆ బాలుడడ్డు పెట్టెను. అంతట కోపించి, శివుడు వాని తలను శూలముచే ఖండించెను. శాంకరి కోపించి జగత్సంహరము చేతునని చెప్ప, దేవతలు ఆమెను శాంతింపచేయుటకు, ఆమె కుమారుడు దేవ జ్యేష్ఠుడనియు, అతనినెల్లరు ముందుగ పూజింప వలయుననియు తెలిపి, పునర్జీవితుని చేసిరి. అప్సరసలు గొనిపోయిన ఆ బాలుని తలను గొనితెచ్చుటకు వారిని బంపెను. అప్సరసలు కానరారైరి. తుదకుత్తరాభి ముఖముగా పరున్న ఏనుగు తల తెచ్చిరి. ఆ తల అతికించి, త్రిమూర్తులు తమ తమ తేజస్సులను ఆ మూర్తి యందు వేదమంత్రముచే ప్రతిష్ఠించిరి. ఇవి కాక కొన్ని కథలు కూడా ఉన్నాయి. అవి మరుగున పడుతున్నాయి. అందులో ఒకటి.

ఆనాడు చవితిగాన చవితి గణపతి పూజా రోజుగా నిర్ణయింపబడెనని శివ పురాణము చెప్పుచున్నది. ఒకనాడు శివుడు మంధరాద్రిపై విహరించుచూ, పార్వతిని "కాళీ" (నల్లని దానా) అని పిలిచెను. దానికి ఆమె కోపించి బ్రహ్మను గూర్చి తపము చేసెను. అంత బ్రహ్మ వరమీ యరాగా తనను కనిపెట్టుకొనియున్న 'పులికి' ముందు వరమియమని పలికెను. దానిపై బ్రహ్మ ఆ పులిని "వినాయకుని"గా చేసెను. పార్వతికి స్వర్ణచ్ఛాయ నిచ్చెను. ఆనాడు చవితి గాన గణపతి పూజరోజని మరియొక పురాణము చెప్పుతున్నది. ఇట్లు పురాణములు పలు విధములుగా గణపతి పూజా తిథిని, పుట్టుకను గూర్చి చెప్పుట కానవచ్చు చుండెను.

ఏకదంతుడు

ఒకప్పుడు పరశురాముడు శంకర దర్శనమునకు రాగా శివభగవానులు ఒంటరిగాయున్నారు, వెళ్ల వీలు లేదని గణపతికడ్డెను. అంత పరశురాముడు కోపించి, ఒక దంతమును విరిచెనని బ్రహ్మాండ పురాణమును, విష్ణువు తన అంశను పార్వతి యందు ప్రవేశపెట్ట కుమారుడు పుట్టెననియు, శని ఆ బాలుని చూడరాగా ఆ బాలుని శిరము తెగిపోయెననియు,

నడవడం. మళ్లీ చాలా కాలానికి హిందూ సమాజం నేర్చుకున్నది.

ఎన్నో ఫలితాలను ఇచ్చి, ఒక ఐక్యతకు బీజాలు వేసిన గణేశ ఉత్సవాల నిర్వహణ అంత సులభంగా ఏమీ సాధ్యం కాలేదు. ఇటు సమాజంలోని కొందరు ఛాందసవర్గాల నుంచి, అటు ప్రభుత్వం నుంచి ఆయన అవరోధాలు ఎదుర్కొన్నారు. కానీ ఆయన వలె ఆలోచించే స్వాతంత్ర్య సమరయోధులు ఆనాడు ఎందరో ఉన్నారు. వారే లాలా లాజ్‌పతిరాయ్, బిపిన్‌చంద్ర పాల్, అరవింద ఘోష్, రాజ్‌నారాయణ్ బోస్, అశ్వినీకుమార్ దత్త మొదలైనవారు. వీరంతా తిలక్ ఆలోచనను సమర్థించారు. సంస్కృతి ఆధారంగా రాజకీయోద్యమం నిర్మాణం కావాలన్న దృక్పథం కలవారే వారంతా. స్వతంత్ర దేశానికి భారతీయత పునాదిగా ఉండాలని కోరుకున్నవారు కూడా. మిగిలిన ప్రాంతాలలో కొంత తక్కువే అయినా సామూహిక గణేశ ఉత్సవాలు మహారాష్ట్రలో ఎంతో విజయం సాధించాయి. దాని ఫలితమే కావచ్చు. అక్కడ జాతీయోద్యమ ప్రభావం కూడా చాలా ఎక్కువ. ఆ రాష్ట్రంలోని వార్ధా, నాగ్‌పూర్, అమరావతి పట్టణాలు దీనికి చిరునామాగా కూడా మారాయి.

వినాయక చవితి ఉత్సవాలు బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూడా భయపెట్టాయి. రౌలట్ కమిటీ ఈ ఉత్సవాల గురించి ప్రభుత్వాన్ని హెచ్చరించవలసి వచ్చింది. పేరుకు వినాయక చవితి ఉత్సవాలే అయినా ఈ నేపథ్యంతో యువతరంలో బ్రిటిష్ వ్యతిరేకత పెరుగుతున్నదని ఆ కమిటీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఇవాళ్టికి ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. మహారాష్ట్రతో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడులలో వీటి ప్రభావం గణనీయంగానే ఉంది. కొంత స్వరూపం మారి ఉండవచ్చు. అయినా వీటి అవసరం నేడూ కనిపిస్తున్నది. హిందువుల ఐక్యతకు ఇప్పటికీ బెడద ఉన్నది. దాని నుంచి భారతీయ సమాజాన్ని రక్షించుకోవడానికి ఈ ఉత్సవాల ద్వారా వచ్చే ఐక్యత ఉపయోగపడుతుంది. కాబట్టి ఈ ఉత్సవాల పవిత్రతను కాపాడుకోవడం కూడా అవసరం. వీటి స్ఫూర్తిని విస్మరించకుండా, తిలక్ ఆశించిన జాతీయ స్ఫూర్తి అడుగంటకుండా కొనసాగించాలి.

చూడరాదు?

అంతట విష్ణువు గరుడ వాహనమునెక్కి పుష్ప భద్రవనమునకేగి, ఆట ఉత్తరాభిముఖముగా నిద్రించు వొక యేనుగు తల తెచ్చి అతి కెననియు, కుమార స్వామి దంతమును విరిచిననియు బ్రహ్మ వైవర్తనము నందును, దక్షయజ్ఞమున వీరభద్రుడు దంతము విరిచిననియు మరియొక పురాణమును చెప్పుచున్నది. ఈ కారణముల వలన గణపతికి ఏకదంతుడు పేరు కలిగెనని తెలియుచున్నది.

వినాయకుని వివాహము మూషిక వాహనము

సాబరియను బ్రాహ్మణుని భార్య, మనోమయిని క్రౌంచుడను గంధర్వుడు మానభంగము చేయ చూచిన, ఆమె యేడ్చెను. ఆ ఏడ్పు సాబరి విని, ఆ గంధర్వుని ఎలుకవు గమ్మని శపించెను. వాడు కాళ్లమీద పడి యేడ్చినంత, గణపతికి వాహనమై పూజింపబడుదువని అనుగ్రహించెను. మరియు "అగ్నిర్దేవేభ్యో నిలాయతః ఆఖూరూపం కృత్వా పృథివీ రిప్రా విశతః" (తైత్తిరీయ 1.8-6-1) అను మంత్రము ప్రకారము, ఆఖువనగా మూషికము. ఇందు అగ్ని మూషిక రూపం ధరించి భూమిని తవ్వెనని యున్నది. గణపతి అయిన బ్రహ్మ అప్పుడు అగ్ని వాహనమై సృష్టియందు వ్యాపక స్థితిని పొందినదని చెప్పవలయును. భూమిని త్రవ్వెన నుటలో పృథివీతత్వమయిన మూలాధారము నకు గణపతి అధిష్టానదేవత.అతని వాహనము మూషిక మని ప్రసిద్ధం. కాబట్టి వేదసారమును తెలుపు ఈ పురాణములు వేదకథనే యిట్లు చెప్పినవి. "శూర్పకర్ణుడు" అను పేరుకు బ్రహ్మాండ పురాణమున "అగ్నిని ప్రకాశింపచేసినవాడు" అని నిర్వచనము చెప్పినది. అట్లు చెప్పుటచే పై మంత్రార్థము సరిపోవుచున్నది.

చంద్రదర్శనము

'సింహమందు సూర్యుడుండగా శుక్ల పక్ష చతుర్థియందు చంద్రుని చూడరాదు, అట్లు చూచిన అపవాదు కలుగునని మార్కండేయ పురాణము, కన్య యందు సూర్యుడుండు రెండు పక్షముల చతుర్థి యందు చంద్రుని చూడరాదనియు, అట్లు చూచిన అపవాదు కలుగునని పరాశర భవిష్య పురాణము లందున్నది. ఆ దోషం శాంతించుటకై "సింహ ప్రసేనమవధీత్సింహో జాంబవతాహతః! సుకుమారః మారో ధీస్తవ హేష శ్యమంతకః॥" అని పఠించ వలయునని చెప్పబడెను, గణపతి మరుగుజ్జు రూపం చూచి చంద్రుడు నవ్వగా పార్వతి ఆనాడు చంద్రుని చూడరాదని శపించెనని మరియొక కథ.

అసలు గణపతి ఆత్మకు, మనస్సుకు చంద్రుడు దేవతలు. చంద్రుని దర్శింపరాదనగా మనస్సుకు సంకల్పములు (కోరికలు) కలుగచేయరాదని, సంకల్ప స్థితిలో, నిర్వికల్ప సమాధిలో బ్రహ్మను సంధానము చేయవలయును. అట్లు చేయనివాడు లోకనింద పాలగును. దానికే అపవాదని భావము. అది పోవుటకు పై శ్లోకమును చదువ వలయును. ఈ శ్లోకమునకు ఆ భావమునకు సంబంధమేమి? అప్పుడు 'సింహః' అను పదము సింహమును చెప్పదు, సింహరాశిని చెప్పును. ఆ రాశి సూర్యునిది, అట్టి ఆ రాశి జాంబవంతునిచే చంపబడినదనగా 'జాంబవంతుడు ఋక్షపతి – ఋక్షమనగా నక్షత్రము. నక్షత్రాధిపతి చంద్రుడు. దానిచే సింహరాశిని చంద్రుడు అతిక్రమించెనని అర్థము. జాంబవంతుడు కన్యను, కృష్ణునకిచ్చెననుటలో గూడ యిట్లే అర్థము చెప్పవలయును. అనగా చంద్రుడు సింహరాశి కన్యలో ప్రవేశించెనని అర్థం. కాబట్టి ఓ సుకుమారా! ఓ జీవ! (ఓ అజ్ఞానీ) మారోదీఃన = ఏడవకుము. ఈ మణి నీది. ఈ మణి సూర్యవర ప్రసాద లబ్ధం. అనగా సూర్య లభ్యమైనది ప్రాణశక్తి, అదే జ్ఞానం,

ఈ జ్ఞానము నీదే అనగా నీకు స్వయం నీవే. "తత్వమసి" అను జ్ఞానమిదే. ఇది కలిగిననాడు నీకు రోదనంతో పనిలేదు. ఇట్లు ఆత్మ నిగ్రహం నిలుపుకున్నవాడు అపవాదు నొందడని తెలుపుట. ఇది ఆ శ్లోక భావము. ఇటయింకను శాస్త్రార్థము చేయుటకు సావకాశమున్నది.

దూర్వలు

గణపతి సగుణ బ్రహ్మయగు ప్రజాపతి. 'అతడేకంవిశతి. సంఖ్యారూపుడు' అని సూచించుటకు ఇరువది యొక్క దూర్వలు (గరికపోచలు) సమర్పింప వలయును (సర్వాదిగుణముచే యజ్ఞ సమిధలు నిరవది యొకటని ఎరుగునది). పిత్తో ప్రదేశకము వల్లనే స్వప్నములు సంభవించును. దూర్వామూల కషాయమున పిత్త శాంతికరమని, పిత్తగుణ కార్యములయిన స్వప్నములనది నశింపచేయునని వైద్యశాస్త్రము చెప్పుచున్నది. 'దూర్వాదుస్వప్న నాశిని' అను శ్రుతి చెప్పుచున్నది. ప్రస్తుతము, సృష్టియంతయు, ఈశ్వర స్వప్నముగాన, దానిని నివారించినగాని తత్వావబోధ కలుగదు గాన ఈ దూర్వాపూజ చెప్పబడెను.

వక్రతుండుడు

వక్రమనగా-వామం, వ్యతిరేకం. ఆత్మకు సవ్యం, సృష్టికి అపసవ్యం. ఈ రహస్యమునే వామాచార, దక్షిణాచారములని మంత్రశాస్త్రము తెలుపును. అట్టి సృష్టికర్త గణపతి కాబట్టి "వక్రతుండాయ నమః" అని చెప్పి యెర్ర వస్త్రములు సమర్పించవలయును. యెరుపు రజో గుణమునకు గుర్తు. సృష్టికి రజో గుణము కారణము. రజో గుణప్రధానుడు బ్రహ్మ. గాన నెర్రవస్త్రము లీయవలయునని చెప్పబడెను. ఈ అర్థం లోన పెట్టుకొని 'వక్రతుండాయ' అను పేరుకు రాబోవు కల్పమునకు బ్రహ్మయని బ్రహ్మాండ పురాణమును, సృష్టికర్తయే, అని పద్మ పురాణమును చెప్పినవి.

సూర్యచంద్రుల గతిని బట్టియే తిథులు కలుగుచున్నవి. వారి నడక విశేషమును బట్టి ఆయా కాలములలో క్రొత్త శక్తులు పుట్టును. ఆ విషయం తెలుసుకున్న ఋషులు, శివ, నాగ, గౌరి, యిత్యాది పేర్లతో ప్రతములు కల్పించి, ఆ శక్తి యొక్క ఫలమును పొందుటకై మనకు సులభమార్గం చూపినారు. అట్టి కాలశక్తిలో ఒక భాగమే ఈ గణపతి కూడా. సగుణ (ఇహసుఖఫలమునకు) నిర్గుణ (ఆముష్మికఫలమునకు) రెండును చేసి ఫలములు పొందవచ్చును. వేద, పురాణములందు ఈ ఫలముల కొరకే అనేక పేర్లతో అనేక దేవతలను సృష్టించి వాటికనేక కథలను కల్పించి చిత్ర విచిత్ర గతులలో చమత్కరించినవి.

ఆనాడు ఒకసారి ఆకాశం వంక చూడండి, ఈ చతుర్దినాడు సూర్యుడు సింహయందుండగా; చంద్రుడు సూర్యస్వామ్యం గల హస్తా నక్షత్రమునదుండ, శుక్లపక్షమై, తిథి, ప్రాణభాగమైన మధ్యానవ్యాపిని కాగా, ఈ దేవతమునకు పూజనీయు డగుచున్నాడు. ఆకాశమున కూడా ఈ చిత్రమీనాడు చూడవచ్చును. శివపురాణమున తల ఖండింపబడి ఏనుగు తలగలిగినవాడు అని యున్నది. భాద్రపదంలో శుద్ధ చతుర్థినాడు సూర్యచంద్ర గతిలో, హస్తకలవాడు. హస్తయనగా హస్తకధిపతి సూర్యుడు. అతడు ముఖంగా యుండి, అతని యాధిపత్యముగల హస్తలో చంద్రుడిండుక వెనుక యుండుటచే హస్తిముఖుడు చంద్రుడె. తల ఖండింపబడుట మొదలు వివరములు. ఆకాశమున నానాటికి సూర్యచంద్ర గతిలో కలుగు ప్రకాశంబట్టి యున్నది. ఇట్టిచో మనం నేడుపాసించు, గణపతి కాలచక్రములో; సౌరప్రధానమయి ప్రాణ భాగమగుటచే జ్ఞానదాతయయ్యెను. జ్ఞానమునకును, అర్చనాది మార్గములకును, దేవతల దివరాత్రములకు, గరిష్ఠ సంబంధమున్నది. కాబట్టి, జ్ఞానదాతయు గణపతి నారాధించి, జ్ఞానము బొంది, సర్వవిఘ్నములు పోగొట్టుకొని సిద్ధిని పొందుడు అని చెప్పుటకు సంశయము లేదు.

"ఆచార్య అరుణ శ్రీ"

(27.8.1954 జాగృతి ప్రచురించిన వ్యాసం ఆధారంగా)

విశ్వకర్మ యోజన గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు

77వ స్వాతంత్ర్య దిన వేడుకలో ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట మీద ఇచ్చిన సందేశం సాంప్రదాయిక కులవృత్తుల వారి సంక్షేమానికి అవసరమైన పలు పథకాల గురించి ప్రస్తావించింది. మోదీ అధికారానికి వచ్చిననాటి నుంచి కులవృత్తుల వారి అభివృద్ధికి వివిధ స్థాయుల్లో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి ఆర్థిక, సామాజిక వికాసానికి కృషి చేస్తున్నారు. వారి వృత్తి కౌశలాన్ని పెంపొందించేందుకు శిక్షణ, పరిశోధన, ఉత్పత్తుల నాణ్యత ప్రామాణికతకు మెరుగులు దిద్ది ప్రపంచ స్థాయిలో పోటీపడేందుకు బాటలు వేస్తూ రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టారు.

విశ్వకర్మ పథకం కింద గ్రామీణ చేతివృత్తుల వారికి రాయితీ రుణాలు మంజూరు చేయాలని సంకల్పించారు. ఈ పథకం కింద నాయీ బ్రాహ్మణ, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, చేనేత సహా ఇతర కులవృతులవారికి నైపుణ్య శిక్షణకు అవసరమైన ఆధునిక పనిముట్లు, యంత్రాలు, వాటి పరికరాలు కొనుగోలు కోసం రూ.15 వేల వరకు ఉచిత ఆర్థికసాయం అందిస్తారు. దీనివల్ల ఆ వర్గంలో ఉత్పాదక సామర్థ్యం పెరిగి, వారి ఆర్థిక పురోగతికి అవకాశాలు ఏర్పడతాయి. అంతేకాక రూ.లక్ష వరకు తక్కువ వడ్డీ లేదా వడ్డీ లేని రుణాలు అందిస్తారు. రెండో విడత రూ.2 లక్ష వరకు రుణాలు అందిస్తారు. ఇంకా, వృత్తి కళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తారు. అంటే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద దేశంలో 30 లక్షల కుటుంబాలకు ఆర్థిక సహాయం లభిస్తుంది.

విశ్వకర్మ పథకం: బడ్జెట్

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కోసం ఐదేళ్ల పాటు కేంద్ర బడ్జెట్‌లో రూ.13,000 కోట్ల నుండి రూ. 15,000 కోట్ల వరకు కేటాయిస్తారు. మొదటి దశలో 18 సాంప్రదాయిక వృత్తులకు ఈ పథకం అందించనున్నారు. చేతివృత్తి పని వారికి పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్స్ జారీ చేసి గుర్తింపు కార్డులు ఇస్తారు. సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతికి ఈ పథకం అమలు చేస్తారు.

ఈ పథకంతో ఇంకా చర్మకారులు, మేస్త్రిలు, స్వర్ణకారులు, దర్జీలు, పనిముట్లు

ఆయువుపట్టు

సెప్టెంబర్ 17 విశ్వకర్మ జయంతి

నేదునూరి కనకయ్య

అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం, కరీంనగర్, 9440245771)

తయారుచేసే కమ్మరి, మట్టిపాత్రలు చేసే కుమ్మరి, శిల్పి, పడవలు నిర్మించే వడ్రంగులు లబ్ధి పొందుతారు.

విశ్వ స్థాయి సరఫరాతో ఏకీకృతం

వృత్తి కళాకారుల ఉత్పత్తుల్లో నాణ్యతను పెంచి, ప్రపంచ సరఫరా వ్యవస్థతో వారిని అనుసంధానం చేయడానికి ప్రత్యేక వ్యూహాన్ని రూపొందించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు ట్రాన్స్‌జెండర్స్, బలహీన వర్గాల కార్మికుల ఆర్థిక సాధికారతకు విశ్వకర్మ యోజన సహాయపడుతుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక చేయూతనిస్తారు.

చేతివృత్తులు: ఆర్థిక వ్యవస్థ పరిపుష్టి

గ్రామీణ ఆర్థికవ్యవస్థను పటిష్టం చేయడంలో చేతివృత్తుల వారి పాత్ర విస్మరించలేనిది. గ్రామాలు ఆర్థిక స్వావలంబన సాధించే క్రమంలో ఆ వృత్తుల వారు బహుముఖ పాత్ర పోషించారు. ఇనప వస్తువులు, కొయ్య పరికరాలు, మట్టిపాత్రలు, గృహోపకరణాలు, గ్రామీణ ప్రాంత వాహనాలు మనిషి జీవనయానానికి తోడ్పడేవే. రకరకాల పనిముట్లు తయారుచేసే చిన్నతరహా కుటీర పరిశ్రమలు, వాటి ఆధారంగా ఉండే చేతివృత్తులు గ్రామీణ ఆర్థిక ప్రగతికి పట్టుగొమ్మలు.

కుటీర పరిశ్రమలు: గ్రామీణ స్వరాజ్యం

కుటీర, చిన్న తరహా పరిశ్రమలు, కుటీర గ్రామీణ ఖాదీ పరిశ్రమలు గ్రామీణ స్వరాజ్య పటిష్టతకు దోహదపడతాయని మహాత్మాగాంధీ స్పష్టం చేశారు. చిన్న తరహా పరిశ్రమలు, భారీ పరిశ్రమల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని గాంధీజీ ఆనాడే ఉద్బోధించారు. కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులు స్వయం ఉపాధి అవకాశాలను విస్తృతం చేస్తాయి. ఆర్థికవ్యవస్థ స్వావలంబన సాధనలో బహుముఖ పాత్ర పోషిస్తాయి.

ప్రపంచీకరణ: కులవృత్తులు

ప్రపంచీకరణ, కార్పొరేటీకరణల ప్రభావం వల్ల గ్రామాల్లో చిన్న పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, కులవృత్తులు దెబ్బతిన్నాయి. బతుకు పోరాటంలో భాగంగా ఉపాధి వెతుక్కుంటూ గ్రామాల నుండి పట్టణాలకు నగరాలకు కార్మికుల వలసలు పెరిగాయి. ఎంతో నైపుణ్యం కలిగిన చేతివృత్తి పనివారు నగరాలలో, పట్టణాలలో ప్రైవేటు, అసంఘటిత రంగంలో కార్మికులుగా పనిచేస్తున్నారు. తరతరాల చేతి వృతులను వదిలి ఎక్కువ పనిగంటలు శ్రమించినప్పటికి సక్రమంగా వేతనాలు పొందక శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ఇలాంటి వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడానికి విశ్వకర్మ యోజన పథకం ఉపయోగపడుతుంది.

ఆత్మ విశ్వాసం పెంచే రుణాలు

విశ్వకర్మ యోజన కింద చేతివృత్తి దారులకు రూ.లక్ష నుండి రూ.2 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పించిన సంగతి ముందు ఉదహరించుకున్నాం. అలాగే వారికి రోజుకు రూ. 500 వంతున ఉపకార వేతనం ఇచ్చి మెరుగైన శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందినవారు సొంతంగా చిన్న పరిశ్రమ యూనిట్‌ను ప్రారంభించుకోవచ్చు. ప్రభుత్వం కావలసిన సహాయం అందిస్తుంది. అలా వారిలో పారిశ్రామిక ఉద్యమిత్వ నైపుణ్య సామర్థ్యాలను ప్రోత్సహించి, ఆత్మవిశ్వాసాన్ని నింపుతారు. దీనితో ఉత్పాదక సామర్థ్యం పెరిగి, అది ఆర్థికాభివృద్ధికి దోహదపడి జీవన ప్రమాణాలు పెరుగుతాయి. స్వదేశీ ఉత్పత్తులు పెరిగి ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక స్వావలంబన, స్వయం సమృద్ధి సాధ్యమౌతుంది.

కులవృత్తుల వారి ఆత్మగౌరవం పెంచే పేరుతో సమాజాన్ని కులాల వారీగా వర్గీకరించడం ప్రభుత్వ ఉద్దేశం కాదు. సమాజంలో అందరూ ఇంజనీర్లు, డాక్టర్లు, టీచర్లు కాలేరు. ఎవరికి ఏ రంగంలో ఆసక్తి ఉంటుందో వారిని ఆ రంగంలో వృద్ధి చెందేటట్లు చేయూతనివ్వాలి. నైపుణ్య భారత్, ఆత్మనిర్భర భారత్ పేరున కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నది. ఎంచుకున్న రంగంలో రాణించాలంటే నైపుణ్యం పెంపొందించుకోవాలి. అప్పుడే ఆర్థికవ్యవస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత, ఆదాయ సృష్టి జరిగి అభివృద్ధి జరుగుతుంది.

డిజిటల్ ఇండియా నైపుణ్యం, ఉపాధి

5.25 లక్షల ఐటీ ఉద్యోగుల నైపుణ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను అమలుచేయడం, సూపర్ కంప్యూటర్స్ అందుబాటులోకి తేవడం, డిజిటల్ ఆర్థికవ్యవస్థ విస్తరణ, బలోపేతాలకు డిజిటల్ ఇండియా ప్రాజెక్ట్ ద్వారా వ్యూహాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

వృత్తి నైపుణ్యం పెంపు: ఆర్థిక పునరుజ్జీవనం

స్కిల్ ఇండియా, మిషన్ స్కిల్ ఎంప్లాయిమెంట్ కేంద్రాల ద్వారా కోట్లాది మంది యువతకు నైపుణ్యాలను అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడానికీ, సంప్రదాయ వృత్తులను గౌరవించడానికీ, చేతివృత్తుల వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించి, వారి ఆర్థిక పునరుజ్జీవనానికి ఈ పథకం దోహదపడుతుంది.

పట్టణ కాలుష్య నియంత్రణ

దేశంలోని 169 పట్టణాలలో కాలుష్య నియంత్రణకు ఈ-బస్సు సేవా కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించిన మరుసటి రోజే అమలుచేయాలని కేంద్ర మంత్రిమండలి నిర్ణయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. ★

నమోస్తు సూర్యాయ సహ

విజయవంతమైన ఆదిత్య ఎల్‌-1

తాము భారతీయులమైనందుకు గర్వపడేలా చేసిన చంద్రయాన్ 3 విజయం తర్వాత, పదిరోజులు కూడా తిరక్కుండానే 2 సెప్టెంబర్ 2023న శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి సూర్యుడిని అధ్యయనం చేసేందుకు ఇస్రో తొలి అంతరిక్ష ఆధారిత మిషన్ ఆదిత్య ఎల్-1ను ప్రయోగించడం... ఉపగ్రహాన్ని తీసుకుని పిఎస్ఎల్వి - సి57 విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలో దూసుకుపోవడంతో జాతి గుండె మరొకసారి గర్వంతో ఉప్పొంగింది.

ఉప గ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి లాంచ్ వెహికల్ ప్రవేశపెట్టింది. కాగా, ఆదిత్య ఎల్ -1 ప్రయాణం అంత సులువైనది కాదు. అది నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశించేందుకు నాలుగు నెలలు పడుతుందని శాస్త్రవేత్తల అంచనా. సూర్యుడు - భూమి మధ్య పథంలో, భూమికి 1.5 మిలియన్ కిలోమీటర్ల దూరంలోగల లాగ్‌రేంజ్ పాయింట్ (ఎల్ 1- రెండు గ్రహాల గురుత్వాకర్షణ శక్తులు సమతుల్యంగా ఉండే స్థానం) చుట్టూ గల కాంతివలయ కక్ష్యలో ఈ అంతరిక్ష నౌకను ప్రవేశ పెట్టడం దీని లక్ష్యం. ఈ కేంద్రం లేదా స్థానంలో ఉపగ్రహం ఉండటం వల్ల రెండు గ్రహాలకు సంబంధించి సాపేక్షంగా స్థిరంగా ఉండే అవకాశం ఉంటుంది. మనకు ఎన్నో లక్షల కిలోమీటర్లు అనిపించినా, ప్రస్తుతం ఉద్దేశించిన దూరం, భూమికి-సూర్యుడికి మధ్య ఉన్న దూరంలో 1శాతం మాత్రమే. సూర్యుడు వాయువు కలిగిన భారీ గోళం, ఇటువంటి సూర్యుడి బాహ్య వాతావరణాన్ని ఆదిత్య ఎల్-1 అధ్యయనం చేస్తుంది.

కీలకమైన లాగ్‌రేంజ్ పాయింట్

చంద్రయాన్-3 చంద్రుడిపై దిగినట్టు ఆదిత్య ఎల్-1 సూర్యుడిపై దిగదు, పైగా సూర్యుడి సమీపానికి కూడా వెళ్లదు. అయితే చంద్రయాన్ మిషన్‌లానే సూర్యుడిని సమగ్రంగా అధ్యయనం చేసేందుకు ఉద్దేశించిన ఉపగ్రహం ఆదిత్య-ఎల్1.

ఎల్ 1 కేంద్రం చుట్టూగల కాంతివలయ కక్ష్యలో ఉపగ్రహాన్ని ఉంచడం వల్ల ఎటువంటి గ్రహణాలు/ఆచ్ఛాదనలు లేకుండా నిరంతరం సూర్యుడిని చూడగలగడం అనే ప్రధానమైన లాభం ఉంటుంది. ఇది సౌర కార్యకలాపాలను పరిశీలించడమే కాక, వాస్తవ కాలంలో అంతరిక్ష వాతావరణంపై దాని ప్రభావాన్ని పరిశీలించడాన్ని సాధ్యం చేస్తుంది. అంతేకాకుండా, భూమి అయస్కాంత క్షేత్రం, వాతావరణం ప్రభావితం కాకముందే సౌర రేడియేషన్‌ను, అయస్కాంత తుపాన్లను గ్రహించేందుకు అవకాశం ఉంది.

దీనితోపాటుగా, ఎల్ 1 కేంద్రంవద్ద గురుత్వాకర్షణ శక్తుల స్థిరత కారణంగా తరచుగా కక్ష్య నిర్వహణ అవసరాన్ని తగ్గించడమే కాక ఉపగ్రహ కార్యాచరణ సామర్థ్యాన్ని అనుకూలపరుస్తుంది.

ఏడు పేలోడ్లతో ప్రయాణిస్తున్న ఆదిత్య

ఈ అంతరిక్ష నౌక ఏడు పేలోడ్‌లు తీసుకుని వెడుతున్నది. ఈ 7 పేలోడ్లను దేశీయంగా అభివృద్ధి చేశారు. ఇందులో ఐదు ఇస్రో అభివృద్ధి చేయగా, మరో రెండింటిని ఇస్రో సహకారంతో భారతీయ విద్యా సంస్థలు తయారుచేశాయి. ఇవి, ఎలక్ట్రో మాగ్నెటిక్, పార్టికల్, మాగ్నెటిక్ ఫీల్డ్ డిటెక్టర్స్‌ను (విద్యుదయస్కాంత, రేణువులు, అయస్కాంత క్షేత్ర శోధనా సాధనాలు) ఉపయోగిస్తూ ఫోటోస్ఫియర్ (కాంతిమండలం), క్రోమోస్ఫియర్ (వర్ణ మండలం లేదా సూర్యవాతావరణం)తోపాటుగా సూర్యుడి వెలుపలి పొరలు (కొరోనా -సూర్యుడి చుట్టూ కనిపించే కాంతి వలయం)ను పరిశీలించనున్నాయి. ప్రత్యేక అనుకూల స్థితి కేంద్రం ఎల్-1ను ఉపయోగించుకుని, నాలుగు పేలోడ్లు నేరుగా సూర్యుడిని నిరంతరం వీక్షిస్తుండగా, మూడు పేలోడ్లు సహజ స్థితి లేదా యదార్థ స్థానంలో లాగ్‌రేంజ్ పాయింట్ ఎల్-1 వద్ద రేణువులు, కణాలు, క్షేత్రాలను అధ్యయనం చేయడం ద్వారా ప్రధానమైన అంతర్ గ్రహ మాధ్యమంలో సౌర గతిశీలత విస్తరణ ప్రభావపు శాస్త్రీయ అధ్యయనా లను నిర్వహిస్తాయి.

కాంతివలయం వేడెక్కడం, కాంతివలయం పదార్థ విసర్జన (కొరోనల్ మాస్ ఎజెక్షన్), అగ్ని కీలల ముందస్తు దశ, వాటి కార్యకలాపాలు, లక్షణాలు, అంతరిక్ష వాతావరణ గతిశాస్త్రం, రేణువులు, క్షేత్రాల విస్తరణ తదితర అంశాలను అర్థం చేసుకునేందుకు ఆదిత్య ఎల్-1 పేలోడ్లు కీలక సమాచారాన్ని అందిస్తాయని భావిస్తున్నారు. ఎల్ -1 కేంద్ర కాంతికక్ష్యలో ఉపగ్రహాన్ని ఉంచడం వల్ల ఉండే ప్రధాన లాభం సూర్యుడిని ఎటువంటి ఆచ్ఛాదన లేకుండా నిరంతరం వీక్షించగలగడం.

ఆదిత్య ఎల్ -1 మిషన్ శాస్త్రీయ లక్ష్యాలు

- సౌర ఎగువ వాతావరణ (వర్ణమండలం, కాంతివలయ) గతిశీలతను అధ్యయనం చేయడం.
- వర్ణమండల, కాంతివలయాల తాపమానాలు పెరగడం, పాక్షికంగా అయనీకరణ అయిన జీవద్రవ్యం, కాంతివలయ పదార్థ విసర్జనలు, జ్వాలల ప్రారంభ దశ, భౌతిక శాస్త్ర అధ్యయనం.
- యదార్థస్థితిలో రేణువు, జీవద్రవ్య వాతావరణాన్ని పరిశీలించి, సూర్యుడి నుంచి వచ్చే రేణువుల గతిశీలత అధ్యయనానికి సంబంధించిన డాటాను అందించడం.

స్రరశ్మయే

డి.అరుణ

- సౌర కాంతివలయం, దాని తాపన విధాన భౌతికశాస్త్రం.
- కాంతివలయ, కాంతివలయ వంపులలో జీవద్రవ్యం నిర్ధారణ: ఉష్ణోగ్రత, గతివేగం, సాంద్రత.
- అభివృద్ధి, సిఎంఇల మూలం, గతిశీలత.
- అంతిమంగా సౌర విస్ఫోటన ఘటనలకు దారి తీసేలా బహుళ పొరలలో (వర్ణమండలం, విస్తరించిన కాంతివలయం, దాని మూలా ధారం) సంభవించే ప్రక్రియల క్రమాన్ని గుర్తించడం.
- సౌర కాంతివలయంలో ఐస్కాంత క్షేత్ర స్థితధర్మ శాస్త్రాన్ని, అయస్కాంత క్షేత్ర కొలతలు.
- అంతరిక్ష వాతావరణానికి దారి తీసే సౌర పవనాల మూలం, కూర్పు, గతిశీలత అధ్యయనం.

స్వల్ప బడ్జెట్‌తో ఆదిత్య ఎల్-1

మన ఇస్రోశాస్త్రవేత్తలను మించిన దేశభక్తులు మరొకరు ఉండరనడం అతిశయోక్తి కాదేమో! ఒకవైపు రాజకీయనాయకులు బకాసురులై ప్రజాధనాన్ని మింగివేస్తుంటే, మన దేశ ప్రజలకు మాత్రమే కాక యావత్ ప్రపంచానికీ ఉపయోగపడే ఆవిష్కరణలను అతి తక్కువ ఖర్చుతో ఇస్రో శాస్త్రవేత్తలు చేయడం ఎంతో అభినందనీయం. చంద్రయాన్-3 మిషన్ కోసం రూ. 615 కోట్లను ఖర్చు చేయగా, ఆదిత్య ఎల్1 కోసం రూ. 400 మాత్రమే ఖర్చు చేశారు! ఒక హాలీవుడ్, బాలీవుడ్ సినిమా నిర్మాణానికి అయ్యే ఖర్చు కన్నా తక్కువ ఖర్చుతో తమ మిషన్లను వారు తయారుచేసి, ప్రయోగిస్తున్నారు. విఫలమైన ప్రయోగాల పదార్థాలను కూడా తిరిగి ఉపయోగిస్తామని, తమ వద్ద ఏ లోహం కానీ, పదార్థం కానీ మిగిలి ఉన్నా దానిని వినియోగంలోకి తెస్తామని, ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఒక టీవీ ఇంటర్వ్యూలో చెప్పడం విశేషం.

సుదీర్ఘప్రయాణం

సెప్టెంబర్ 2, 2023న ప్రయోగించిన ఆదిత్య ఎల్-1 భూసంబంధ కక్ష్యలలో 16 రోజులు ప్రయాణిస్తుంది. ఈ సమయంలో ప్రయాణానికి అవసరమైన గమనవేగాన్ని పొందేందుకు అది ఐదు కార్యసాధక వ్యూహాలకు లోనవుతుంది. అనంతరం, ఆదిత్య ఎల్-1 ట్రాన్స్ లాగ్ రేంజియన్ ఇన్సర్షన్ మనూవర్‌కు (ఉపసర్గ లాగ్‌రేంజ్‌లో చొప్పించే వ్యూహానికి) లోనయ్యి, ఎల్-1 లాగ్‌రేంజ పాయింట్ సమీపంలోని గమ్యానికి తన 110 రోజుల పథ ప్రారంభాన్ని సూచిస్తుంది. ఎల్ 1 కేంద్రానికి చేరిన అనంతరం, సూర్యుడికి, భూమికి మధ్య సమతుల్యమైన గురుత్వాకర్షణ కలిగిన స్థానం ఎల్1 చుట్టూ గల కక్ష్యలో ఆదిత్య ఎల్-1ను మరొక యుక్తి చేరుస్తుంది. ఈ ఉపగ్రహం తన మిషన్ జీవితకాలం అంతా భూమి, సూర్యుడిని కలిపే రేఖకు దాదాపు లంబంగా ఉండే సమతుల క్షేత్రంలో గల క్రమరహిత ఆకారంలో ఉన్న కక్ష్యలో ఎల్ 1 చుట్టూ తిరుగుతూ గడుపుతుంది.

కాగా, ప్రయోగించిన అనంతర భూ ఆధారిత మెనూవర్ (ఎర్త్ బౌండ్ మెనూవర్ -ఇబిఎన్1)ని బెంగళూరులోని ఐఎస్‌టిఆర్ఎసి నుంచి ఆదిత్య విజయవంతంగా పూర్తి చేయగలిగింది. అది ప్రస్తుతం సాధించిన కక్ష్య దూరం 245 కిమీ× 22459 కిమీలు అని ఇస్రో వెల్లడించింది. ఉపగ్రహం ఆరోగ్యంగా ఉందని కూడా తెలిపింది. ఇక రెండవ యుక్తి (ఇబిఎన్ 2)ని సెప్టెంబర్ 5, 2023న సుమారు మూడు గంటల ప్రాంతంలో చేపట్టనున్నట్టు కూడా వెల్లడించింది. మొత్తంగా ఐదు యుక్తులు పూర్తి చేసుకుని అది లక్షిత ప్రాంతాన్ని దాదాపు నాలుగు నెలల్లో చేరుకుంటుంది.

మూడేళ్ల ముందే జరగవలసిన ప్రయోగం

అనేక సాంకేతిక కారణాల వల్ల ఆదిత్య ఎల్-1 మిషన్ ప్రయోగాన్ని పలుసార్లు వాయిదా వేశారు. మొదట 2020లో ప్రయోగించాలని నిర్ణయించి, తర్వాత దానిని 2021వరకు నెట్టి, ఆపైన 2022కు వాయిదా వేశారు. కొవిడ్-19 మహమ్మారి కారణంగా, ఈ ప్రయోగాన్ని 2023వరకు వాయిదా వేసి, మొత్తం మీద దానిని విజయవంతంగా ప్రయోగించారు.

యథావిధిగా ఆలయాలలో పూజలు చేసిన శాస్త్రవేత్తలు

మిషన్ చంద్రయాన్ - 3 ముందు, తర్వాత కూడా శాస్త్రవేత్తలు ఆలయాలకు వెళ్లడాన్ని తప్పుపడుతూ కొందరు వ్యక్తులు చేసిన ప్రతికూల వ్యాఖ్యలను ఇస్రో చైర్మన్ సోమ్‌నాథ్ తిప్పికొట్టిన విషయం తెలిసిందే. ఈసారి ఆదిత్య ఎల్ 1 ప్రయోగానికి ముందు కూడా సోమనాథ్ సహా

హిందూధర్మంలో సూర్య ఆరాధన

సనాతన హిందూ ధర్మం జీవనాన్ని పరిరక్షించడంలో సూర్యుడు ఎంత కీలక పాత్ర పోషిస్తాడో తెలుసుకుని, ఈ మొత్తం విశ్వగమనానికి ప్రధాన సూత్రధారి ఆయన అని కీర్తించింది. వేదాల ప్రకాశాన్ని, శక్తిని తనలో కలిగిన దేవుడిగా హిందువులు సూర్యుడిని ఆరాధిస్తారు. సూర్యుడు ఏడు బంగారు గుర్రాలు కలిగిన రథంలో పద్మంపై కూర్చుని ఉంటాడని రిగ్వేదం పేర్కొంటుంది. ప్రత్యూషానికి అధిపతి అయిన అరుణుడు ఆయనకు రథసారథిగా ఉన్నాడని అభివర్ణిస్తుంది. గరుత్మంతుడి సోదరుడైన అరుణుడు అత్యంత బలమైన, విశాలమైన దేహాన్ని కలిగి ఉంటాడని, ప్రపంచాన్ని సూర్యుడి తాపం నుంచి కాపాడేందుకు ఆయన సూర్యుడి ముందు ఉంటాడని కూడా చెప్తుంటారు. సూర్యుడిని ఉదయం రిగ్వేదంతో, మధ్యాహ్నం యజుర్వేదంతో, సాయంత్రం సామవేదంతో ఆరాధిస్తారు. మనుషులు చేసే మంచి, చెడు పనులను గమనిస్తూ సూర్యుడు తన బంగారు రథంలో ఆకాశంలో కాలచక్రంతో ప్రయాణిస్తుంటాడని, ఆయన రథానికి గల ఏడుగుర్రాలు వారంలోని ఏడు రోజులనే వర్ణన కూడా ఉంది. నారద మహర్షి కూడా తన కోరికలను నెరవేర్చుకోవడం కోసం సూర్య భగవానుడి ఆరాధన చేశారని చెప్తారు.

ఇందులో కీలకంగా పాలుపంచు కున్న శాస్త్రవేత్తలంతా ఆలయాలబాట పట్టారు. తాము ప్రయోగించనున్న రాకెట్ మూలరూపానికి పూజలు చేయించి, తాము ఆశీస్సులు పొంది వచ్చారు. సెక్యులర్ ఇండియాలో ఇవన్నీ సరికాదు అని భావించే ఉదారవాద, ప్రధానస్రవంతి ఆంగ్ల మీడియా మింగలేక కక్కలేక అన్నట్టు ఈ దృశ్యాలను చూపడమే కాదు, పండితులు చదివే మంత్రాలను ఒకే ఒక్కక్షణం విధిలేక వినిపించింది. ప్రతి ప్రయోగానికీ ముందు షార్ సమీపంలోగల చెంగాళమ్మ ఆలయంలో పూజలు నిర్వహించడం శాస్త్రవేత్తలకు ఆనవాయితీగా వస్తున్న విషయం.

అంచనాలను మించుతున్న చంద్రయాన్-3

ఇదిలా ఉండగా, మనందరి కళ్ల ముందూ చంద్రుడి దక్షిణ ధ్రువంపై మృదువుగా దిగి ఇస్రో సంస్థను ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలబెట్టిన చంద్రయాన్ మిషన్-3 తన కోసం కష్టపడ్డ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లను, గర్వపడుతున్న భారతీయులను నిరాశపరచకుండా తనకు ఉద్దేశించిన లక్ష్యాలన్నింటినీ చకచకా నెరవేరుస్తోంది. అంతటి నిశ్శబ్దంలో తన తపస్సును కొనసాగిస్తోంది. వారం కిందట చంద్రుడిపై దిగిన చంద్రయాన్ ఇప్పుడు అక్కడ మధ్యాహ్న కాలంలో ఉంది. వచ్చేవారమంతా రాత్రి అనుభవంలోకి వస్తుంది. వాస్తవానికి చంద్రుడికి ఉత్తరాన ఉన్న ధ్రువం, అంటే మనకు కనిపించే భాగం అంతా గోలగోలగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎందుకంటే, మనం ఇక్కడ నుంచి ఉపయోగించే రేడియో తరంగాలు, ఎలక్ట్రోమాగ్నెటిక్ తరంగాలు వంటివన్నీ కూడా అక్కడ కాకిగోల చేస్తుంటాయి. అందుకు భిన్నంగా దక్షిణ ధ్రువం ఈ విశ్వ రహస్యాలు లేదా సంభాషణలు వినగలిగేందుకు వీలుగా అత్యంత నిశ్శబ్దంగా ఉంటుంది. అందుకే, దీనిని అంతరిక్షంలోకి మరింత లోతుగా దూసుకు పోయేందుకు సింహద్వారంగా అభివర్ణిస్తున్నారు.

కాగా, విజయవంతంగా అక్కడికి దిగి ప్రయోగాలు చేస్తున్న విక్రంను, ప్రగ్యాన్‌ను అక్కడి ఉష్ణోగ్రతలకు అలవాటు పడి, తిరిగి పని చేసేందుకు వీలుగా ఇప్పటి నుంచే నిద్రపుచ్చుతున్నామంటూ ఇస్రో ప్రకటించింది. తాము కొత్తగా చేసిన ప్రయోగ స్థానం నుంచి సమాచారం అందడంతో, పేలోడ్లను స్విచ్ ఆఫ్ చేశామని, ల్యాండర్ రిసీవర్‌లను ఆన్‌లో ఉంచామని ఒక ట్వీట్‌లో ఇస్రో వెల్లడించింది. విక్రంలో సౌర విద్యుత్ మొత్తం తరగిపోయిన తర్వాత అది ప్రగ్యాన్ పక్కన నిద్రకు ఉపక్రమిస్తుందని తెలిపింది. రెండు పరికరాలు సెప్టెంబర్ 22, 2023 నాటికి నిద్రలేపాలని ఆశిస్తున్నట్టు కూడా సంస్థ పేర్కొంది.

మరొకసారి విజయవంతంగా విక్రం ల్యాండింగ్

విక్రం ల్యాండర్ తన మిషన్ లక్ష్యాలను అధిగమించి సాధించిందని సెప్టెంబర్ 4, 2023న ఇస్రో ప్రకటించింది. అది హాప్ (కప్పగంతు) ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిందని కూడా సంస్థ పేర్కొంది. ఇక్కడ నుంచి కమాండ్ ఇవ్వగానే అది ఇంజిన్లను ప్రారంభించి, తనకు తానుగా 40 సెంటిమీటర్ల ఎత్తు ఎగిరి, ఉన్న చోటు నుంచి 30-40 సెంటీమీటర్ల దూరంలో సురక్షితంగా దిగిందని ఇస్రో ట్వీట్ చేసింది. దీని ప్రాముఖ్యతను వివరిస్తూ, ఈ తొలి అడుగు భవిష్యత్తులో పంపిన శాంపుల్, మానవ మిషన్‌లు తిరిగి వచ్చే అవకాశాల గురించి ఉత్సాహాన్ని ఇస్తోందని వివరించింది. అన్ని వ్యవస్థలూ సాధారణంగా పని చేస్తున్నాయని, ఆరోగ్యంగా ఉన్నాయని కూడా తెలిపింది. ర్యాంప్, ఛేస్ట్ (సిహెచ్ఎఎస్‌టిఇ), ఐఎల్ఎస్ఎను ముందుగా వెనక్కి మడిచి, ఈ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత తిరిగి మోహరించినట్టు ఇస్రో తెలిపింది.

ఆగస్టు 23న చంద్రుడిపై దిగిన విక్రమ్ ల్యాండర్, ప్రగ్యాన్ రోవర్ అనుకున్న సమయానికన్నా ముందుగానే తమ కార్యకలాపాలను మొదలు పెట్టాయి. విక్రమ చంద్రుడి దక్షిణ ధృవంపై జాగ్రత్తగా దిగడం, ప్రగ్యాన్ అందులో నుంచి బయటకు వచ్చి తన బుడిబుడి నడకలు వేయడం జరిగిపోవడాన్ని కూడా మనం చూశాం. కాగా, ఆగస్టు 24వ తేదీన అక్కడి వాతావరణ పరిస్థితుల గురించి ఇస్రోకు సమాచారం వచ్చేసింది.

ఛేస్ట్ (ChaSTE Chandra's Surface Thermophysical Experiment) అంటే చంద్రుడి ఉపరితలంపై తాపగతి భౌతిక ప్రయోగం అన్నది అక్కడి ఉపరితలంపై ఉష్ణోగ్రతల ప్రవర్తనను అర్థం చేసుకునేందుకు, ధ్రువం చుట్టుపక్కల గల చంద్రుడి ఉపరితల మట్టి ఉష్ణోగ్రతల ప్రొఫైల్‌ను కొలిచేందుకు ఉద్దేశించింది. ఇది ఉపరి తలం కింద 10 సెంటీమీటర్ల లోతుకు చేరుకోగలిగిన సామర్థ్యం గల నియంత్రిత వ్యాప్తి కోసం ఉష్ణోగ్రత పరిశోధక యంత్రాంగాన్ని కలిగి ఉంది.

ఈ పరిశోధక యంత్రానికి 10 వ్యక్తిగత/ వివిధ ఉష్ణోగ్రత సెన్సార్లను బిగించారు. దీనిద్వారా ఆగస్టు 24వ తేదీన చంద్రుడి ఉపరితలంపై, ఆ ప్రాంతంలో వివిధ లోతుల్లో గల ఉష్ణోగ్రతలను తన వ్యాప్తి సమయంలో నమోదు చేసింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఇటువంటి ఉష్ణోగ్రతలను 'మొట్టమొదటి సారి' నమోదు చేసి, ప్రొఫైల్ చేసింది మన సంస్థే కావడం విశేషం. ఆగస్టు 27వ తేదీన తిరిగి విక్రం ల్యాండర్ మరింత సమాచారాన్ని పంపడంతో ఇస్రోశాస్త్రవేత్తలు దాని విశ్లేషణలో నిమగ్నమవుతున్నారు. అహ్మదాబాద్‌కు చెందిన పిఆర్ఎల్ సహకారంతో స్పేస్ ఫిజిక్స్ లాబొరేటరీ (ఎస్‌పిఎల్), వివిఎస్ఎస్‌కి చెందిన బృందం ఈ పేలోడ్‌ను తయారు చేసింది.

ఇస్రో శాస్త్రవేత్తలపై ప్రశంసల వర్షం

"భారత తొలి సౌర మిషన్ అయిన ఆదిత్య ఎల్-1 ప్రయోగం భారతదేశ స్వదేశీ అంతరిక్ష కార్యక్రమాన్ని నూతన పథంలోకి తీసుకువెళ్లే మైలురాయి విజయం. ఇది అంతరిక్షాన్ని, ఖగోళ దృగ్విషయాన్ని అర్థం చేసుకునేందుకు మనకు ఎంతో తోడ్పడుతుంది. ఈ అసాధారణ ఫీట్‌ను చేపట్టి ఇస్రో శాస్త్రవేత్తలను, ఇంజినీర్లకు నా అభినందనలు. ఈ మిషన్ విజయవంతం కావడానికి నా శుభాకాంక్షలు"

- భారతరాష్ట్రపతి ద్రౌపది ముర్ము

"చంద్రయాన్-3 విజయం తర్వాత భారత్ తన అంతరిక్ష యాత్రను కొనసాగిస్తోంది. భారతదేశపు తొలి సోలార్ మిషన్, ఆదిత్య ఎల్-1ను విజయవంతంగా ప్రయోగించినందుకు ఇస్రోలోని శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు శుభాకాంక్షలు. సమస్త మానవాళి సంక్షేమం కోసం ఈ విశ్వం గురించి సరైన అవగాహనను అభివృద్ధి చేసుకోవడం కోసం మా శాస్త్రీయ కృషి ఆవిశ్రాంతంగా సాగుతుంది,"

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

"మిషన్ ఆదిత్య ప్రయోగం సందర్భంగా అందరికీ నా శుభాకాంక్షలు"

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

"చంద్రుడితో పాటు ఇప్పుడు సూర్యుడు కూడా స్వావలంబన కలిగిన భారతదేశపు శక్తిని వీక్షిస్తాడు. ఇస్రో సహా మొత్తం టీమ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు"

- యోగి ఆదిత్యనాథ్, యుపి ముఖ్యమంత్రి

చంద్రయాన్ 3 రోవర్ పై గల లేజర్ ఇండ్యూస్డ్ బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోపీ (ఎల్ఐబిఎస్ – లేజర్ ప్రేరిత వర్ణపటమాపన విడదీత) దక్షిణ ధ్రువంపై మౌలిక మూలకాల కూర్పు కొలతలను సహజ స్థితిలో ఏమిటన్నది తెలుసుకొనేందుకు పంపింది. ఇలాంటి ప్రయోగం జరగడం కూడా మొట్టమొదటిసారే. ఆ సహజస్థితి కొలతలు ఆ ప్రాంతంలో సల్ఫర్ ఉనికిని కచ్చితంగా నిర్ధారిస్తున్నాయి. సాధారణంగా, ఇది ఆర్బిటర్లపై ఉండే పరికరాల ద్వారా సాధ్యమయ్యేది కాదు. లిబ్స్ అనేది తీవ్రమైన లేజర్ స్పందనలకు పదార్థాలను బహిర్గతం చేయడం ద్వారా ఆ పదార్థాల కూర్పును విశ్లేషించే శాస్త్రీయ సాంకేతికత. ఏదైనా రాయి లేదా మట్టి పై అత్యధిక శక్తితో కూడిన లేజర్ స్పందనను కేంద్రీకరించినప్పుడు, ఆ లేజర్ స్పందన అత్యంత వేడిమితో కూడిన, స్థానికీకరించిన జీవద్రవ్యాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఇలా సేకరించిన జీవద్రవ్య వెలుగును వర్ణపటంగా నిశ్చియించి, ఛార్జ్‌తో కూడిన పరికరాల వంటి డిటెక్టర్ల ద్వారా కనుగొంటారు. ప్రతి పదార్థం జీవద్రవ్య స్థితిలో ఉన్న సమయంలో తమవైన వెలుగు తరంగ దైర్ఘ్యాన్ని ప్రసరిస్తున్న ప్పుడు ఆ పదార్థంలోని మౌలిక కూర్పును నిర్ధారిస్తారు.

ప్రాథమిక విశ్లేషణలు చంద్రుడి ఉపరితలం పై అల్యూమినియం (ఎఎల్), సల్ఫర్ (ఎస్), కాల్షియం (సిఎ), ఇనుము (ఎఫ్ఇ), క్రోమియం (సిఆర్), టైటానియం (టిఐ)ల ఉనికిని లిబ్స్ ఆవిష్కరించినట్టు వెల్లడించాయి. అంతేకాకుండా, మాంగనీసు (ఎంఎన్), సిలికాన్ (ఎస్ఐ), ఆక్సిజన్ (ఒ) ఉనికి ఉన్నట్టు తెలుస్తోంది. హైడ్రోజన్ ఉనికి కోసం సమగ్ర విచారణ జరుగుతోంది.

లిబ్స్ పేలోడ్‌ను బెంగళూరులోని ఎలక్ట్రో ఆప్టిక్స్ సిస్టంస్ (ఎల్ఇఒఎస్)/ ఇస్రో ప్రయోగశాలలో తయారు చేశారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై మట్టి, రాళ్లు దేనితో తయారయ్యాయి, ఇది ఇతర ఎత్తైన ప్రాంతాల నుంచి ఎలా భిన్నం అనే ప్రశ్నలకు సమాధానాలను తన శాస్త్రీయ పరికరాల సాయంతో చంద్రయాన్–3 కనుగొనే ప్రయత్నం చేస్తోంది. రోవర్‌పై అమర్చిన ఆల్ఫా పార్టికల్ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్ (ఎపిఎక్స్ఎస్) అన్నది స్వల్పవాతా వరణం కలిగిన చంద్రుడి వంటి గ్రహాల ఉపరిత లంపై మట్టి, రాళ్ల మౌలిక కూర్పును సహజస్థితిలో విశ్లేషించేందుకు ఉత్తమమైన పరికరం. ఉపరి తలంపై గల శాంపిల్‌పై ఆల్ఫాకణాలను విడుదల చేసే రేడియో యాక్టివ్ మూలాన్ని, ఎక్స్‌రే లను ఇది కలిగి ఉంటుంది.

కాగా సల్ఫర్ సహా అల్యూమినియం, సిలికాన్, కాల్షియం, ఇనుముకి సంబంధించిన స్వల్ప మూలకాల వంటి ఆసక్తిగల పదార్థాల ఉనికిని ఆవిష్క రించింది. లిబ్స్ పరికరం కూడా ఈ పదార్థాల



ఉనికిని నిర్ధారించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన విశ్లేషణలు కొనసాగుతున్నాయి.

ఎపిఎక్స్ఎస్‌ను అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఎసి) తోడ్పాటుతో ఫిజికల్ రీసెర్చ్ లేబొరేటరీ (పిఆర్ఎల్) అభివృద్ధి చేయగా, బెంగళూరులోని యుఆర్ రావ్ శాటిలైట్ సెంటర్ (యుఆర్ఎస్సి) ఆ పరికరాన్ని నిర్మించింది.

చంద్రయాన్–3 ల్యాండర్ విక్రమ్‌పై కలిగిన రేడియో అనాటమీ ఆఫ్ మూన్ బౌండ్ హైపర్ సెన్సిటివ్ అయనోస్ఫియర్ అండ్ అట్మాస్ఫియర్ – లాంగ్‌మ్యూర్ ప్రోబ్ (ఆర్ఎఎంబిహెచ్ఎ–ఎల్పి) పేలోడ్ దక్షిణ ధ్రువ ప్రాంతంలోని ఉపరితలంపై చంద్రుడి జీవద్రవ్య వాతావరణాన్ని తొలిసారి సహజస్థితి కొలతలను తీసుకుంది.

జీవద్రవ్యంను వర్గీకరించేందుకు ఉపయోగించే లాంగ్‌మ్యూర్ శోధక పరికరం అన్నది నిశ్చలంగా ఉన్న చంద్రుడి జీవద్రవ్య వాతావరణంలో పని చేస్తూ ఉండేలా దీనిని తయారు చేశారు. ఇది ల్యాండర్ నుంచి విడివడి పని చేస్తుంది. ఈ పరికరం 1 మిల్లి సెకెండ్‌లో డ్వెల్ టైమ్‌తో, స్వల్పమైన పికో–ఆంపి యర్లల మినిట్ రిటర్న్ కరెంట్లను కూడా కనుగొన గలదు. ఈ పరికరం అయాన్, ఎలక్ట్రాన్ సాంద్రత లను, రిటర్న్ కరెంట్ కొలత ఆధారంగా వాటి శక్తిని కూడా నిర్ధారించగలదు.. ఇప్పటివరకూ, చంద్రుడిపై ఉదయపు సమయంలో చంద్రుడి ఉపరితలం చుట్టూ ఉండే జీవద్రవ్యం స్వల్పమని తొలి అంచనాలు చెప్తున్నాయి. ఈ పరిశోధన నిరంతరాయంగా సాగు తుంది. చంద్రుడి ఉపరితల ప్రాంతానికి సమీపంలో సౌర అంతరిక్ష వాతావరణ పరిస్థితుల్లో ఉండే హెచ్చుతగ్గుల కారణంగా జరిగే చార్జింగ్ ప్రక్రియను అవగతం చేసుకోవడానికి ఇది ఎంతో ముఖ్యం.

ఈ పరికరాన్ని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (విఎస్ఎస్సి), స్పేస్ ఫిజిక్స్ లేబొరేటరీ (ఎస్పిఎల్) అభివృద్ధి చేశాయి.

లూనార్ సీస్మిక్ యాక్టివిటీ (ఐఎల్ఎస్ఎ–చంద్రుడిపై కంపనల కార్యకలాపాల)కోసం ఉద్దే శించిన మైక్రో ఎలక్ట్రో మెకానికల్ సిస్టం (ఎంఇ ఎంఎస్) చంద్రుడిపై రోవర్, ఇతర పేలోడ్ల కదలికల వల్ల సంభవిస్తున్న ప్రకంపనలను నమోదు చేసింది. సహజంగా సంభవించే కంపనలు, ప్రభావాలు, కృత్రిమ ఘటనల కారణంగా అక్కడి ఉపరితల ప్రకంపనలను కొలవడం ఐఎల్ఎస్ఎ ప్రాథమిక లక్ష్యం. ఆగస్టు 25వ తేదీన రోవర్ ప్రయాణపు ప్రకంపనలను నమోదు చేయడమే కాదు, సహజమని భావిస్తున్న ఒక ఘటనను 26వ తేదీన నమోదు చేసింది. ఈ ఘటనకు మూలాన్ని శోధిస్తున్నారు.

ఈ పరికరాన్ని ప్రైవేటు పరిశ్రమల సహకారంతో బెంగళూరులోని ఎల్ఇఒఎస్ రూపకల్పన చేసి, సాకారం చేసింది. దీనిని చంద్రునిపై ఉంచేందుకు ఉద్దేశించిన యంత్రాంగాన్ని బెంగళూరులోని యుఆర్ఎస్సి అభివృద్ధి చేసింది. మనకన్నా ముందునుంచి ధనిక, అభివృద్ధి చెందిన దేశాలు చంద్రుడు, సూర్యుడిపై ఇటువంటి ప్రయోగాలు చేస్తూ వస్తున్నాయి. అమెరికాకు చెందిన నాసా పార్కర్ సోలార్ ప్రోబ్‌ను సూర్యుడికి చాలా సమీపానికి పంపింది. అంటే, అది ఎల్–1, 2,3 పాయింట్లను కూడా దాటి సూర్యుడి కాంతివలయం సమీపానికి వెళ్లింది. కానీ, మన దేశ ప్రయోగాలకు వారికీ ఉన్న తేడా కేవలం బడ్జెట్‌లోనే కాదు, మానవాళి సంక్షేమం కోసం చేసే యత్నాలలో కనిపిస్తుంది. భారతీయులు మన శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయోగాలకు గర్విస్తున్నా, ఇవన్నీ సమస్త మానవాళి సంక్షేమం కోసమే. ★

కథ

స్నేహం

యర్రమిల్లి ప్రభాకరరావు

ఉదయం ఎనిమిది గంటలు దాటింది. ఇంకా సూర్యుడు పైకి రాలేదు. ఆకాశం మబ్బుమబ్బుగానే వుంది. ఆపైన చిన్న చిన్న చినుకులు. సాధారణంగా అటువంటి వాతావరణం సంధ్యకు నచ్చుతుంది. కాని, ఈ రోజు మనసంతా చీకాకు, ఆందోళన. తల్లి ఇచ్చిన కాఫీ గ్లాసు చేతిలోనే ఉంది. కానీ కాఫీ తాగలేకపోతోంది. ఇంతలో మెట్లమీద ఎవరో వస్తున్న సవ్వడి, తలఎత్తి చూసింది.

"ఆ... ముత్యం..ఇల్లా వస్తున్నావేంటి? దారి తప్పావా ఏంటి? ఈపాటికి పొలంలోకి వెళ్లిపోవాలి గదా...." అంటోంది చిరునవ్వుతో సంధ్య.

ముత్యం అడుగు మీదకు వచ్చింది. సంధ్య పక్కనే ఉన్న ముక్కాలు పీట మీద కూర్చుంది.

"ముత్యం నువ్వు కూడా కాస్త కాఫీ తీసుకో.." కామాక్షమ్మ ముత్యాలుకి కాఫీ గ్లాసు ఇచ్చింది. ముత్యం మౌనంగా గ్లాసు తీసుకుంది.

"ఇప్పుడు చెప్పు ఏమిటి విశేషంగా ఇల్లా వచ్చావు?" సంధ్య అడిగింది.

ముత్యాలు ఏమి మాట్లాడలేదు. ఆమె కన్నులలో నీళ్లు ఉరుముతున్నాయి. మొహం ఎర్రగా మారి పోయింది.

"ఏంటే? ఆ ఏడుపు... ఆపు... అసలేం జరి గింది?" సంధ్య ఆందోళనతో అడిగింది.

ముత్యాలు చీరచెరగుతో కన్నులు, మొహం తుడుచుకుంది. "సంధ్యా! నీకు తెలుసుగా నా డబ్బు, ఇబ్బందులు. రెండు సంవత్సరాలుగా వర్షాలతో పంటలు పోయాయి. అందుకోసం – సాగుకోసం అప్పు చేసాడు రాజయ్య. నేను ఇక్కడ సాగు చూసు కుంటున్నా, రాజయ్య పట్నంలో పనిచేస్తున్నాడు. కాని అప్పు తీరేంత డబ్బు రావాలంటే పంట చేతికి రావాలిగా – అంతవరకూ నెల వాయిదా వడ్డీలు కట్టాలండి... నాలుగు వాయిదాలు అతికష్టంమీద కట్టాడు రాజయ్య, తన కూలి డబ్బు నుంచి. కాని రెండు వాయిదాలు బాకీపడ్డాడు. అప్పులిచ్చిన వాళ్లు వాడి ప్రాణం తీస్తున్నారు. వాడి ప్రాణమే కాదు, నా ప్రాణం కూడా. నిమిష నిమిషానికి ఫోన్లు. తిట్లూ, బూతులు... బెదిరింపులు... రాజయ్య భయంతో వణికిపోతున్నాడు. నిన్న పట్నం నుంచి వచ్చి ఒకటే బెంగపడ్డాడు. నన్ను జాగ్రత్తగా ఉండమని చెప్పి సాయం కాలమే వెళ్ళిపోయాడు. నేనేం చెయ్యగలను ఇప్పుడు? పంటచేతికి అందాలి కదా! అప్పుడే. మళ్లీ ఉదయం ఆరుగంటలకే ఫోను. డబ్బు కట్టమని... నాకు కాళ్లు చేతులు ఆడటం లేదు. నువ్వేదైనా సలహా చెబుతావేమోనని వచ్చాను" ముత్యాలు ఆందోళనతో చెప్పింది. ఆమె మదిలో ఆందోళన, భయం.

సంధ్య నిశ్చేష్టురాలైపోయింది.

"ముత్యాలు అప్పు ఏ బాంక్‌లో తీసుకున్నావు?"

"లేదు సంధ్యా! బాంకులో కాదు. ఎవరో యాప్ వాడంట. వాడిదగ్గర ఒక లక్ష తీసుకున్నాడు రాజయ్య. బయటున్న అప్పులు తీర్చేసాడు, మిగిలింది పంట మీద పెట్టాం. ధాన్యం చేతికి రాగానే తీర్చేయచ్చు అనుకున్నాం. పంట రావడానికి ఇంకా నాలుగు మాసాలు పడుతుంది కదా! ఈలోగా వడ్డీ డబ్బులు కట్టమని – ఇదిగో ఈ రకంగా ప్రాణాలు తీస్తున్నారు. నాకు రాజయ్యను చూస్తే భయమేస్తోంది. మనిషి మనిషిలా లేడు. చాలా చిక్కిపోయాడు. ఏమైనా చేసుకుంటాడేమోనని నాకు.." ముత్యాలు మారు మాటలాడలేకపోయింది. చెంగు కప్పుకుంది, మొహం మీద.

సంధ్య అవాక్కైపోయింది. "ఏంటి? యాప్ వాళ్లు ఈ చిన్న రైతుల మీద కూడా పడ్డారా! ఏదో పట్నంలో వ్యాపారం చేసుకునే వారిని పీడిస్తున్నట్టుగా వార్తలొస్తున్నాయి. ఎంటి? ఇప్పుడు గ్రామాల్లోకి కూడా వచ్చేసారా!" పైకి గట్టిగానే అంది.

"అవును సంధ్యా! నేనే కాదు... మన ఊళ్లోనే ఇంకా నలుగురైదుగురు నాలాంటి వాళ్లు వాళ్ల చేతిలో చిక్కుకున్నారు. ఏం చెయ్యాలో ఎవరికీ తెలియడం లేదు. మేమా! చదువు సంధ్యా లేనివాళ్లం. వాళ్లు బాగా బలం, డబ్బు వున్నవాళ్లు... ఎక్కువ వడ్డీ పిండు తున్నారు మా దగ్గర నుండి. అంతేకాదు, తిట్లూ, బెదిరింపులు...ఏదో 'మార్ఫింగ్' చేస్తారని, మా ఫోటోలు బయట పెడతామని, వీడియో తీస్తామని ఒకటే బెదిరింపులు... మా పరువు తీస్తారంట... ఫోను మీద ఫోనులు, రాత్రీ లేదు పగలూ లేదు" ముత్యాలు కొద్ది ధైర్యం తెచ్చుకుని గబగబా చెప్పింది, ఆవేశంతో.

* * *

సంధ్య,ముత్యాలు చిన్నప్పటి నుంచి స్నేహితులు. ముత్యాలు తండ్రి చిన్నరైతు. చాలీచాలని ఆదాయం. అంచేత ముత్యాలు చదువు తరగతిలోనే ఆగి పోయింది. సంధ్యపై చదువులు చదివింది. బి.టెక్ చదువుకుని కంప్యూటర్ ఇంజనీరుగా పక్కనున్న పట్నంలో కాలేజీలో పనిచేస్తోంది. ఇంకా వివాహం చేసుకోలేదు. ముత్యాలుకి వివాహం జరిగి మూడేళ్లు దాటింది. చదువు డబ్బు– ఈ రెంటిలో అంతరాలు ఉన్నా, వాళ్లిద్దరి చిన్ననాటి స్నేహం చెక్కు చెదరలేదు. కలుసుకోవడం తగ్గిపోయినా అది మూడు పువ్వులు, ఆరు కాయలుగా పెరుగుతూనే ఉంది.

* * *

ముత్యాలు చేతిని తన చేతిలోకి తీసుకుంది సంధ్య.

"ముత్యం! నువ్వు ప్రమాదంలో ఉన్నావు, నాకు అర్థమైంది. నేను ఏదో ఒకటి చేసైనా నిన్ను కాపాడుకుంటా. కాని నా దగ్గర అంత డబ్బు లేదే! ఒకటి రెండు నెలలు ఏదో విధంగా డబ్బు సద్దుబాటు చేసుకుని ఈ ఊబిలోంచి బయట పడదాం. అంతవరకు కొద్ది ఓపికగా" సంధ్య ఆపైన మాట్లాడ లేకపోయింది. ముత్యాలుని గట్టిగా కౌగిలించుకొంది.

"సరే సంధ్యా! నువ్వేమీ బాధపడకు. నా ఖర్మ ఎల్లా వుంటే అల్లా జరుగుతుంది" నేను వెళ్తాను, పొలానికి వెళ్లాలి. ఇవాళ పొలంలో ఎరువెయ్యాలి" అంటూ లేచింది ముత్యాలు.

సంధ్య ముత్యాలు వెళ్లిపోతుంటే చూస్తూ అల్లాగే ఉండిపోయింది. తాను ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితికి తనను తానే తిట్టుకుంటూ..

కామేశ్వరమ్మ వాళ్ల మాటలు వింటూనే వుంది.

"ఏదో ఒకటి చెయ్యాలి సంధ్యా! ముత్యాన్ని అల్లా వదిలిస్తామా ఏంటి?" అని ఏదో చెబుతూనే వుంది.

* * *

రెండు రోజులు గడిచాయి అతి భారంగా సంధ్యకు. ఆ సాయంకాలం పని ముగించుకుని ఇంటికి వచ్చింది. ఇంట్లో అడుగుపెట్టిందో లేదో... సంధ్యా! పరుగెత్తుకొని వచ్చిన ముత్యాలుని చూసి గబాలున గట్టుమీద నుంచి కింద కురికింది.

"సంధ్యా! వాడు నా ఫోటోలు అదేటో చేసి వీడియోలో పెట్టాడట – అది చూసిన మా ఆయనకు తెలిసివారు వేళాకోళం చేసి ఏదేదో అన్నారట – రాజయ్య సహించలేకపోయాడట– తాను కూలీగా పనిచేస్తున్న ఇంటిపై నుండి దుమికాడు ఆత్మహత్య చేసుకుందామని...." ముత్యాలు ఏడుస్తోంది.

"రాజయ్యకేం ప్రమాదం లేదు కదా!" ఆత్రుతగా అడిగింది కామాక్షమ్మ.

"ఫరవాలేదమ్మా! ఏదో బతికాడు కాని కుడికాలు విరిగిపోయిందట.... ఇక అతుక్కోదట..." ఏడుస్తూ చెప్పింది ముత్యాలు. ఇక సంధ్య ఆగలేకపోయింది."

"ముత్యాలు.. బండెక్కుముందు– వాళ్ల పని చెబు

తాను" అని ఆవేశంగా స్కూటర్‌ను ముందుకు నడిపింది.

* * *

రాత్రి ఎనిమిదిగంటలైంది. సంధ్య, ముత్యాలు – ఇద్దరూ పోలీస్‌స్టేషన్‌లో ఎస్.ఐ.ముందర కూర్చున్నారు. ముత్యాలు ఎస్.ఐ. గారితో తాము అప్పు తీసుకున్న వివరాలు అన్నీ చెప్పింది. ఏదీ హామీ లేకుండా అప్పు ఇచ్చారని తీసుకున్నామని– రౌడీ కంపెనీ చేతుల్లో ఇరుక్కుపోయామని, లక్ష రూపాయల అప్పుకు వడ్డీయే నాలుగు నెలల్లో నలభై వేలు కట్టామని చెప్పింది ఏడుస్తూ.

పోలీసు అధికారి అంతా ఒక కాగితంపై రాసుకున్నాడు. "వాళ్ల పేర్లు, అడ్రస్‌లు ఏమైనా చెప్పగలరా!" అడిగాడు ఎస్.ఐ.

"మీరు జాగ్రత్తగా ఉండాలమ్మా!" అని నెమ్మదిగా పలికాడు.

లేదు సార్! నాకేమీ వివరాలు తెలియవు కాని వాళ్లు నాకు రోజూ ఎన్నోసార్లు ఫోన్‌చేసి.... "ముత్యాలు ఆపైన మాటలాడలేకపోయింది.. తన ఫోన్ చూపిస్తూ,

ఎస్.ఐ. ఆలోచనలో పడ్డాడు.

ఇంతలో ముత్యాలు ఫోన్ మోగింది. ముత్యాలు ఫోన్ తీసి "హలో" అనేంతలోనే "ఏం పిల్లా! మీ ఆయన కాలు విరిగిందని ఏడుస్తున్నావా? పరవా లేదులే..." ఏదేదో మాటలు వినిపిస్తున్నాయి. ముత్యాలు వణికిపోతోంది భయంతో.

ఇంతలో సంధ్య ముత్యాలు చేతిలోంచి ఫోన్ తీసుకుని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చేతికి ఇచ్చింది.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఫోన్‌లోంచి మాటలు రికార్డు చేసాడు. "ఏమీ మాట్లాడవు?" అని ఫోన్‌లో ఇంకా మాటలేవో వస్తూనే వున్నాయి.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీట్లోంచి గబాలున లేచాడు. అతనికి వయసు నలభై పైన ఉంటాయి. కోపంతో చేతిలోని లాఠీ బలంగా బల్లమీద కొట్టాడు. "అమ్మా యిలూ – ఇంక మీరేమీ బాధపడకండి– ప్రభుత్వం, చట్టం తమ పని తాము చేసుకుంటూ పోతాయి. అనధికార యాప్‌లకు, దౌర్జన్యపూరితమైన యాప్‌లకు– వాటి ఏజెంట్లకు తగిన బుద్ధి చెబుతాము. వాళ్లని ఇప్పుడే, ఎక్కడున్నా పట్టు కుంటాము."

"సంధ్యా! మీరు చిన్నవారైనా చాలా ధైర్యంగా మా దగ్గరకూ, ఏం జరిగినా ఫరవాలేదని వచ్చారు. మీరు తీసుకున్న ఈ చొరవ వలన మన ప్రాంతంలో కొద్దిమందినైనా రుణయాప్ దుర్మార్గుల నుండి ఊరట కలుగుతుంది. మీ ధైర్యానికి నా సెల్యూట్" అన్నాడు! ఇక వాళ్లెవరూ జోలికి రారు, భయపడతారు. అంతేకాదు – అమాయకులైన చిన్న వ్యాపారులకు, చిన్న రైతులకు ఊరట సరేనా!" అంటూ పోలీస్ జీప్ ఎక్కాడు.

* * *

సంధ్య, ముత్యాలు ఇల్లు చేరారు. ఇద్దరికీ బల్లమీద భోజనం వడ్డిస్తూ "స్నేహం అంటే ఇదే!" అని పలికింది కామేశ్వరమ్మ, చేమర్చిన కన్నులు తుడుచుకుంటూ. ★

ఆధునిక సమాజంలో అన్ని రకాల మానవ సంబంధాలు 'మనీ'తోనే ముడిపడి ఉన్నాయి.

మానవుడు ఎప్పుడూ ఎక్కువగా కోరుకొనే వస్తువు 'ద్రవ్యం'. రోజువారీ ఖర్చుల కోసం, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు, ఆర్థిక భద్రత కోసం మనకు కావలసిన ముఖ్య వస్తువు ధనమే!

'ద్రవ్యం'ను నేరుగా ఎవ్వరూ వినియోగించుకోలేరు. ద్రవ్యానికి ప్రత్యక్ష ఉపయోగం లేదు. దానికి వినిమయ మాధ్యమంగా మాత్రమే ప్రయోజనం ఉన్నది. వస్తుసేవలు కొనుగోలు చేయడానికీ, వస్తూత్పత్తి ప్రక్రియకు అవసరమైన ఉత్పాదక వస్తువుల కొనుగోలుకీ మనం ద్రవ్యాన్ని ఉపయోగిస్తాం.

ఓ జీవిత సత్యం ఏమిటంటే!

ఏ వ్యక్తీ కేవలం ద్రవ్యం కోసమే ద్రవ్యాన్ని కోరుకోరు.

ఈ వ్యాసంలో ద్రవ్య– పుట్టుక, పరిణామక్రమం, సరఫరా, నిల్వలు, ఆవశ్యకత, వివిధ స్వరూపాలు, ద్రవ్య చెల్లింపులలో మార్పులు, ద్రవ్య మారకపు విలువలు, బ్యాంకులు, కేంద్ర బ్యాంకు ద్రవ్య సరఫరా, దాని నియంత్రణల గురించి తెలుసు కొందాం.

ఇటీవల భారతదేశం వర్చువల్ కరెన్సీల ఆవిర్భావానికి చోటు కల్పించింది. నేటి డిజిటల్ యుగంలో 'కరెన్సీల' మార్పులపై తగిన అధ్యయనం చేయవలసిన ఆవశ్యకత ఉన్నది.

డిజిటల్ కరెన్సీల ద్వారా జరుగుతున్న ఆర్థిక లావాదేవీలు, వాటి ప్రక్రియ, వాటివల్ల జరుగుతున్న పరిణామాలపై అంతర్‌దృష్టి, పర్యవసానాలపై అవగాహన అత్యవసరం.

కె. గోపీకృష్ణ
విశ్రాంత ఉపన్యాసకులు

భారతదేశ ఆర్థికవ్యవస్థలో డిజిటల్ కరెన్సీలు క్రియారూపకంగా తమ పాత్రను పోషిస్తున్నా, భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చాలా భాగం పేపర్ కరెన్సీ లావాదేవీలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి.

కరెన్సీ అనేది కేవలం 'మార్పిడి మాధ్యమం. దీనితో కొనుగోలుదారులు, అమ్మకందారులు తమ వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోగలరు. కరెన్సీ ఇరువర్గాలూ ఆమోదించిన నిర్దిష్ట విలువకు కొలమానం.

సాధారణంగా కరెన్సీల నిర్వహణ, ఉత్పత్తి, నియంత్రణ, వాటి మారకపు విలువను ప్రభుత్వాలే నిర్ణయిస్తాయి.

కరెన్సీ సరఫరా, దాని పరిమాణాలు ఆర్థిక వ్యవస్థలో ధరల పెరుగుదల శాతాన్ని నిర్ణయిస్తాయి. కరెన్సీ చెలామణి వ్యాపార, వాణిజ్యాలను సులభతరం చేస్తుంది.

కరెన్సీ సరఫరా తగ్గినప్పుడు ఆర్థికమాంద్యం, కరెన్సీ అధిక సరఫరా/ చెలామణి వల్ల ద్రవ్యోల్బణం ఏర్పడతాయి.

కేవలం వినియోగదారుని 'కొనుగోలు శక్తి'ని నిర్ణయించేది కరెన్సీ, దాని విలువ. ఒక వ్యక్తి ఎక్కువ మొత్తంలో ధనార్జన చేయటం ద్వారా అతడి ఆర్థిక, సామాజిక స్థితిగతులు మెరుగుపడి, జీవన ప్రమాణాలు పెరుగుతాయి.

ప్రభుత్వాలు దేశంలో కరెన్సీ సరఫరాను, వడ్డీ రేట్లను నిర్ణయించడం ద్వారా మార్కెట్ల స్థితిగతులను, వినియోగదారుల కొనుగోలు సామర్థ్యాలను నియంత్రణ చేస్తూ, ఆర్థిక స్థిరత్వానికి మార్గాన్ని సులభతరం చేస్తాయి.

కరెన్సీ ఉత్పత్తి, దాని పంపిణీ, దాని నియంత్రణపై పలు ఆర్థిక కొలమానాలు నిర్ణయిస్తారు.

వినియోగదారులు 'కొనుగోలు శక్తి'ని 'కరెన్సీ' సరఫరా నిర్ణయిస్తుంది. ప్రభుత్వాలు చేసే కరెన్సీ ఉత్పత్తి, పంపిణీల ద్వారా ద్రవ్యరాశిని నియంత్రించడం, వడ్డీరేట్లను ప్రకటించటం వల్ల దాని ప్రభావం సమాజంలోని అనేకమందిపై పడుతుంది. మన దేశంలో కరెన్సీపై ఆధిపత్యం రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియాదే. మన దేశంలో నగదు, స్థూల దేశీయ ఉత్పత్తుల మధ్య నిష్పత్తి స్థిరంగా పెరుగుతూనే ఉంది.

రిజర్వ్‌బ్యాంక్ లెక్కల ప్రకారం దేశంలో 2,20,49 లక్షల కోట్ల నగదు చెలామణిలో ఉంది.

ప్రాచీనకాలంలో 'డబ్బులు' వాడకంలో లేవు. ప్రజలు తమ ఉత్పత్తులను పరస్పరం మార్పిడి చేసుకొనేవారు. ఇదే 'వస్తుమార్పిడి వ్యవస్థ' (బార్టరు).

నిజానికి కొనుగోళ్లు, అమ్మకం, అరువు తెచ్చుకోవటం, తిరిగి చెల్లించటం తదితర కార్యక్రమాల సౌలభ్యం కోసమే మొదట్లో 'ద్రవ్యం' ఆవిష్కరించారు. ఈ విధినే 'వినిమయ మాధ్యమం' అని వ్యవహరిస్తారు.

– మానవ చరిత్ర అంటే, ధనం విలువ కోల్పోయిన చరిత్రే!

– ద్రవ్యోల్బణం అంటే ఒకరకమైన పన్ను విధింపు వంటిదే. అయితే ఈ పన్ను విధించడానికి చట్టం ఏమీ ఉండదు.

– మిల్టన్ ఫ్రీడ్మన్

ప్రాచీన భారతీయ సమాజంలో ఒక వస్తువు ధరను ఇతర వస్తువుల పరిమాణంలో వ్యక్తపరిచే వారు. ఒక వస్తువుకు మరొక వస్తువును మార్పిడి/ విని మయం చేసే పద్ధతి చాలా అసౌకర్యమైనందువల్ల, వస్తుసేవల విలువను, ధర రూపంలో, ద్రవ్య యూనిట్లలో పేర్కొనటం జరిగింది.

దీనివల్లనే, సమాజానికి వ్యాపార కార్యక్రమాలను సులభతరం చేసేందుకు 'ద్రవ్యం' అవసరమైంది.

'ద్రవ్య' పరి

ద్రవ్యోల్బణం(inflation)

అనేక దేశాలలో ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేసే ప్రధానాంశం ద్రవ్యోల్బణం. ప్రపంచం నేడు తీవ్ర ద్రవ్యోల్బణ సమస్యను ఎదుర్కొంటోంది.

ఆర్థిక స్థితిగతులను, ప్రజల జీవన విధానాన్ని, వారి సంక్షేమం తదితర పలు అంశాలను నేరుగా ద్రవ్యోల్బణం ప్రభావితం చేస్తుంది.

ద్రవ్యోల్బణం అస్థిరమైన ఆర్థిక పరిస్థితులను నెలకొల్పుతుంది.

వస్తుసేవల ధరల గణనీయమైన పెరుగుదలను ద్రవ్యోల్బణం సూచిస్తుంది. దీని వలన డబ్బు విలువ పతనమౌతుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే, డబ్బు కొనుగోలు శక్తిని ద్రవ్యోల్బణం హరించి వేస్తుంది.

ఆర్థిక వ్యవస్థలో ఎంచుకున్న వస్తుసేవల ధరలు నిరంతరం పెరుగటంవల్ల 'కరెన్సీ' కొనుగోలు సామర్థ్యం సన్నగిల్లి, దేశంలోని కరెన్సీ కొనుగోలు శక్తి తగ్గుతుంది.

ఉదాహరణకు....

2019 సంవత్సరంలో 24 క్యారెట్ల బంగారం

10 గ్రాముల విలువ

రూ. 35,220.00

ధరలు పెరగటంవల్ల 2022లో అదే బంగారం 10 గ్రాముల విలువ

రూ॥ 52,785.00

అంటే, ద్రవ్యోల్బణం వల్ల బంగారం ధరలో రూ.17,565.00 పెరుగుదలను గమనించవచ్చును.

'పొదుపు' చేసినవారు ద్రవ్యోల్బణం వల్ల ఎక్కువగా నష్టపోతారని అర్థం చేసుకోవాలి.

2019 సం॥లో ఒక లక్ష రూపాయలకు 28 గ్రాముల బంగారం కొనుగోలు శక్తి కలిగి ఉన్నప్పటికీ,

ణామక్రమం

పొదుపు కోసం బ్యాంకులో ఎఫ్‌డి జేయటవల్ల సుమారు రూ.19,500ని వడ్డీ రూపంలో పొంద గలుగుతాం. కానీ, 2022 నాటికి ద్రవ్యోల్బణం వల్ల కరెన్సీ విలువ తగ్గి, బంగారం విలువ పెరుగటం వల్ల కేవలం 22 గ్రాములే కొనుగోలు చేయగలుగు తారు. ఫలితంగా పొదుపు చేసినవారు నష్టపోయేది రూ.31,668.00.

ఉదా॥కు మన వద్దనున్న ఒక లక్ష రూపాయలను సంవత్సరానికి 6 శాతం వడ్డీకి ఒక ప్రభుత్వ బ్యాంకులో డిపాజిట్ చేశారనుకుందాం.

2019లో రిటర్న్ సుమారు 6 శాతం వడ్డీ, ద్రవ్యోల్బణం రేటు 4 శాతం.

నిజంగా మనకు వచ్చే వడ్డీ మొత్తం = వడ్డీ రేటు – ద్రవ్యోల్బణం రేటు. అంటే, 06 శాతం – 04 శాతం = 2 శాతం.

కేవలం 2%. అంటే, లక్ష రూపాయలపై ఏడాదికి రూ.6000 వడ్డీ రూపంలో పొందినా, ద్రవ్యోల్బణం వల్ల అందులో రూ. 4000 విలువ తగ్గి నిజంగా కేవలం రూ.2000 విలువ మిగులు తుంది. అదే ద్రవ్యోల్బణం రేటు 6 శాతానికి పెరిగినట్లు అయితే, నికరంగా మనం పొందే వడ్డీ శూన్యం. మనం వ్యక్తిగత అవసరాల కోసం ఎలాంటి బ్యాంకులో పొదుపుచేయకపోతే సంవత్సర కాలంలో లక్ష రూపాయలకు సుమారు 6000 /– విలువ కోల్పోవటం వల్ల మన లక్ష విలువ కేవలం 94,000/ – గా మారుతుంది.

కనుక, పై ఉదాహరణ ద్వారా మనం అర్థం చేసుకోవలసిన ముఖ్యాంశాలు

ఎ) స్థిరమైన లాభాలను సమకూర్చే రంగాలలో మన సొమ్ములను మదుపు చేయాలి.

బి) ద్రవ్యోల్బణ రేటు కన్నా అధిక శాతంతో లాభాలనివ్వగలిగే మదుపులనే ఎంచుకోవాలి.

సి) దీర్ఘకాలంలో రాబోయే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, లేదా కేవలం 5 శాతం, లేదా 10శాతం వన్ను మినహాయింపు పొందవచ్చునని అనేక మార్గాలలో పొదుపులను చేయుటంవల్ల ఆర్థికంగా నష్టపోవటం తథ్యం.

డి) బంగారం, వెండి లాంటి లోహాలు విలువలు అంతర్జాతీయంగా స్థిరంగా పెరుగుతుండడంతో వాటిని కొనుగోలు చేయటం ద్వారా కొంత మేరకు నష్టాలను తగ్గించుకోగలుగుతారు.

ద్రవ్యం కాల విలువ అంటే ఏమిటి?

ద్రవ్యపు కాల విలువ (Time Value of Money) నేడు మన వద్దనున్న రూ.1000 విలువ, రేపటి కాలంలో రాబోయే రూ.1000 విలువకు ఎన్నడూ సరిసమానం కాదు. ద్రవ్యోల్బణం వల్ల ద్రవ్య రూపంలో ఒకే అంకెను కలిగి ఉన్న రూ.1000 కొనుగోలు శక్తి తగ్గటం వల్ల దాని వాస్తవిక విలువ సుమారుగా సంవత్సరానికి 10శాతం మేరకు తగ్గుతుంది. సూర్యరశ్మికి నదులలో నీరు ఆవిరిగా మారినట్లు, ద్రవ్యం కూడా ద్రవరూప లక్షణాలను కలిగి ఉంది. ధరల పెరుగుదల, అంతర్జాతీయ ఆర్థిక స్థితిగతులు, రూపాయి మారకపు విలువలు మారటం, దేశీయ ఆర్థికరంగంలో వచ్చే మార్పులు మొదలైన పలు అంశాలవల్ల, ద్రవ్యపు నిజ విలువ (Real Volue of Money) క్రమక్రమంగా క్షీణిస్తోంది.

ఉదాహరణకు నేడు మనవద్దనున్న రూ. 1000/ –లను, 10% వడ్డీ లేదా రాబడివచ్చేలా మ్యూచువల్ ఫండ్స్‌లో పొదుపు చేసినట్లయితే కేవలం 2 ఏళ్ళ కాలంలో రూ.1210గా దాని భవిష్యత్ విలువ మారుతుంది. అంటే, భవిష్యత్‌లో రూ.1210 విలువ నేడు మనవద్ద నున్న రూ.1000/–లకు సరిసమానం.

దీనినే ఆర్థిక పరిభాషలో 'ద్రవ్యము కాల విలువ'గా వ్యవహరిస్తారు.

మీరు ఎవరైనా సంస్థవద్దగానీ, వ్యక్తి దగ్గర అప్పుగా రూ.1000/– తీసుకొని 10/– వడ్డీతో కలపి 2 ఏళ్ళ కాలంలో 1210/– తిరిగి చెల్లించినా, దాని నికర విలువ కేవలం రూ.1000/– మాత్రమే. ద్రవ్యరూపంలో వడ్డీ పొందిన వ్యక్తి 'సంతృప్తి' పొందినా, వాస్తవానికి, తన సొమ్మును మాత్రమే అతడు తిరిగి పొందాడు. **(సశేషం)**

సుజాత గోపగోని, 6302164068

టికెట్లపై మోదం...

తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముంచుకు వస్తున్నాయి. రోజు రోజుకూ పొలిటికల్ హీట్ ఎక్కువైపోతోంది. విపక్షాలు ప్రధానంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులపై దృష్టి సారించాయి. అధికార బీఆర్ఎస్ మాత్రం ఇప్పటికే మెజార్టీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. ఏడుగురికి మినహా దాదాపు సిట్టింగ్‌లకు అందరికీ మరోసారి ఛాన్స్ కల్పించింది. అయితే, ఇప్పటికే ప్రతి నియోజక వర్గంలోనూ అన్ని కోణాల్లో మంచి పట్టు సంపాదించుకొని విజయం తమదే అన్న ధీమాతో ఉవ్విళ్లూరుతున్న సిట్టింగ్‌లను చేజార్చుకోలేకనే బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖరరావు అతి ముందస్తుగా అభ్యర్థులను ప్రకటించారన్న చర్చ జరుగుతోంది. నియోజకవర్గాల వారీగా పలుకుబడిని, అధికార వర్గాలతో సంబంధాలను చూసినా, ఇన్నాళ్లుగా ప్రతిపక్షాలకు కనీసం ఛాన్స్ లేకుండా, విపక్షాలకు చెందిన అభ్యర్థులను ప్రజల్లో ఇమేజ్ పొందకుండా ఎప్పటికప్పుడు కట్టడిచేసిన అధికార పార్టీ శాసనసభ్యులు.. ఆర్థికంగానూ నిలదొక్కుకున్నారన్న చర్చ నడుస్తోంది. ఈ క్రమంలోనే ఆర్థికంగా బలపడ్డ సిట్టింగ్‌లు బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోకుండా కట్టడిచేసే ప్లాన్‌లో భాగంగానే అభ్యర్థుల ప్రకటన జరిగిందని విశ్లేషకులు కూడా గట్టిగా చెబుతున్నారు. అయితే, 'షరతులు వర్తిస్తాయి' మాదిరిగా.. చివరలో కొన్ని మార్పులు, చేర్పులు ఉండొచ్చని కూడా కేసీఆర్ ఓ మాట వదిలారు. అంటే.. ఇప్పటినుంచే అభ్యర్థులు జనంలో ఉంటారని, ఒకవేళ చివరలో అభ్యర్థుల పేర్లు మార్చినా.. వాళ్లకు ఇతర పార్టీల్లోకి వెళ్లే దారులన్నీ మూసుకుపోతాయన్న పక్కా వ్యూహం ఇందులో ఉందంటున్నారు.

అయితే, ప్రధాన ప్రతిపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మాత్రం బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరుతెన్నులు, హామీల స్థితిగతులపై ఫోకస్ పెట్టాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయి నాయకులతో పూర్తి స్థాయి సమాచారం తెప్పించుకుంటూ బీఆర్ఎస్‌ను ఎండగట్టే పనిలో నిమగ్నమయ్యాయి. ఈ క్రమంలోనే రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులు, గతంలో బీఆర్ఎస్ (నాటి టీఆర్ఎస్) పార్టీ ఇచ్చిన హామీలు, చేసిన హడావిడి చర్చకు వస్తున్నాయి. తెలంగాణ ఆరోపణలు చాలా కాలంగానే ఉన్నాయి. కేసీఆర్ సీఎంగా మొదటి సారి బాధ్యతలు చేపట్టిన ఏడాది తర్వాత 2015 జూన్ 11వ తేదీన కరివెన దగ్గర పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. బూత్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, 'కుర్చీ వేసుకుని ఈ ప్రాజెక్టును కట్టిస్తా.. నాలుగేండ్లలో నీరు అందిస్తా.. మూడేండ్ల లోనే 70% పాలమూరు పచ్చబడేలా చేస్తా..' అని ప్రకటించారు. కానీ, తొమ్మిదేళ్లయినా ఇంకా అంటేనే కాళేశ్వరం అన్న రీతిలో తయారయ్యిందని, ఆ ప్రాజెక్టు మినహా రాష్ట్రంలో ఇతర ప్రాజెక్టులన్నీ పడకేశాయని విపక్షాలు కొత్త అస్త్రం బయటకు తీశాయి. వాస్తవ పరిస్థితి కూడా అలాగే ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌కు దక్షిణ తెలంగాణ గండం వెంటాడుతోందంటున్నారు. కేసీఆర్ సర్కారు.. ఉత్తర తెలంగాణలోని అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టు కాళేశ్వరంపై పెట్టిన శ్రద్ధ... దక్షిణ తెలంగాణలోని ప్రాజెక్టులపై చూపించడం లేదన్న చర్చ, విపక్షాల నుంచి విమర్శలు ఎక్కువవుతున్నాయి. ఈ పరిస్థితుల్లోనే.. ఉమ్మడి నల్లగొండ, పాలమూరు జిల్లాల్లో కృష్ణా జలాలు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణా బేసిన్‌లోని గ్రామాల్లో సాగునీటి సౌకర్యం లేక వ్యవసాయ పనులు నత్తనడకన సాగడం బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే గుబులు ఆ పార్టీలో మొదలైంది.

ఉత్తర తెలంగాణలో గోదావరి బేసిన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టును భారీ ఖర్చుతో నిర్మించిన సీఎం కేసీఆర్.. దక్షిణ తెలంగాణపై వివక్ష చూపిస్తున్నారనే పెండింగ్‌లోనే పెట్టడంపై ఇప్పటికే జిల్లాల్లో చర్చలు మొదలయ్యాయి. 'పాలమూరు నుంచి ఎంపీగా ఉంటూ తెలంగాణను తెచ్చిన' అని గొప్పగా ఆ సభలో ప్రకటించిన కేసీఆర్.. నెలకు రెండుసార్లు వస్తానని, పనులను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. 'పాలమూరును కట్టి చూపిస్తా.. ఇదే నా శపథం' అని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు సంగతి ఎలా ఉన్నా దక్షిణ తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాక పోవడంతో ఆ ప్రభావం ఇప్పుడు బహిర్గతమవుతున్నది. వానాకాలం సీజన్ మొదలైనా సాగు పనులు నత్తనడకన నడుస్తున్నాయి.

అటు కాల్వల్లో నీరు లేక, ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తికాక, సమయానికి వర్షాలు పడక రైతులు తిప్పలు పడుతున్నారు. మరో మార్గం లేని రైతులు రూ.లక్షన్నర నుంచి రూ. 2 లక్షల దాకా ఖర్చు పెట్టి కొత్తగా బోర్లు వేయించుకుంటున్నారు. గతేడాదితో పోల్చితే ఈసారి కష్టాలు తప్పవని రైతులు నిర్ధారణకు వచ్చారు. ఒక సీజన్ మొత్తం నష్టపోవాల్సి వస్తుందన్న ఆందోళనలో అన్నదాతలు ఉన్నారు.

మరోవైపు.. ప్రజలను ఆకర్షించే ఉద్దేశంతో కొత్త



సమస్యలపై ఖేదం

సచివాలయంలో మే ఒకటో తేదీన తొలి సమీక్షా సమావేశంగా పాలమూరు ప్రాజెక్టుపైనే సీఎం కేసీఆర్ నిర్వహించారు. సచివాలయంలో తన చాంబర్‌లో ఆసీనులైన మొదటగా సంతకం చేసిన ఫైళ్లలోనూ పాలమూరు జిల్లా సాగునీటికి సంబంధించినవి ఉన్నాయి. కరివెన, ఉద్దండాపూర్ రిజర్వాయర్ల నుంచి నీటిని నారాయణపేట, కొడంగల్, వికారాబాద్ తదితర ప్రాంతాలకు తరలించడానికి వీలుగా కాలువలు తవ్వాలని ఆదేశించే ఫైళ్లు అందులో ఉన్నాయి. కరివెన రిజర్వాయర్‌కు సంబంధించిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి జూలైలో నీటి తరలింపు మొదలు పెట్టాలని, ఆగస్టు నాటికి ఉద్దండాపూర్ వరకు చేరుకోవాలని ఆ సమావేశంలో అధికారులను ఆదేశించారు. జూన్ 19వ తేదీన కేసీఆర్ నిర్వహించిన సమావేశంలో, సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి ఆగస్టు చివరి నాటికి తాగునీటి కోసం నార్లాపూర్, ఏదుల, కరివెన, ఉద్దండాపూర్ జలాశయాల్లోకి నీటిని ఎత్తిపోయాలని, అందుకు అవసరమైన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లను తొలగించి సమర్థులైనవారికి అప్పగించాలని అధికారులను ఆదేశించారు. కానీ, ఆ పనులు ఇంకా సాగుతూనే ఉన్నాయి. బిల్లులు విడుదల కావడం లేదు.

రాష్ట్రంలో నీటి పారుదల ప్రాజెక్టుల పనులకు బిల్లులు విడుదల కావడం లేదు. ఎన్నికలు ముంచుకొస్తుండటంతో నిధులన్నీ వివిధ సంక్షేమ పథకాల వైపునకు వెళ్తున్నాయి. దీంతో ప్రాజెక్టుల పనులు మందగించాయి. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 26 భారీ ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. జూలై నాటికి వీటికి సంబంధించి రూ. 13 వేల 599.87 కోట్లు మంజూరు కావాల్సి ఉంది. వీటిలో బిల్లులు సిద్ధమై, దాఖలు చేసి, టోకెన్ నంబర్లు కూడా ఇచ్చినవి రూ. 9వేల 758.20 కోట్ల దాకా, బిల్లులు సమర్పించినవి రూ. 3,841.67 కోట్ల వరకు ఉన్నాయి. బకాయిల్లో అత్యధికం పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి చెందినవే ఉన్నాయి. ఈ పథకానికి రూ. 5,768.92 కోట్లు పెండింగ్‌లో పడిపోయాయి. దీంతో పాటు.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రూ. 3,679.95 కోట్లు, సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ. 1176 కోట్లు చెల్లించాల్సి ఉంది.

అటు.. కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర విద్యుత్తు రుణ సంస్థల నుంచి రుణాలు ఆగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అప్పు.. ఆర్థిక బాధ్యత-బడ్జెట్ నిర్వహణ చట్టం – ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి దాటిపోవడంతో జాతీయ స్థాయి సంస్థలేవీ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు రుణాలు ఇవ్వడం లేదు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో రోజుకు రెండు టీఎంసీలు తరలించే ప్రధాన పథకానికి మాత్రమే అనుమతి ఉంది. రోజుకు ఒక టీఎంసీ అదనంగా తరలించే పథకానికి అనుమతుల్లేవు. ప్రస్తుతానికి అనుమతులు వచ్చే అవకాశాలు కూడా కనిపించడం లేదు.

పాలమూరు ఎత్తిపోతల పథకానికి సంబంధించి కీలకమైన రెండో దశ కోసం పర్యావరణ అనుమతి ఇవ్వడానికి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు నిపుణుల మదింపు కమిటీ సిఫారసు చేసింది. అయితే ప్రాజెక్టు సవివర నివేదిక-డీపీఆర్-వివాదంలో ఉంది. దీనికి అనుమతి ఇవ్వలేమని, నీటి కేటాయింపుల వివాదం తేలాల్సిందేనని సీడబ్ల్యూసీ తేల్చి చెప్పింది. నిర్మాణంలో జాప్యం కారణంగా ఈ ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ. 55 వేల కోట్లు దాటింది. దీన్ని పూర్తి చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వ ఖాతా నుంచి నిధులు ఇవ్వాల్సిన అనివార్య పరిస్థితి ఉంది. ఇదివరకు ఎత్తిపోతల్లో ఎలక్ట్రో మెకానికల్ కాంపోనెంట్లకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ)-రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) రుణాలు ఇచ్చేవి. అయితే, కేంద్ర జలశక్తి శాఖ.. అనుమతి లేనివాటి జాబితాలో పెట్టడంతో ఈ ప్రాజెక్టులకు రుణాలు ఆగిపోయాయి. కాళేశ్వరం మాదిరిగానే హెడ్‌లు మాత్రమే పూర్తిచేసి, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను దేవుడి దయకు వదిలేసే అవకాశాలు కనిపిస్తున్నాయంటున్నారు.

ఇక, ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ అత్యంత కీలకమైన దశ. ఈ పనుల కోసం రూ. 322 కోట్లు విడుదల కావల్సి ఉంది. భూములు కోల్పోయిన వాళ్ల పునరావాసానికి రూ. 224 కోట్లు అవసరం అవుతాయి. భూ సేకరణకు సకాలంలో నిధులివ్వక పోవడంతో భూములను వదులుకోవడానికి రైతులు సిద్ధంగా లేరు. భూసేకరణ, పునరావాసానికి నిధులిస్తేనే ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచగలమని అధికారులు చెబుతున్నారు. మరోవైపు.. బకాయిల నేపథ్యంలో పనులు చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. సబ్ కాంట్రాక్టర్ల పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంది. దీంతో, ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు సంబంధించిన నిర్మాణపనుల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తుందా అని చకోర పక్షుల్లా ఎదురుచూస్తున్నారు.

ఈ పరిస్థితుల నేపథ్యంలో బీఆర్ఎస్ క్షేత్రస్థాయి నేతలకు, ఎమ్మెల్యే అభ్యర్థులకు బెంగ పట్టుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో మెజార్టీ స్థానాలు బీఆర్ఎస్ కైవసం చేసుకున్నది. మరి ఈసారి పరిస్థితి ఏంటన్న దానిపై ఆ పార్టీలో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దక్షిణ తెలంగాణ రైతులు ఎలా ఆలోచిస్తారో, వారి ఓటు ఎటు పడుతుందోననే ఆందోళన గులాబీ నేతల్లో మొదలైంది. రైతులను కన్విన్స్ చేయడం అధికార పార్టీకి సవాలుగా మారింది. ఒక సీజన్ మొత్తం రైతులు నష్టపోతే అది వచ్చే ఎన్నికల్లో ఎలాంటి చేటు తెచ్చిపెడుతుందోని అధికార పార్టీ నేతలకు భయం పట్టుకుంది.

కాళేశ్వరం ప్రాజెక్టుతో పాలమూరు ప్రాజెక్టును పోల్చుకుని ఉమ్మడి మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లాలు రైతులు ఓటు వేసే టైమ్‌లో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఈ అంశాన్ని లేవనెత్తి పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో ప్రచారం చేస్తున్నాయి. పాలమూరు ప్రాజెక్టు పనుల్లో జరిగిన జాప్యాన్ని ఎత్తి చూపి కేసీఆర్‌ను టార్గెట్ చేస్తున్నారు. మరి.. బీఆర్ఎస్ ఈ పరిస్థితులను ఎలా ఎదుర్కొంటుందో, విపక్షాల విమర్శలకు ఏం సమాధానం చెబుతుందో.. చివరకు ఎన్నికల్లో ఎలా గట్టెక్కుతుందో చూడాలి. ★

విద్యుత్ ఉత్పత్తి, సరఫరా రంగంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందింది. విద్యుత్‌పైనే అన్ని వర్గాలు ఆధారపడి ఉన్నాయి. అందువల్ల డిమాండ్ మేరకు విద్యుత్‌ను సరఫరా చేయవలసి ఉండగా రాష్ట్రంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్ల నాలుగు నెలల్లో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, భవిష్యత్ డిమాండ్‌లపై చొరవ, ఆసక్తి చూపలేదు. పైగా నిర్లక్ష్య ధోరణి కనబరచింది. ఉన్న థర్మల్ ప్లాంట్లలో ఉత్పత్తిని పరిమితం చేసి, బహిరంగ మార్కెట్‌లో విద్యుత్‌ను అధిక ధరలకు కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజల నెత్తిన వేసి వసూలు చేస్తోంది. అధిక ఛార్జీల భారం మోస్తున్నా విద్యుత్ పూర్తి స్థాయిలో లభిస్తుందా?అంటే రోజుకు నాలుగైదు గంటల విద్యుత్ కోతతో ప్రజలు అల్లాడుతున్నారు. మరోవైపు వర్షాలు పడక బోర్లపైనే ఆధారపడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర రైతులు విద్యుత్ అప్రకటిత కోతలతో పైరును కాపాడు కోవడానికి నానా అగచాట్లు పడుతున్నారు. ఉమ్మడి రాయలసీమ జిల్లాల్లో వరి, వేరుశనగ పైర్లు ఎండి పోతున్నాయి. ఇక ఆక్వా రైతుల పరిస్థితి మరింత దీనంగా తయారైంది. ప్రభుత్వం ప్రకటించిన విద్యుత్ రాయితీలు ఇవ్వకపోగా ఈ కోతలను అదనపు బహుమతిగా ఇస్తుండటంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. రోజుకు సగటున డీజిల్‌కు మూడు వేల రూపాయల వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోందని, విద్యుత్ కోతలు ఇలాగే కొనసాగితే ఆక్వా సంక్షోభం పతాక స్థాయికి చేరుకుంటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంటు కోతలతో పరిశ్రమలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. గత ఏడాది పవర్ holiడే ప్రకటించిన ప్రభుత్వం ఈ ఏడాది కూడా అప్రకటిత holiడేకు ఆదేశాలిచ్చిందంటున్నారు. దీంతో కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడింది. షిఫ్టులవారీ పని కల్పించే పరిశ్రమలు ఈ కోతల ధాటికి ఒక షిఫ్టునకే కార్మికులను విధుల్లోకి తీసుకుంటున్నాయి. దీనివల్ల ఆదాయంపై సగానికి సగం కోత పడి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం కొత్తగా ఉపాధి కల్పించకపోగా ఉన్న ఉపాధిపై చావుదెబ్బ కొడుతోందని వారు మండి పడుతున్నారు.

రాష్ట్రంలో విద్యుత్ అవసరాలను తీర్చడంపై వైసీపీ ప్రభుత్వం ఏనాడూ దృష్టి పెట్టలేదు. 23 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటుతో రాష్ట్రం ఏర్పడింది. 2014లో కేంద్రంలో ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా పలు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా 24×7 విద్యుత్ సరఫరా చేసేందుకు ఎంపిక చేసిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి. దాంతో అయిదేళ్లపాటు కరెంటుకు సమస్యలు ఏర్పడలేదు. 2014-2019 మధ్యకాలంలో విద్యుత్తు పంపిణీ సంస్థలు సౌర, పవన విద్యుత్తు ఉత్పత్తి సంస్థలతో యూనిట్ రూ.4.64 వరకూ ఒప్పందాలు చేసుకున్నాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక సమస్యలు ప్రారంభమయ్యాయి. కరెంటు అవసరాలు, ఉత్పత్తిపై ఏనాడూ దృష్టి పెట్టలేదని, సమీక్షలు చేయలేదని నిపుణులు విమర్శిస్తున్నారు. ఇవి కాక గత ప్రభుత్వం చేసుకున్న పవన, సౌరవిద్యుత్తు కొనుగోలు ఒప్పందాలను (పీపీఏ) ఈ ప్రభుత్వం రద్దుచేసింది.ఆ సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో సగం ధర చెల్లిస్తోంది. కరెంటు కొనుగోలు చేయకుండానే ఏటా దాదాపు రూ.4000 కోట్ల మేర చెల్లింపులు జరిపినట్లు విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ ప్రభుత్వం ఉత్పత్తిని అయినా పెంచిందా? అంటే అదీ లేదు. మరలా బయటి కంపెనీల నుంచే విద్యుత్‌ను కొంటోంది. ఒకానొక దశలో పీక్ అవర్స్ కాలంలో యూనిట్ రూ.25 కొన్న ప్రభుత్వం కేంద్రప్రభుత్వ ఆంక్షలతో ఇప్పుడు రూ.10లకు కొంటోంది. గత ఏడాది ఇదే సమయానికి విద్యుత్ వినియోగం రోజుకి 196 మిలియన్ యూనిట్లు ఉండగా, ప్రస్తుతం 235 నుంచి 240 మిలియన్ యూనిట్లు ఉంటోందంటున్నారు. ఏపీలో అత్యధికంగా విద్యుత్ ఉత్పత్తి అయ్యే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో తొలిస్థానంలో ఉండే విజయవాడ ఎన్టీటీపీఎస్‌లో 2550 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యానికి గాను, ప్రస్తుతం సగం మాత్రమే ఉత్పత్తి అవు తోంది. దీని తర్వాత స్థానంలో ఉన్న నెల్లూరు కృష్ణపట్నం విద్యుత్ కేంద్రంలో 2400 మెగావాట్ల ఉత్పత్తి సామర్థానికి కేవలం 30 శాతం మాత్రమే ఉత్పత్తి అవుతోంది. మూడో స్థానంలోని రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రంలో 1650 మెగావాట్ల సామర్థ్యానికి గాను 60 శాతం మాత్రమే విద్యుత్ ఉత్పత్తి అవుతోందని ఆయా వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం రోజుకి 240 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవసరం కాగా, రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల ద్వారా 103 మిలియన్ యూనిట్లు, జల విద్యుత్ ద్వారా 9.61, పవన విద్యుత్ 11.95, సౌర విద్యుత్ 11.35, ఇతర వనరుల నుంచి 2.71 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇదిగాక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతో కుదుర్చుకున్న పీపీఏల ద్వారా 44.38 మిలియన్ యూనిట్లు, డిస్కంల ద్వారా సుమారు 50 మిలియన్ యూనిట్లు బహిరంగ మార్కెట్ నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని నిపుణులు చెబుతున్నారు. మొత్తంగా ఉత్పత్తి, వినియోగానికి మధ్య రోజుకి సుమారు 5 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత ఏర్పడుతోంది. దీంతో లోడ్ రిలీఫ్ పేరుతో గ్రామాల్లో, పట్టణాల్లో ఒక్కోసారి నాలుగైదు గంటలు వరుసగా కోతలు విధిస్తున్నారు.

వల్లూరు జయప్రకాష్ నారాయణ
ఛైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు,
కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ

ప్రణాళిక లేమి

రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు తీర్చడంలో ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళిక లేకపోగా, నిర్లక్ష్య ధోరణి వహిస్తోంది. థర్మల్, జల, పవన, సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఉద్దేశ్యపూర్వకంగా ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. వీటిని నడపడం కంటే, బయట కరెంటు కొనడమే చౌక అనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. బహిరంగ మార్కెట్లో కొనడం కంటే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి ఖర్చు ఎక్కువగా ఉంటుందనే నెపంతో కృష్ణపట్నం దామోదరం సంజీవయ్య, విజయవాడ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, రాయలసీమ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని కుదించేసింది. 45 శాతం విద్యుత్తును ప్రైవేటు కంపెనీల నుండి కొనుగోలు చేస్తోంది. ఇది కాకుండా ప్రతిరోజు స్వల్పకాలిక కొనుగోళ్లు చేస్తున్నారు. పవర్ మార్కెట్ నుంచి అత్యవసరాల మేరకు విద్యుత్‌ను యూనిట్ రూ. 10 నుంచి రూ. 20 వరకు కొనుగోలు చేశారు. బొగ్గు కొనుగోళ్లు ఆపేయడంతో పాటు, బకాయిలు చెల్లించకపోవడంతో మహానది, తెలంగాణలోని

విద్యుత్ విధానంపై వైసీపీ తీవ్ర వైఫల్యం

సింగరేణి కాలరీస్,గత ఏడాది బొగ్గు సరఫరాను దాదాపు నిలిపి వేయడంతో తీవ్ర విద్యుత్ కొరత ఏర్పడింది. పవర్ హాలిడేను ప్రకటించడంతో కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఇప్పుడు అదే పరిస్థితి కనిపిస్తోంది. థర్మల్ కేంద్రాల నిర్వహణకు అవసరమైన బొగ్గును నాలుగు నెలలకు సరిపడా ప్లాంట్లలో నిల్వచేసుకోవాలి. కనీసం నెల రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండాలనే నిబంధనను 15 రోజులకు మార్చారు. అయితే, ప్రస్తుతం థర్మల్ కేంద్రాల్లో రెండు, మూడు రోజులకు మాత్రమే బొగ్గు నిల్వలున్నా యంటున్నారు. కృష్ణపట్నం ప్లాంట్ రోజుకు 19000 మెట్రిక్ టన్ను (ఎంటి)ల బొగ్గు అవసరం కాగా, 6,33,47 ఎంటీలు మాత్రమే అందుబాటులో ఉంది. ఇది కేవలం మూడు రోజులకు మాత్రమే వస్తుంది. రాయలసీమ ప్లాంట్‌కు రోజు 21వేల ఎంటీలు అవసరం కాగా ప్రస్తుతం 46670 ఎంటీలు (అంటే రెండు రోజులకు సరిపడ) మాత్రమే ఉంది. వీటీపీఎస్ ప్లాంట్‌కు రోజుకు 28500 ఎంటీల బొగ్గు అవసరంగా కాగా ప్రస్తుతం అక్కడ 71,313 ఎంటిలు అంటే రెండున్నర రోజులకు సరిపడ మాత్రమే ఉంది.

సంక్షోభంలో పారిశ్రామికరంగం

రాష్ట్రంలో కరెంట్ కోతలు, విద్యుత్ ఛార్జీల పెంపుతో ప్రజలు, పారిశ్రామిక రంగం, రైతాంగం, ఆక్వారంగం తీవ్ర సమస్యల్లో ఇరుక్కున్నాయి. అసలే ట్రూ అప్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీల భారం మోస్తున్న పారిశ్రామిక రంగం కరెంటు కోతలతో పనులు సాగక ఉత్పత్తులను నిలిపివేయాల్సి వస్తోంది. ఇది లక్షలాది మందికి జీవనోపాధిపై ప్రభావం చూపనుంది. ముఖ్యంగా చిన్నతరహా పరిశ్రమలు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నాయి.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నేరుగా ఛార్జీలు పెంచకుండా వివిధ రూపాల్లో ఛార్జీల మోత మోగిస్తోందని పారిశ్రామిక వర్గాలు వాపోతున్నాయి. ఒక మోస్తరు పరిశ్రమపై ప్రతి నెలా రూ.4 లక్షల భారం పడిందంటున్నారు. వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు యూనిట్‌కు 6 పైసలుగా ఉన్న విద్యుత్ సుంకాన్ని 2022 మే నుంచి ఏకంగా రూపాయికి పెంచారు. వాటిని భరించే స్థితిలో పరిశ్రమలు లేవని, సుంకాన్ని తగ్గించాలని పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని కోరినా ఫలితం లేదు. 2022 ఆగస్టు నుంచి ట్రూఅప్ పేరుతో యూనిట్‌కు 22 పైసలు, 2021-22లో వినియోగించిన విద్యుత్‌కు ఇంధన సర్దుబాటు ఛార్జీ (ఎపీపీపీసీఏ)ల కింద 2023 ఏప్రిల్ నుంచి యూనిట్‌కు 63 పైసల అదనపు భారం వేశారు. 2023-24లో ఎఫ్ పీపీసీఏ కింద యూనిట్‌కు రూ.1.10 వంతున వసూలు చేసుకోవడానికి అనుమతించాలని డిస్కంలు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి ప్రతి పాదించాయి. అందులో యూనిట్‌కు 40 పైసల చొప్పున గత ఏప్రిల్ నుంచి వసూలు చేస్తున్నాయి. మిగిలిన 70 పైసలు ఏడాది చివర్లో ట్రూఅప్ కింద వసూలు చేసే అవకాశం ఉంది. ఇలా ఈ ప్రభుత్వం నాలుగేళ్లలో పరిశ్రమలపై యూనిట్‌కు రూ.2.89 భారాన్ని వేసింది. ట్రూప్, ఎఫ్ పీపీసీఏల పేర్లతో ప్రభుత్వం వేసిన విద్యుత్ ఛార్జీల భారాలు ఉత్పత్తి వ్యయంపై పడ్డాయి. విద్యుత్ వాడకం ఖర్చు ఇంజినీరింగ్, తయారీ వంటి పరిశ్రమల్లో ఉత్పత్తిపై 20 శాతం, మెల్టింగ్ చేసే ఫౌండ్రీలు, స్పిన్నింగ్ మిల్లులు వంటి వాటిలో 40%, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల్లో 60% వరకు ఉంటుంది. ప్రభుత్వం వేసిన అదనపు భారాలతో ఈ తరహా పరిశ్రమలన్నీ తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నాయి. ఇప్పటికే ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడ్డాయి.

విద్యుత్ కోతలతో ఎండుతున్న పైర్లు

విద్యుత్ కోతలతో నీరు అందక బోర్లు, బావులు కింద సాగు చేసే పైర్లు ఎండిపోతున్నాయి. వ్యవ సాయానికి 9 గంటలు విద్యుత్ సరఫరా విధానం అమలు కావడంలేదు. ఫలితంగా వరి పొలాలు ఎండి పోతున్నాయి. రెండు రోజుల నుంచి రెండు గంటలు మాత్రమే విద్యుత్ ఇస్తున్నారు. అదీ దశలు వారీగా ఇస్తుండటంతో పొలం తడవడం కష్టంగా మారింది. ప్రతి జిల్లాలోనూ విద్యుత్‌పై ఆధారపడి వేలాది ఎకరాల్లో సాగుకు రైతులు పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి ఉన్నారు. ఒకవైపు వర్షాలు కురవక, మరోవైపు కాల్వల్లో సాగునీరు లేక.. ఇంకోవైపు విద్యుత్ కోతలతో పంటలను కాపాడుకోలేక రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కొంతమంది రైతులు పంటలను కాపాడుకునేందుకు ఆయిల్ ఇంజన్లను ఆశ్రయిస్తున్నారు. ఇందుకు ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చు చెయ్యాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అన్ని జిల్లాల్లో రైతులు విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వం వారికి సర్దిచెప్పి సమస్య పరిష్కరించాల్సింది పోయి జగ్గయ్యపేట, పులివెందుల్లో రైతులపై కేసులు పెట్టింది.

ప్రజల ఆందోళన

పంటలు ఎండిపోయి రైతులు, కరెంటు లేక గ్రామాలు, పట్టణవాసులు అల్లాడుతున్నారు. ప్రజలు గగ్గోలు పెడుతున్నా ముఖ్యమంత్రి ఒక్కరోజు కూడా దీనిపై సమీక్ష నిర్వహించివిద్యుత్ కోతలతో నీరు అందకలేదు.వైసీపీ ప్రభుత్వ అసమర్థత, అవగాహన లేమి, చేతగానితనం వల్లే కరెంటు కోతలు విపరీ తంగా పెరుగుతున్నాయని ప్రజలు, వ్యాపారులు, పారిశ్రామికవర్గాలు, రాజకీయపార్టీలు విమర్శి స్తున్నాయి. రాష్ట్రం అంతా చీకట్లో మగ్గుతుంటే తాడేపల్లి ప్యాలెస్ మాత్రం దేదీప్యమానంగా వెలుగుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. రైతులకు తొమ్మిది గంటలు నిరంతరాయంగా కరెంటు ఇస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసి ఇప్పుడు సగం కూడా ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. కరెంటు ఛార్జీలు పెంచడంపై ఉన్న ఉత్సాహం 'కోతలు' లేకుండా చేయడంలో లేదని ఆక్షేపిస్తున్నారు. వర్షా కాలంలో కూడా కరెంటు కోతలు వైసీపీ హయాంలోనే మొదలవడం అసమర్థతగా పేర్కొంటు న్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విద్యుత్ మంత్రి అనే విషయం కూడా చాలా మందికి తెలీదు. ఆయనకు గనులపై గల ఆసక్తి తాను చూస్తున్న శాఖపై లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ★

ప్రపంచానికి కరోనా మహమ్మారిని పంచి అపఖ్యాతిపాలైన చైనా పోయిన ప్రతిష్టను దక్కించుకోవడానికి కసరత్తు చేస్తోంది. అయితే పుట్టుకతో పుట్టిన బుద్ధి పుడకతలతో గాని పోదు అన్న చందంగా ఈ వ్యూహాలు కూడా వక్రంగానే ఉన్నాయి. భారతీయ మార్కెట్లలో కోల్పోతున్న ఉత్పత్తుల ఆదరణను నిలుపుకోవడం అందులో ఒకటి. దానితోపాటు భారతీయుల మెదళ్లను ప్రభావితం చేసే ప్రయత్నం మరొకటి. ఇందుకోసం వివిధ రంగాలను వినియోగించుకుంటోంది. చైనా మీద సానుకూల కథనాలను వండి వార్చేందుకు సినిమా, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలను వాడుకుంటోంది. దేశంలో వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ కుట్రలు వెలుగు చూశాయి.

'చైనా, భారత్ ఒకేసారి స్వతంత్ర దేశాలైనాయి. విప్లవ సిద్ధాంతాలతో చైనా, ప్రజాస్వామ్య సిద్ధాంతాలతో భారత్ ముందుకెళ్లాయి. ఇప్పుడు చైనా ఎక్కడుంది? భారత దేశం ఇంకెక్కడుంది. జనాభాలో సరిసమానంగా ఉన్న మనం, ఆర్థిక, రక్షణ, టెక్నాలజీలో చైనా కంటే వెనుకబడి ఉన్నాం..దీనికి కారణమెవరు?'

ఓ తెలుగు యూట్యూబ్ వ్లాగర్ అతివాగుడు ఇది. చైనాతో మన దేశం ఆర్థిక, రక్షణ రంగాల్లో ఎదుర్కొంటున్న ముప్పును 'పనికిరాని సొల్లు కబుర్లు..' అంటూ తేలికగా తీసి పారేశాడు. ఒకప్పుడు ఆంగ్లేయ మానసపుత్రులు మన దేశానికి జాడ్యంగా మారితే ఇప్పుడా స్థానాన్ని చైనా ఆక్రమించే ప్రయత్నం చేస్తోంది. భారతీయుల్లో తనవట్ల సానుకూల వాతావరణాన్ని సృష్టించేందుకు ఆ దేశం పన్నుతున్న కుయుక్తులను గమనిస్తే దిమ్మతిరిగే వాస్తవాలు కనిపిస్తాయి.



కొద్ది వారాల క్రితం అన్వేష్ అనే ఈ యూట్యూబర్ చైనాకు వెళ్లి వరుసగా కథనాలను తయారు చేసి వదిలాడు.. 'నేను కమ్యూనిస్ట్ భావజాలాన్ని ఆరాధిస్తాను.. మావోను చాలా ఇష్ట పడతాను... భారతదేశంలో కమ్యూనిజం మాత్రమే మార్పు తీసుకురాగలదని గట్టిగా నమ్ముతున్నాను' అంటూ ఆ వీడియోల్లో చెప్పుకొచ్చాడు. చైనా గురించి ఇలాంటి సానుకూల వీడియోలు తయారు చేయడం ద్వారా 30 లక్షల రూపాయలు సంపాదించాడు.. ఈ విషయాన్ని స్వయంగా చెప్పుకున్నాడు.

ప్రతి దేశానికీ తనదైన అస్తిత్వం, ప్రత్యేకత ఉంటాయి. చైనాలో కమ్యూనిజానికి బాటలు వేసేందుకు నియంత మావో జెడాంగ్ 60 నుంచి 80 లక్షల మంది సొంత ప్రజలను క్రూరంగా చంపేశాడు. తియాన్మెన్ స్క్వేర్‌లో ప్రజాస్వామ్యం కోసం గళమెత్తిన వేలాదిమంది విద్యార్థులపై ట్యాంకులు తోలి దుర్మార్గంగా చంపేసిన దేశం చైనా.. ఇవన్నీ కళ్ల ముందు కనిపిస్తుంటే చైనా గొప్పదనాన్ని పొగిడేందుకు ఆయన వెనుక ఉన్న శక్తులు ఏమిటన్నది తేలికగానే అర్థం చేసుకుకోవచ్చు..

దశాబ్దం కిందట ఆమిర్‌ఖాన్ నటించిన 'పీకే' చైనాలో రూ. 1500 కోట్లు వసూలు చేసింది. ఇదొక ఉదాహరణ. భారత్‌లో అనేక చైనా కంపెనీలు, సంస్థలు వ్యాపారం చేస్తున్నాయి. మన దేశంతో చైనాకు సరిహద్దు వివాదాలు, తగాదాలు ఉన్నాయి. తరచూ చొరబాట్లతో కయ్యానికి కాలుదువ్వడం ఆ దేశానికి ఒక అలవాటుగా మారింది. ఈ అంశం నుంచి భారతీయుల దృష్టిని ఏమార్చేందుకు చైనా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా తమ దేశానికి అనుకూలంగా, మనదేశానికి వ్యతిరేకంగా భారతీయుల ఆలోచనలు, అభిప్రాయాలను ప్రభావితం చేసేందుకు చైనా అనేక కుట్రలను అమలు చేస్తోంది. ఇందుకోసం చైనా భారీ ఎత్తున డబ్బును ఖర్చు చేస్తోంది. ఈ ప్రణాళిక వేర్లు తెలుగు రాష్ట్రాలకు కూడా పాకాయి. అన్వేష్‌లాంటి వారు తెలిసోతెలియకో ఇందులో భాగస్వాములవుతున్నారు.

బయపడిన చైనా కుట్రలు

లా అండ్ సొసైటీ అలయన్స్ సెప్టెంబర్ 3, 2021న విడుదల చేసిన 76 పేజీల అధ్యయన నివేదికలో భారత్‌లోని వివిధ విభాగాలను ప్రభావితం చేయడానికి చైనా అమలు చేస్తున్న పథకాలను చూడవచ్చు. ఇందులో కమ్యూనిస్టులు అనుసరిస్తున్న రహస్య, బహిరంగ కార్యకలాపాలను వివరించారు. జీ జిన్‌పింగ్ నాయకత్వంలోని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా భారతీయ మీడియా, ప్రభావశీల వ్యక్తులు, సంస్థలకు నిధులు సమకూర్చడం, స్పాన్సర్ చేయడం, పెట్టుబడులు పెట్టడం, విద్యార్థి వేతనాలు ఇవ్వడం, వినోద, పర్యాటకరంగాలను ఉపయోగించుకోవడం ద్వారా భారతీయ సమాజంలోకి చొచ్చుకుపోవాలని ప్రయత్నాలు చేస్తోంది. ఇక విద్యాసంస్థలు, మేథోవర్గంపై గురి సరేసరి.

ఢిల్లీలో స్థాపించిన ఒక సంస్థ భారతీయుల్లో చైనా అనుకూల భావాలను నింపేందుకు చురుగ్గా పనిచేస్తోంది. ఈ సంస్థ విద్య, వాణిజ్యం, పర్యాటక

డ్రాగన్‌కు స

రంగాలపై అధ్యయనం పేరుతో కొంతమందిని ఎంపిక చేసి చైనాకు పంపిస్తుంది. అక్కడ 'శిక్షణ' పొందినవారు చైనా ప్రభుత్వం, చైనా కమ్యూనిస్టు పార్టీలకు అనుకూలమైన భావాలను భారత్‌లో వ్యాపించేందుకు శ్రమిస్తారు.

మరోవైపు మే 3, 2023న సెంటర్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్ ప్రోగ్రెస్ ప్రచురించిన మరో నివేదికను కూడా గమనించాలి. దక్షిణాసియాలో తన ఉనికిని పెంచుకునేందుకు అవసరమైన సాధనాలు, నమూనాలు, భాగస్వాములను చైనా ఎలా ఉపయోగించుకుంటోందో ఇందులో చూడవచ్చు. సోషల్ మీడియాను చైనా ఉపయోగించుకుంటున్నదో చెప్పే ఒక అధ్యాయమే చేర్చారు. భారతీయులను లక్ష్యంగా చేసుకుంటూ సాంప్రదాయ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా లాంటి కొత్త వేదికలను ప్రయోగిస్తోంది చైనా కమ్యూనిస్టు పార్టీ. ఒకరకంగా ఇది భారతదేశ సార్వభౌమత్వానికి, ప్రజాస్వామ్యానికి తీరని ముప్పు అంటూ ఈ నివేదిక పేర్కొంది. చైనా ప్రభావాన్ని ఎదుర్కోవడంతో పాటు దేశ ప్రజలను కాపాడుకునేందుకు భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ సూచించింది.

తిరగబడ్డ చైనా కథ

2013లో జిన్‌పింగ్ చైనా అధ్యక్షుడైన తర్వాత 'చైనా కథను చక్కగా చెప్పండి' అంటూ చైనా మీడియా

Shenzhen to beijing travel | Beijing bird's nest stadium

China National Museum in Beijing

712K views • 2 months ago

చైనాని చూసి భారతదేశం ఏమి నేర్చుకోవాలి ? China Vs India...

సోషల్ మీడియా సోకు

సంస్థలను ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా చైనాను గొప్పగా చూపిస్తూ పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సూచించాడు. భారత్‌లో, ప్రపంచవ్యాప్తంగా చైనాకు సానుకూల ప్రచారం చేయాలని చైనా మీడియా సంస్థలను ఆదేశించాడు. భారతదేశంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా లేనందున, ది హిందూ వంటి వార్తాపత్రికలు, ది ప్రింట్, స్క్రోల్, ది వైర్ వంటి వెబ్ పోర్టల్‌లలో చైనా అనుకూల వార్తా కథనాలు ప్రారంభమయ్యాయి.

2002లో రజనీకాంత్ నటించిన 'బాబా' చిత్రంలో ఒక గిరిజన జ్యోతిష్కుడు తన ఫోన్‌ను "ఇట్స్ మేడ్ ఇన్ చైనా, విత్ టచ్ స్క్రీన్" అని పేర్కొన్న టాన్ని డైలాగ్‌తో వినిపించాడు. పెయిడ్ ప్రమోషనా, కాదా తెలియదు, కానీ ఆ దృశ్యంతో చైనీస్ ఫోన్‌లు నాణ్యమైనవి, చౌకైనవి అనే సందేశం సామాన్యుల దృష్టికి వెళ్లింది

డోక్లామ్ వివాదం ప్రారంభమైనప్పుడు మన దేశంలో ఇంటర్నెట్ వినియోగం, సోషల్ మీడియా గణనీయంగా పెరిగింది. 'బాయ్‌కాట్ చైనా' పేరుతో చైనా వస్తువుల బహిష్కరణ ప్రారంభమైంది. ఫలితంగా 'చైనా బజార్' పేరుతో నడిచే కొన్ని వ్యాపారాలు 'ఇండియాబజార్, బాంబే బజార్' లాంటి పేర్లు పెట్టుకోవాల్సివచ్చింది. చైనీస్ తయారీ కంపెనీలు కూడా తమ ఉత్పత్తులను 'మేడ్ ఇన్ చైనా' అని కాకుండా 'మేడ్ ఇన్ పీఆర్‌సీ' లేబుల్‌లతో విక్రయించే పరిస్థితి వచ్చింది. ప్రపంచ వాణిజ్య చరిత్రలో ఏ దేశంకూడా ఇలాంటి నకిలీ పేరుతో వ్యాపారం చేయడంలేదు.

ప్యాంగాంగ్ సరస్సు దగ్గర చైనా సైనికులతో ఘర్షణలో భారతీయ సైనికుల వీర మరణం.. ఒప్పో, వివో చైనా మొబైల్ కంపెనీల ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల నమోదు.. టిక్ టాక్, చైనీస్ లోన్ యాప్‌లపై నిషేధం వంటి సంఘటనలు భారతీయుల్లో వ్యతిరేకతను పెంచాయి. చైనాపై వ్యతిరేకత నేరుగా భారత్‌లోని కమ్యూనిస్ట్ పార్టీలను ప్రభావితం చేసింది. రాజకీయంగా వాటి విశ్వసనీయత క్షీణించింది. అదే సమయంలో చైనాలో భారత ప్రధాని నరేంద్ర మోడీకి 50 కోట్ల మంది అభిమానులు ఉన్నారని ఒక సర్వే చెప్పింది. దీంతో అప్రమత్తమైన చైనా ప్రభుత్వం తమ దేశానికి చెందిన 'విబో' వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో భారతదేశానికి అనుకూలంగా ఉన్న పదహారు లక్షల పోస్ట్‌లను బలవంతంగా తొలగించింది. వీటన్నింటికీ మించి ఐఫోన్, ఫాక్స్‌కాన్ తయారీ యూనిట్లు చైనా నుంచి భారత్‌కి తరలించడం చైనా ప్రభుత్వానికి భారీ ఎదురుదెబ్బ అని చెప్పాలి.

ఈ పరిణామాల తర్వాత చైనా మీడియా మేనేజ్‌మెంట్ కొత్త వ్యూహాల అమలును ప్రారంభించింది. ప్రింట్ మీడియా ప్రభావం తగ్గినందున సోషల్ మీడియాను ఉపయోగించుకుంటోంది. భారతీయ భాషలలో వేలాది పేజీల కథనాలు, వీడియోలు నేరుగా చైనా నుండి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో వెలువడుతున్నాయి. చైనా సాధించిన విజయాలను వివరించే వేలాది యూట్యూబ్ ఛానెల్‌లు ఉన్నాయి. చైనా నుంచి కురిపిస్తున్న సొమ్ముతో ఫేక్ వ్యూలు, ఫేక్ కలెక్షన్లు రావడంలో పెద్దగా ఆశ్చర్యపడాల్సినదేమీ లేదు.

భారత్‌లో కమ్యూనిస్టు పార్టీలను, చైనా కంపెనీలను బలోపేతం చేసి లాభాలను ఆర్జించడం, సరిహద్దు వివాదాల సమయంలో భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారతీయ ప్రజల అభిప్రాయాన్ని ప్రభావితం చేయడం చైనా అసలు లక్ష్యం. ఇది ఇలాగే



కొనసాగితే ఇరవై ఏళ్ల క్రితం అమెరికాలో చైనా ఆడిన ఆటలు మన దేశంలో కూడా పునరావృత్తం అయ్యే ప్రమాదం ఉంది.

అమెరికా మార్కెట్లపై చైనా ప్రభావం

మనం 20 ఏళ్లు వెనక్కి వెళితే.. 2000 నాటికి అమెరికా ప్రపంచానికి ఒక సూపర్ పవర్. చైనా దీన్ని సవాలు చేసింది. అమెరికాకు దీటుగా చైనా ఆర్థిక, వాణిజ్య, ఆయుధ రంగాలలో ఎదిగేందుకు ప్రణాళికలు రూపొందింది. చైనా కమ్యూనిస్ట్ పార్టీ మీడియా మేనేజ్‌మెంట్‌లో భాగంగా హాలీవుడ్ చిత్రాలకు పరోక్షంగా నిధులు సమకూర్చారు. ప్రధానంగా 'జాకీ చాన్', 'జెట్ లీ' వంటి హీరోలతో చైనీస్ పాత్రలు, స్క్రిప్ట్‌లు రూపొందించారు. 'షాంఘై నూన్', 'రష్ అవర్' వంటి అనేక హిట్ సినిమాల ద్వారా అమెరికన్ పెట్టుబడిదారులు కమ్యూనిస్ట్ చైనాపై కల దృక్పథాన్ని చెరిపివేసి, అమెరికా-చైనా భాయ్ భాయ్ అనే భావనను పరోక్షంగా నాటారు.

నాటి అమెరికా అధ్యక్షుడు ఒబామాను మన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో పోల్చవచ్చు. ఆయన తన పరిపాలనలో అమెరికాలో అవుట్ సోర్సింగ్ ప్రోగ్రామ్‌కు తలుపులు తెరిచారు. ఒక రకంగా ఒబామా చైనా రివర్స్ ఇంజనీరింగ్, కాపీరైట్ ఉల్లంఘన, డిజైన్ దొంగతనాలకు పరోక్షంగా సహకరించారు. ఫలితంగా మొబైల్ ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లతో సహా మొత్తం తయారీ రంగంలో చైనా ఆధిపత్యం ప్రారంభమైంది.

నోకియా, బ్లాక్‌బెర్రీ, మోటరోలా వంటి మొబైల్ దిగ్గజాలు మాత్రమే ప్రముఖ బ్రాండ్‌లు. తరువాత మోటరోలాను చైనీస్ కంపెనీ 'లెనోవా' స్వాధీనం చేసు కుంది. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న హాలీవుడ్ సినిమాల్లో ప్రధాన పాత్రలు చైనీస్-బ్రాండ్ ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను ఉపయోగి స్తున్నట్లు చూపిస్తున్నారు.

చైనా ప్రాయోజిత పర్యటన

కరోనా కారణంగా ప్రపంచవ్యాప్తంగా చైనాపై విశ్వసనీయత దెబ్బ తిన్నది. ఈ నేపథ్యంలో తన పరపతిని పెంచుకోవడానికి ట్రావెల్ వ్లాగర్లను ఉపయో గించుకుంటోంది. ఇందులో భాగంగానే అన్వేష్ లాంటి కొంతమంది భారతీయ యూట్యూబ్ వ్లాగర్లు చైనాలో పర్యటించారు. చైనాలో నివసిస్తున్న కొంతమంది భారతీయులు ఇప్పటికే భారతీయ భాషలలో యూట్యూబ్ వ్లాగ్‌లను తయారు చేస్తు న్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే భారతీయ జర్నలిస్టులు తమ దేశంలో పర్య టించేందుకు వీసా ఇవ్వడానికి చైనా నిరాకరిస్తుంది. కానీ యూట్యూబ్ వ్లాగర్‌లకు మాత్రం అనుమతి ఇస్తోంది. వీరు అక్కడికి వెళ్లి భారత్ కన్నా చైనాలోనే మెరుగైన పరిస్థితులు, విధానాలు ఉన్నాయనే అభిప్రాయాన్ని వ్యాపించేందుకు ప్రయత్నిస్తున్నారు.

అన్వేష్ కరోనా మహమ్మారి పుట్టిన వుహాన్‌కు కూడా వెళ్లాడు. అక్కడ స్వేచ్ఛగా తిరుగుతూ చైనా పట్ల సానుకూల దృక్పథాన్ని ఏర్పరచాడు. ఇది ఒకరకంగా వుహాన్ ఫిష్ మార్కెట్, అక్కడి ల్యాబ్‌ను సందర్శించేందుకు అనుమతి నిరాకరణను ఎదు ర్కొన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ శాస్త్రవేత్తలను అపహాస్యం చేయడమే అవుతుంది. చైనా ప్రభుత్వం తన సొంత పౌరులను అణిచివేస్తున్న తీరును టిబెటన్ బౌద్ధులు, వీయిగర్ ముస్లింలపై జరుపుతున్న దురాఘాతాలను అన్వేష్ తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేశాడు. తియాన్మెన్ స్క్వేర్ ప్రాంతాన్ని చూపుతున్నప్పుడు, దాని చరిత్ర గురించి చర్చించవద్దని చైనా అధికారులు తనను ఆదేశించా రని అంగీకరించాడు.

భారత రాజకీయాలు, సాంస్కృతిక వారసత్వం, సామాజిక వ్యవస్థ, పేదరికం, సంపద పంపిణీ, రాజ్యాంగం, రిజర్వేషన్ల వ్యవస్థమీద అన్వేష్ చేసిన వ్యాఖ్యలు ఆయనకు గల 'సున్నా' పరిజ్ఞానాన్ని బయట పెట్టాయి. అనుమతి నిరాకరించిన చైనాను శత్రు దేశంగా భావించడాన్ని అన్వేష్ తప్పు పట్టాడు. చైనా మన శత్రువు అని మనకు సరిగ్గా ఎవరు చెప్పారు? మోడీనా.. అమిత్ షా? వంటి ప్రశ్నలను ఆయన సంధించారు. తన వ్యాఖ్యల్లో జగన్, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల పేర్లు ప్రస్తావించారు.

సీపీఎంవారి తెలుగు దినపత్రిక 'నవ తెలంగాణ' అన్వేష్ 'ప్రపంచ యాత్రికుడు' పేరుతో రూపొం దించిన చైనా ట్రావెల్ సిరీస్‌ను ప్రశంసిస్తూ జులై 23న ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. అన్వేష్ భారత రాజకీయాలు, నాయకత్వాన్ని విమర్శిస్తూ వ్యంగ్యంగా మాట్లాడాడు. ఇది ఉద్దేశ్యపూర్వకంగా రూపొందిం చిన స్క్రిప్ట్‌లా కనిపిస్తోంది. ఇదంతా చైనా కమ్యూనిస్టు నాయ కత్వంపై, అక్కడి మౌలిక సదుపాయాలపై సానుకూల అభిప్రాయాన్ని ఏర్పరచడానికి చేపట్టిన కుట్రలో భాగమా అనే అనుమానాన్ని బలపరుస్తుంది.

చైనా ప్రభుత్వం సాధారణంగా విదేశీ పర్యాటకు లపై గట్టి నిఘా పెడుతుంది. అన్ని ప్రాంతాలకూ వెళ్లకుండా పరిమిత ప్రదేశాలకే అనుమతిని ఇస్తుంది. అయితే అన్వేష్ తన గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి నిషేధిత ప్రాంతాల్లో పర్యటించడం, డ్రోన్ ఎగరవేయడం గమనిస్తే ఇది కచ్చితంగా స్పాన్సర్డ్ కార్యక్రమమేనని స్పష్టంగా అర్థమైపోతోంది. ఇది వాస్తవం కాదంటే భద్రతా చట్టాలను ఉల్లంఘించినందుకు అన్వేష్‌ను అరెస్టు చేసి ఉండాలి. అది జరగనందునే అనుమా నాలు బలపడ్డాయి.

చైనాలో విదేశాలకు చెందిన సోషల్‌మీడియా యాప్స్ మీద నిషేధం ఉంది. మరి మన యూట్యూ బర్లు అక్కడి నుంచి వీడియోలు ఎలా అప్‌లోడ్ చేయ గలుగుతున్నారు?

త్వరలో భారతదేశంలో సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. ఈ నేపథ్యంలో భారతదేశ రాజకీయా లను ప్రభావితం చేసేందుకు చైనా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది.. ఇక్కడ తమకు అనుకూలమైన ప్రభుత్వం రావాలని ఆరాటపడుతోంది. ఇందులో భాగంగానే చైనా ఇలాంటి కుట్రలకు తెరలేపిందనే వాస్తవాన్ని ప్రతి భారతీయుడు తెలుసుకోవాలి. అదే సమయంలో ఇలాంటి కుట్రల్లో తెలిసోతెలియకో భాగస్వాములు కాకుండా జాగ్రత్తపడాలి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

భారత క్రీడారంగంపై మోదీ ముద్ర

కేంద్ర ప్రభుత్వ సమగ్రక్రీడావిధానం, నరేంద్రమోదీ దార్శనికతతో భారత క్రీడారంగం కొత్తపుంతలు తొక్కుతోంది. వివిధ క్రీడల్లో అరడజనుకుపైగా ప్రపంచ చాంపియన్లతో కళకళలాడుతోంది. భారత్ క్రీడాపరంగా గత కొన్ని దశాబ్దాలుగా సాధించలేని ప్రగతిని, ఫలితాలను గత ఏడు సంవత్సరాల కాలంలో నమోదు చేసింది. మోదీకి క్రీడలన్నా, క్రీడాకారులన్నా చెప్పలేని మక్కువ. తమ త్యాగాలు, నిరంతర సాధనతో దేశానికి బంగారు పతకాలతో పాటు ఖ్యాతి తెచ్చేవారిని అడుగడుగునా వెన్నుతట్టి ప్రోత్సహించడం, ప్రోత్సాహకాలు అందించడంలో మోదీ తర్వాతే ఎవరైనా.

మోదీ ప్రధానిగా రాకముందు వరకూ వివిధ పేర్లతో ఉన్న క్రీడాపథకాలన్నింటినీ 'ఖేలోఇండియా' పేరుతో మిళితం చేసి, ప్రత్యేకంగా నిధులు కేటాయించడం ద్వారా ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను విశ్వవిజేతలుగా తీర్చిదిద్దటంలో సఫలమయ్యారు. మోదీ ప్రభుత్వానికి ముందు వరకూ భారత్ అత్యధిక మంది ప్రపంచ చాంపియన్లను తయారుచేసిన క్రీడ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ మాత్రమే. విశ్వనాథన్ ఆనంద్ పుణ్యమా అంటూ చదరంగ క్రీడ, అభినవ్ భింద్రాతో షూటింగ్‌లో మేరీకోమ్ ప్రతిభతో మహిళల బాక్సింగ్ లోనూ భారత్ తరపున అతికొద్దిమంది మాత్రమే విశ్వవిజేతలు వెలుగులోకి వచ్చారు. టీమ్ గేమ్స్‌లో మాత్రం హాకీ, క్రికెట్ లాంటి క్రీడల్లో భారత్ ప్రపంచ చాంపియన్‌గా నిలువ గలిగింది. మోదీ హయాంలోనే అథ్లెటిక్స్, విలువిద్య, కుస్తీ, షూటింగ్ క్రీడల్లో విశ్వ విజేతలను, చదరంగ క్రీడలో ప్రజ్ఞానంద్ లాంటి రజత విజేతలను భారత్ తయారు చేయగలుగుతోంది.

అనతికాలంలోనే విశ్వవిజేత నీరజ్ చోప్రా..

ట్రాక్ అండ్ ఫీల్డ్ వ్యక్తిగత విభాగంలో ఒలింపిక్స్, ప్రపంచ బంగారు పతకాలు సాధించిన ఒకే ఒక్క భారత అథ్లెట్ నీరజ్ చోప్రా. టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతకంతో సరికొత్త చరిత్ర సృష్టించిన నీరజ్ పాతికేళ్ల వయసుకే ప్రపంచ పోటీల స్వర్ణ, రజత, ఒలింపిక్స్ బంగారు, ఆసియాక్రీడలు, కామన్వెల్త్ గేమ్స్,డైమండ్ లీగ్ స్వర్ణ పతకాలతో భారత్ ఖ్యాతిని ఎవరెస్టు ఎత్తుకు చేర్చాడు. హంగెరీ రాజధాని బుడాపెస్ట్ వేదికగా ఇటీవలే ముగిసిన 2023 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్షిప్ పురుషుల జావలిన్ త్రోలో అలవోకగా బంగారు పతకంతో విశ్వవిజేతగా నిలిచాడు. భారత క్రీడాచరిత్రలో వ్యక్తిగత విభాగంలో విశ్వవిజేతగా నిలిచిన రెండో అథ్లెట్‌గా నీరజ్ చోప్రా రికార్డుల్లో చేరాడు. షూటర్ అభినవ్ భింద్రా తొలి అథ్లెట్ కాగా.. నీరజ్ చోప్రా ఆ తర్వాతి స్థానంలో నిలిచాడు.

క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

17 ఏళ్లకే విలువిద్య ప్రపంచ విజేత...

ఇతిహాస క్రీడ విలువిద్యలో విశ్వవిజేతగా నిలవాలంటే వయసు, అనుభవంతో ఏమాత్రం పనిలేదని 17 ఏళ్ల మరాఠీ ఆర్చర్ ఆదితీ చాటి చెప్పింది. బెర్లిన్ వేదికగా ముగిసిన 2023 ప్రపంచ విలువిద్య పోటీల వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం సాధించడం ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రపంచ విలువిద్య పోటీల టీమ్, వ్యక్తిగత విభాగాలలో జంట స్వర్ణాలు సాధించడం ద్వారా అరుదైన ఘనతను సొంతం చేసుకొంది. విలువిద్య మహిళల విభాగంలో భారత పతాకాన్ని రెపరెపలాడిస్తూ వచ్చిన దిగ్గజాలు డోలా బెనర్జీ, దీపికా కుమారి, బాంబ్యేలాదేవి, ముస్కాన్ కిరార్, లక్ష్మీరాణి మాజీ, రాజ్ కౌర్ సాధించలేని ఘనతను మరాఠీ మొలక ఆదితీ గోపీచంద్ స్వామి చిన్నవయసులోనే సాధించింది. పురుషుల వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం సాధించిన మొనగాడిగా భారత్‌కే చెందిన ఓజాస్ ప్రవీణ్ డియోటేల్ నిలిచాడు. స్వర్ణపతకం పోరులో పోలెండ్‌కు చెందిన లూకాస్‌ను ఒకే ఒక్క పాయింట్ తేడాతో ఓడించి విశ్వవిజేతగా నిలిచాడు. ప్రపంచ విలువిద్య కాంపౌండ్ విభాగం పురుషుల, మహిళల విభాగాలలో భారత ఆర్చర్లు.. మూడు బంగారు పతకాలు సాధించడం ఇదే మొదటిసారి.

అంతర్జాతీయ బాక్సింగ్ పురుషుల విభాగంలో భారత బాక్సర్లు సాధించలేని విజయాలను మహిళలు సాధిస్తూ దేశానికే వన్నె తెస్తున్నారు. భారత మహిళా బాక్సింగ్ అంటే గతేడాది వరకూ కేవలం మేరీకోమ్ పేరు మాత్రమే వినిపించేది. ఆమె వారసులుగా నలుగురు బాక్సర్లు తెరమీదకు వచ్చారు. న్యూఢిల్లీ వేదికగా ఇటీవలే ముగిసిన 2023 ప్రపంచ మహిళా బాక్సింగ్ టోర్నీలో మొత్తం 10 విభాగాలలో టైటిల్స్ కోసం పోటీ జరిగితే నాలుగు విభాగాలలో భారత బాక్సర్లు (నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గెయిన్, నీతూ గంగాస్, సవీటీ బూరా) బంగారు పతకాలు గెలుచుకొని 19 సంవత్సరాల క్రితం నెలకొల్పిన రికార్డును సమం చేయగలిగారు.

నాడు ఆనంద్.. నేడు ప్రజ్ఞానంద్

అంతర్జాతీయ చదరంగ క్రీడలోకి భారత దిగ్గజ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ వారసులుగా ఒకరు కాదు..ఇద్దరు కాదు..ఏకంగా నలుగురు మెరికల్లాంటి టీనేజ్ గ్రాండ్మాస్టర్లు తెరమీదకు వచ్చారు. అజర్ బైజాన్ రాజధాని బకూ వేదికగా జరిగిన 2023 ప్రపంచకప్ చదరంగ టైటిల్ పోరులో భారత యువగ్రాండ్ మాస్టర్, 18 సంవత్సరాల ప్రజ్ఞానంద్ సైనల్స్ చేరటమే కాదు. .టైటిల్ పోరులో ఐదుసార్లు విశ్వవిజేత, సూపర్ గ్రాండ్ మాస్టర్ మాగ్నస్ కార్ల్ సన్‌తో తుదివరకూ పోరాడి రజత పతకంతో నిలిచాడు.ప్రపంచకప్ రన్నరప్ గా నిలవడం ద్వారా 2024 ప్రపంచ క్యాండిడేట్స్ టోర్నీకి ప్రజ్ఞనంద్ అర్హత సంపాదించాడు. కెనడాలోని టొరాంటో వేదికగా వచ్చే ఏడాది ఏప్రిల్ 2 నుంచి 25 వరకూ ఈ టోర్నీ నిర్వహిస్తారు. ప్రపంచకప్ రజతంతో స్వదేశానికి తిరిగి వచ్చిన ప్రజ్ఞానంద్ కుటుంబ సభ్యులను తన నివాసానికి సాదరంగా ఆహ్వానించి మరీ మోడీ అభినందించారు. ★

రైల్వేబోర్డు... జయావర్మ సిన్హా... ఈ రెండు పేర్లూ ఇప్పుడు మారు మోగుతున్నాయి. భారతీయ రైల్వేది అనేక దశాబ్దాల చరిత్ర. ప్రపంచ స్థాయిలో అతిపెద్ద వ్యవస్థగా ప్రఖ్యాతి. అమెరికా, రష్యా, చైనావంటి అగ్రదేశాలతో సరిపోల్చదగిన అత్యంత భారీ సంస్థ. మన కేంద్ర ప్రభుత్వంలోని అత్యంత కీలక శాఖ. దేశవ్యాప్తంగా వేలాది స్టేషన్లు, వాటి ద్వారా నిత్యమూ కోట్లమంది ప్రయాణి కుల రాకపోకలు. నిరంతరం వారందరి భద్రతకే పెద్దపీట. ప్రయాణాలకు, వస్తు రవాణాకు సమధిక ప్రాధాన్యం. మొత్తం మీద 170 సంవత్సరాల సుదీర్ఘ పయనం. ఇంకా ధాటిగా చెప్పాలంటే – జాతి జీవరేఖ రైల్వేశాఖ, విధి విధానాలు, నిర్దేశిత లక్ష్యాలతో అలుపూ సొలుపూ తెలియనంత యాత్ర! ముందుగా సంస్థాగతమైన సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ. దాని కొనసాగింపుతో సురక్షణ సాధించడం అనంతర ధ్యేయం. అంటే శాస్త్రీయతా కల్పన, భద్రతాసాధన.

రైల్వేకి

రైల్వే శిఖరాగ్రంగా పేరొందిన బోర్డు తరచుగా నివేదికలను భారతీయ మంత్రిత్వశాఖకు పంపు తుంటుంది. ప్రధాన కార్యాలయముంది దేశ రాజధాని నగరంలోనే. ప్రయాణికులకు సేవలు, ఛార్జీలకు సంబంధించిన సర్వీసులు, అనుబంధ రవాణా ప్రక్రియలు, ట్రావెల్ ఏజెన్సీ కార్యకలాపాలు, ఇతర పనులన్నీ బోర్డు పరిధిలోనివే. అధ్యక్షుడు / అధ్యక్షురాలితోపాటు కార్యదర్శి; అదే విధంగా ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ట్రాఫిక్ వరంగా సభ్యులుంటారు. స్టాఫ్ తరఫున ఒకరు, ఫైనాన్స్ కమిష నర్‌గా ఒకరు విధులు నిర్వర్తిస్తుంటారు. భద్రత, మార్కెటింగ్ విభాగాల పనులు పర్యవేక్షకులూ పనిచేస్తుంటారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన కొన్ని ఏళ్ల వరకు చీఫ్ కమిషనర్ పాత్ర ఉండేది కానీ, అటు తర్వాత లేదు. బోర్డు ప్రతినిధుల సంఖ్యనీ ఆనాడే కుదించారు. విధాన నిర్ణయాలు, సాంకేతిక అంశాల వరంగా బాధ్యతలను అప్పగించి; కాలక్రమంలో బోర్డును విస్తరించారు. అధికారిక వెబ్‌సైట్‌లోని సమాచారమంతటినీ నవీకరిస్తుంటారు. సమస్యల పరిష్కార సమాచారం, సవాళ్లు – వాటిని ఎదుర్కొంటున్న విధానం, అభివృద్ధి కార్యక్రమాల సమగ్రవివరణ, సవాళ్లు – వాటిని ఎదుర్కొంటున్న విధానం, అభివృద్ధి కార్యక్రమాల సమగ్రవివరణ, రైల్వే టూరిజం, ముఖ్యమైన డాక్యుమెంట్ల వివరణ మంతటినీ ప్రదర్శిస్తుంటారు. ఉద్యోగ వివరం, బోర్డు తీర్మానాలు, ఇంకా ఎన్నెన్నో అంశాలను రైల్వే బోర్డు తరఫున పొందుపరుస్తుంటారు. క్విక్‌లింక్స్ నిర్వహణ మరొక విధి. ఈ అంశాలన్నింటినీ ప్రస్తావిస్తున్నపుడు సహజంగానే మన మదిలో దక్షిణ మధ్య రైల్వే మెదులుతుంది. విశిష్టమైన ఈ జోన్ ఏర్పాటై వచ్చే అక్టోబరు నాటికి ఐదున్నర దశాబ్దాలకు పైనే అవుతుంది. దీని నియంత్రణలోనే పలు విభాగాలు, ఇవి ఉభయ తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతోపాటు కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలకు సంబంధించిన ప్రాంతాలు. ఇదే జోన్‌లోని రైల్వేస్టేషన్లు అనేకం. ఈ సమాచార దర్శినిలో రైళ్ల రాకపోకల సమయాలు, నిర్ణీత స్టేషన్లు, సీట్ల లభ్యతలు, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు వివరాలు, ఆర్థిక, సాంకేతిక విషయాలెన్నో పొందుపరిచి ఉండటం కనిపిస్తుంది. ఇలా అనేకానేక పనుల్ని సమన్వయం చేయాల్సిన బోర్డు ఛైర్‌పర్సన్ కర్తవ్యాలంటే మాటలా? దీక్షాదక్షతలన్నవారికే సుసాధ్యం.

ఆకట్టుకున్న శైలి

బోర్డు ఛైర్‌పర్సన్, ప్రధాన కార్యనిర్వహణ అధికారిణిగా జయను నియమించడం ఎంతైనా విశేషం. మొత్తం బోర్డు చరిత్రలోనే ఈ ప్రధాన పదవిని పొందిన మహిళామణి ఆమె. ఇప్పటికే అధికార బాధ్యతలు చేపట్టారు. 2024 ఆగష్టు నెలాఖరువరకు విధులు నిర్వహిస్తారు. తన నియమానికి కేంద్ర క్యాబినెట్ నియామకాలు కమిటీ ఆమోదముద్ర వేసినప్పుడు, అందరూ హర్షించారు.

జయావర్మ భారతీయ రైల్వే మేనేజిమెంట్ సర్వీసెస్‌కి చెందినవారు. ఇప్పటివరకు ఆపరేషన్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ పరంగా రైల్వేబోర్డు సభ్యురాలిగా ఉంటూ వచ్చారు. ఇంతదాకా సీఈవోగా ఉన్న అనిల్ స్థానాన్ని జయ భర్తీ చేసినట్లయింది. నిర్ణాయక శక్తికి పేరు గడించిన ఈ వనిత అలహాబాద్ విశ్వవిద్యా లయంలో చదువుకున్నారు. 1998లోనే భారతీయ రైల్వే ట్రాఫిక్ సర్వీసులో చేరారీమె. అంతేగాక; వివిధ జోన్లలో పలు హోదాల్లో పని చేశారు. స్వదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ సేవ లందించిన వ్యక్తి. మునుపు బంగ్లాదేశ్‌లోని భారత హై కమిషన్‌లో రైల్వే సలహాదారుగా ఉన్న అనుభవశీలి. అక్కడ విధులు నెరవేరుస్తూ ఉన్న తరుణంలోనే మైత్రీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం అయింది. అది ఇక్కడి కోల్‌కతా నుంచి అక్కడి ఢాకాకు ప్రయాణం. ఆ సందర్భంలో జయ ఎంతగానో పరిగణన అందుకోగలిగారు. ఆమెను దేశప్రజలంతా ప్రసార సాధనాల్లో చూసింది గత జూన్ ప్రాంతంలో. ఆ సమయంలోనే ఒడిశాలో సంభవించిన రైలు ప్రమాదం ప్రతీ ఒక్కరికీ గుర్తుండే ఉంటుంది. అదే సంఘటన పూర్వాపరాలు, ప్రభుత్వం

వి'జయ'సారథి

జంధ్యాల శరత్‌బాబు

సీనియర్ జర్నలిస్ట్

దీనికోసమే లక్షలాది సిబ్బంది ఉన్నారు. ప్రణాళికలు, కార్యాచరణలు అసంఖ్యాకంగా రూపొందిస్తున్నారు. ఆశించిన మార్పుచేర్పులను నిర్ణీతకాలంలో సాకారం చేసుకోవాలంటే, దృఢతర నిర్వాహక బృందం అత్యవసరం. అందుకే రైల్వేబోర్డు. ఉద్యోగుల సంఖ్య, కంప్యూటర్ వినియోగ సామర్థ్యంపైన చూపులన్నీ కేంద్రీకృతమై ఉంటాయి. పరిపాలనా సౌలభ్యం కోసమే జోన్ల వారీగా వర్గీకరణ. ప్రతీ ప్రాంతీయ విభాగం నిర్వహణలోని ప్రాంతాలను డివిజన్లుగా ఏర్పాటు చేయడం మరో ప్రత్యేకత. అలా దేశమంతటా కలిపి ఎన్నెన్నో డివిజన్లు. అన్ని విధాలా ప్రాముఖ్యమున్న రైల్వేబోర్డుకి శతాబ్ద కాలం తర్వాత తొలి అధ్యక్షురాలు జయ. ఈ కారణంగానే ఇవే పేర్లు ఇప్పుడు ప్రతిధ్వనిస్తున్నాయి మరి.

తీసుకున్న చర్యలు, అందచేసిన సహాయాలు, చేపట్టిన నిర్ణయా లన్నింటినీ తానే విలేకరుల ముందు ఉంచారు. వీటన్నింటి నేపథ్యంలో సరికొత్త నియామకం ఎందరెందరి దృష్టినో ఆకట్టుకుంది. తానే రైల్వేబోర్డుకు పరిపాలనాధినేత్రి. తానే రైల్వే మంత్రిత్వశాఖకు సంబంధించినంతవరకు ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ. శాఖలో మూడున్నర దశాబ్దాల సేవకు ప్రతిఫలమా అన్నట్లు ఇప్పుడు ఈ నూతన పదవిని స్వీకరించారు.

అనుభవాల ప్రాతిపదికగా...

ఉత్తరప్రదేశ్‌లోని మహానగరం ప్రయాగరాజ్. జనసంఖ్యలో అధికం, అభివృద్ధిలో ప్రధానం. విద్య, సాంస్కృతిక రంగాలకు ఆలవాలం. అదే జయవర్మ స్వస్థలం. పాఠశాల విద్య నుంచి పోస్టుగ్రాడ్యుయేషన్ స్థాయివరకు అక్కడే. ఆమె తండ్రి ప్రభుత్వ ఉన్నతాధికారి. ఆమె సోదరుడు సైతం ఉన్నత స్థాయి అధికారే. సైకాలజీ చదువుకున్న జయ అటు తర్వాత ఉద్యోగ పర్వంలో భాగంగా, కాన్పూర్ సెంట్రల్ స్టేషనులో అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్‌గా ఎంపికయ్యారు. రైల్వే బోర్డులో మొదటి మహిళా సభ్యురాలిగా విజయలక్ష్మి ఉండేవారు. అయితే మొదటి అధ్యక్షురాలి స్థానం మాత్రం జయనే వరించింది. గత అనుభవాలు, నేర్చుకున్న అంశాలు, తెలుసుకున్న సరికొత్త సమాచారాల ప్రాతిపదికగా ఆమె ఈ మధ్య వ్యక్తపరచిన అభిప్రాయాలు ఇవీ;

* వనితాశక్తికి సరిహద్దులు లేవు. వాటిని ఎవరూ నిర్ణయించలేరు కూడా. నిర్దేశించడమూ సాధ్యం కాదు ఎవరికీ.
* విధి నిర్వహణ పట్ల అంకిత భావం సహజంగానే స్త్రీలలోనే ఎక్కువ. చిత్తశుద్ధితోపాటు నిజాయతీ, అవసరమైతే ఎటువంటి పరిస్థితినైనా ఎదిరించి నిలిచి గెలవడం వారికి బాగా తెలుసు.
* అవకాశాలు ఉండాలేగానీ, వేదికలు లభించాలే కానీ స్త్రీ శక్తి తప్పకుండా ప్రస్ఫుటమవుతుంది. అది ఎప్పుడూ కాంతిమంతమే.
* రైల్వే బోర్డులో ప్రధానంగా కావాల్సింది నిర్ణయశక్తి. ఆచరణకు వీలుగా, సహకార సమన్వయాలనూ పెంపొందించాల్సి ఉంటుంది. అదంతా నాకు ఇప్పుడు ఒక అవకాశంగా లభించింది.
* క్షేత్రస్థాయి సమస్యలు, ఇతర స్థితిగతులు తెలుసుకోగలిగాను. వాటిమీద ఒక అవగాహన అయితే నాకు ఉంది. పరిష్కార దిశలో ఎటువైపు నుంచి ఏఏ అవరోధాలు వస్తాయన్నదీ ఇప్పటికే గ్రహించగలిగాను. తెలుసుకుంది ఆచరించడమే ఇక జరగాలి.
* వ్యవస్థలోని లోటుపాట్లు, బలహీనతలు తెలియనివేమీ కావు. ఒక ఉన్నతాధికారిణిగా, సంస్థ అధ్యక్షురాలిగా వాటి వివరాలను సభ్యుల నుంచి, ఇతర విభాగాల నుంచి ఆహ్వానిస్తాను. అన్ని కోణాల నుంచీ ఆలోచించి, ఏ సమస్యకి ఎటువంటి పరిష్కారం చేయాలన్నది ఆలోచించుకుంటాను. స్వయం నిర్ణయానికే ప్రాముఖ్యం. అదే సందర్భంలో వివిధ వర్గాల అభిప్రాయాలనీ పరిగణనలోకి తీసుకుంటాను.
* పరిధిలో తీసుకునే నిర్ణయాలు ఎటూ ఉంటాయి. ఒక్కోసారి; వాస్తవ పరిస్థితులు, మారుతున్న రీతుల ఆధారంగానూ నిర్ణయాలను మార్చుకోవాల్సి వస్తుంటుంది. అందుకు నేనేమీ వెనకాడను. రైల్వే బోర్డు అంతిమ లక్ష్యం – ప్రజా ప్రయోజనాల పరిరక్షణ. అభివృద్ధి, సంక్షేమం సమతూకంగా ఉండేలా నా వంతు ప్రయత్నాలను నేను తప్పక చేస్తాను.

స్థిరమైన నిశ్చయం, దృఢమైన కార్యశీలత నిండిన జయవర్మ అంతరంగ తరంగాలే అవన్నీ! అన్నీ నెరవేరతాయని, ఆమె సారథ్యంలో రైల్వే జీవన రేఖ మరింత కాంతివంతమవుతుందని మన మందరం కూడా ఆశించవచ్చు. ★

'కార్టూన్ పోటీ - 2023'లో సాధారణ ప్రచురణకు ఎంపికైనది



తెలుసుకుందాం

దక్షిణేశ్వర కాళికాలయం - కోల్‌కతా

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో హుగ్లీ నదీతీరాన ఈ ఆలయం కొలువుదీరింది. ఈ ఆలయంలో కాళికాదేవి భవతారిణి అమ్మవారిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. 1847లో రాణి రాస్మణి అనే భక్తురాలు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి.

కథ | అది నక్క సహజ లక్షణం!

ఒకసారి నక్కకి ఒక ఆలోచన వచ్చింది. అందరూ తనను నమ్మేలా చేసుకోవాలని అనుకుంది. కనిపించిన ప్రతి జంతువుకు తనను నమ్మమని చెప్పింది కానీ, ఏదీ దాన్ని నమ్మలేదు.

ఓసారి దానికి ఆడవిలో ఒక ముని కనిపించాడు. నక్క వినయంగా ఆయనకు నమస్కరించింది.

'స్వామీ! అదేమిటో కానీ నన్ను ఎవరూ నమ్మడం లేదు. ఏం చెప్పినా సందేహిస్తున్నారు. ఈ పరిస్థితిని మీరే మార్చాలి' అంటూ ప్రాధేయపడింది.

ఆ ముని ఆలోచించి, 'నీ బాధ నాకు అర్థమైంది. మరి నేను చెప్పినట్టుచేస్తావా?' అన్నాడు.

'సెలవియ్యండి స్వామీ' అంది నక్క మరింత వినయంగా.

'ఇక్కడకు తూర్పు దిక్కున కొద్ది దూరంలోని కొలను పక్క గుహలో ఓ చిన్న మేకపిల్ల ఉంది. పాపం దానికి ఎవరూ లేరు. నేను తిరిగి వచ్చేవరకు దాన్ని జాగ్రత్తగా కాపాడితే.. నిన్నొక మంచి జంతువుగా లోకమంతా పొగిడేలా వరం ఇస్తా' అని చెప్పాడు.

'అలాగే' అంటూ కొలను వైపు పరుగెత్తింది నక్క.

మూడు రోజుల తరువాత ఆ ముని తిరిగి వచ్చాడు. మునిని అల్లంత దూరం నుంచి చూస్తూనే నక్క ఎంతో భక్తితో ఎదురువెళ్లి నమస్కారం చేసింది.

'ఏం నక్కా? మేకపిల్ల క్షేమమే కదా?' అని అడిగాడు ముని.

'మీ కోసమే ఎదురు చూస్తున్నాను మునీశ్వరా! మీరు వెళ్లగానే పరుగు పరుగున వచ్చి ఇక్కడ గుహంతా వెదికాను. ఎటు తప్పిపోయిందో పాపం. మేకపిల్ల కనిపించలేదు. మీరొచ్చాక ఈ విషయం చెబుదామని ఇక్కడే ఉన్నాను' అంది వంచిన తల ఎత్తకుండా.

'నువ్వు చెప్పేది నిజమేనా?' అని అడిగాడు.

'అదేంటి స్వామీ మీరు కూడా నన్ను అనుమానిస్తున్నారా?' అంది నక్క బిక్క మొహం పెట్టి.

ఇంతలో పక్కనున్న పొదలోంచి ఓ కుందేలు చెంగుమంటూ వచ్చింది. 'స్వామీ! ఈ నక్క అబద్ధం చెపుతోంది. ఇదే మేకపిల్లను చంపి తినేసింది. ఇప్పుడు ఏమీ తెలియనట్టు నటిస్తోంది' అంటూ తుర్రుమంది.

ముని కోపంతో కన్నెర్ర జేశాడు. 'నువ్వేం చేశావో నేను ముందే దివ్యదృష్టితో

పద్యము

మిరెము గింజ చూడ మీద నల్లగనుండు
కొఱికి చూడ లోనఁజుఱు మనును
సజ్జనులగువారి సార మిట్లుండురా
విశ్వదాభిరామ! వినుర వేమ!

భావం : మిరియము గింజ పైకి చూచినచో నల్లగా యున్ననూ, కొరికి చూచినచో కారంగా మంటగా ఉండును. ఆ విధంగానే మంచివాడు పైకి చూచుటకు అలంకారములు లేకపోయిననూ, లోపల హృదయమునందు మేధాసంపత్తి నిండియుండును అని భావం.

శ్లోకము

శీలం సర్వత్ర వైధనమ్

విదేశేషు ధనం విద్యా వ్యసనేషు ధనం మతిః
పరలోకే ధనం ధర్మః శీలం సర్వత్ర వైధనమ్

భావం: పరదేశంలో విద్య ధనంతో సమానం. కష్ట కాలంలో సదాలోచనే ధనం. పరలోకాలలో ధర్మమే ధనం. శీలవంతులు సర్వత్రా గౌరవం పొందుతారు.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

శక్తి	ఉద్యోగం
పక్షి	గొడవ
కలహం	ప్రతిష్ట
కీర్తి	సత్తువ
రీతి	పక్కి
కొలువు	విధము

నిర్వహణ : నయనశ్రీ

భారత స్వాతంత్ర్య సమరయోధులు

యోగేష్ చంద్ర ఛటర్జీ

యోగేష్ చంద్ర ఛటర్జీ (1895-1960) పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు. బెంగాల్ అనుశీలన్ సమితిలో క్రియాశీలకంగా పనిచేశారు. ఛటర్జీ.. 1924లో స్థాపించిన హిందుస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులు కూడా. 1926లో కకోరి కేసులో పదేళ్లు జైలు శిక్ష అనుభవించారు. జైలు నుండి వచ్చిన తర్వాత తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశారు.

తెలుసుకున్నాను. నిజానికి ఆ మేక పిల్లని సృష్టించింది నేనే. నీ మీద కుందేలును కాపలాగా పెట్టింది కూడా నేనే. నీ స్వభావం ఎలాంటిదో నీకు తెలియాలనే ఇలా చేశాను. నీకిచ్చిన అవకాశాన్ని నువ్వు పోగొట్టుకున్నావు. నిజాయితీ లేని నిన్ను లోకమంతా ఇప్పటి నుంచి 'జిత్తులమారి' అని పిలుస్తుంది అంటూ శపించి వెళ్లిపోయాడు.

జనరల్ నాలెడ్జ్

1. ఇటలీ దేశ రాజధాని ఏది?
2. 'వేయి పడగలు' నవల రచయిత ఎవరు?
3. ప్రపంచంలో అతిపెద్ద సముద్రం ఏది?

సమాధానాలు : 1. రోమ్; 2. విశ్వనాథ సత్యనారాయణ; 3. పసిఫిక్ మహాసముద్రం

మెదడుకు మేత

నీటిలో ఉంటే ఎగిసిపడతాను. నేల మీదకు రాగానే కూలబడతాను. నేనెవరిని?

జవాబు : ఇసుక

మంచిమాట

విద్య అనేది నీడ లాంటింది.. దాన్ని మన నుంచి ఎవరూ విడదీయలేరు..

విందు.. వినోదం... పెండ్లి.. పేరంటం...
అన్నింటా మీ నేస్తం.
క్రేన్
వక్క పలుకులు
వీటికి సాటి మరేవి లేవు
www.craneindia.net
శ్రీ గ్రంధి సుబ్బారావు మరియు శ్రీమతి గ్రంధి లక్ష్మీ నరసమ్మ
ఇప్పుడు మీ కోసం సరికొత్త ప్యాకింగ్‌లో సరికొత్త రుచులతో
Taste of India
CRANE
BETEL NUT PIECES
Since 60 Years
₹10/-
SWEET BETEL NUT PIECES
PREMIUM
₹5
TARA ◆ 9044

వారఫలాలు

11-17 సెప్టెంబర్ 2023

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

కొన్ని కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి కాగలవు. ఆలోచనలు వెంటనే అమలు చేస్తారు. స్నేహితులతో విభేదాలు పరిష్కారమవుతాయి. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగ యత్నాలలో కదలికలు. శుభకార్యాల నిర్వహణపై చర్చలు జరుపుతారు. పారిశ్రామికవేత్తలు, క్రీడా కారులు అనుకున్నది సాధిస్తారు. 12,13 తేదీల్లో మానసిక ఆందోళన. విచిత్రమైన సంఘటనలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

కొత్త వ్యక్తుల పరిచయం. శుభకార్యాలలో పాల్గొంటారు. ఆప్తుల సూచనలు,సలహాలతో కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు.వాహనాలు, గృహం కొనుగోలు చేస్తారు. కోర్టుకేసులు కొలిక్కి వస్తాయి. ఆకస్మిక ధనలాభాలు. కుటుంబసభ్యులనుంచి ఆశించిన సహాయం. వ్యాపారస్తులకు లాభాలు తథ్యం. పారిశ్రామికవేత్తలకు సంతోష కరమైన సమాచారం. 11,12 తేదీల్లో దుబారా ఖర్చులు. బంధువిరోధాలు. ఆదిత్య హృదయం పఠించండి.



మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఆలోచనలు నిలకడగా ఉండవు. బాధ్యతలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. వాహనాలు, ఆరోగ్యవిషయాలలో కొంత శ్రద్ధ వహించాలి. వ్యాపారస్తులకు లాభాలు కష్టమే. ఉద్యోగస్తు లకు బాధ్యతలు మరింత పెరుగుతాయి. పారిశ్రామిక వర్గాలు, కళాకారులకు అవకాశాలు చేజారతాయి. 14,15 తేదీల్లో శుభవార్తలు. ఆకస్మిక ధనలాభం. శ్రీరామరక్షాస్తోత్రాలు పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తారు. దూర ప్రాంతాల నుంచి శుభవార్తలు అందుతాయి. . కొత్త కాంట్రాక్టులు దక్కించుకుంటారు. ఆదాయం మరింత సంతృప్తినిస్తుంది. స్థిరాస్తి కొనుగోలులో ఆటంకాలు అధిగమిస్తారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు సమకూరతాయి. రాజకీయవేత్తలకు ఆహ్వానాలు. కళాకారులు, రచయితలకు అనుకూలత. 16,17 తేదీల్లో వృథా ఖర్చులు. లేనిపోని వివాదాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

కొత్త ఆశలతో ముందుకు సాగి విజయాలు సాధిస్తారు. ముఖ్యమైన కార్యక్రమాలలో ప్రారంభంలో నిరాశ కలిగినా చివరికి పూర్తి చేస్తారు. దేవాలయాలు సందర్శిస్తారు. కాంట్రాక్టర్లకు చేజారిన అవ కాశాలు తిరిగి దక్కుతాయి. వ్యాపారులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. రచయితలు, క్రీడాకారులకు మరింత ఉత్సాహం. 14,15 తేదీల్లో అనుకోనిఖర్చులు. బంధు వులతో విరోధాలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

కన్య: ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

ఏ పని చేపట్టినా విజయవంతంగా ముగిస్తారు. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. భూములు, ఇళ్లు కొనుగోలు చేస్తారు. అనుకున్న రాబడి దక్కు తుంది. దేవాలయాలు సందర్శిస్తారు. కొంత అనా రోగ్య సూచనలు. ఉద్యోగుల శ్రమ ఫలిస్తుంది. రచయితలు, క్రీడాకారులకు అంచనాలు నిజం కాగలవు. 16,17 తేదీల్లో వృథా ఖర్చులు. బాధ్యతలు పెరుగుతాయి. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

తుల: చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

కొత్త కార్యక్రమాలు చేపడతారు. అందరిలోనూ విశేష గౌరవం పెరుగుతుంది. ఉద్యోగయత్నాలు అనుకూలిస్తాయి. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు, రావలసిన సొమ్ము అందుతుంది. వ్యాపారులు లాభాలబాటలో నడుస్తారు. ఉద్యోగులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. రచయితలు, కళాకారులకు కొత్త ఆశలు. 14,15 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు.విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఎటువంటి కార్యాన్నైనా పట్టుదలతో పూర్తి చేస్తారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. రుణ బాధలు తొలగుతాయి. ఆరోగ్య సమస్యలు తీరతాయి. ఉద్యోగస్తులకు కొంత ఊరటలభిస్తుంది. కళా కారు లకు ఊహించని అవకాశాలు. పరిశోధకులు, రచ యిత లకు కొత్త ఆశలు.11,12 తేదీల్లో కుటుం బంలో చికాకులు. వినాయకుని స్తోత్రాలు పఠించండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

కొత్త కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగిస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి స్నేహితుల నుంచి ఆహ్వానాలు అందు తాయి. రావలసిన సొమ్ము అంది అవసరాలు తీర తాయి.క్రీడాకారులు, రచయితల యత్నాలు సఫలం.శారీరక రుగ్మతలు కొంత బాధిస్తాయి. 12,13 తేదీల్లో వృథా ఖర్చులు. అనుకోని ప్రయా ణాలు. హయగ్రీవస్తోత్రాలు

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

పఠించండి.

కొన్ని కార్యక్రమాలు అప్రయత్నంగా పూర్తి చేస్తారు. మీలో దాగిన ప్రతిభపాటవాలు అందరూ గుర్తిస్తారు.భూ, గృహయోగాలు కలుగవచ్చు. వ్యాపా రస్తులకు కొత్త పెట్టుబడులు అందుతాయి. ఉ ద్యోగస్తులకు అభివృద్ధి కనిపిస్తుంది. రాజకీయవర్గా లకు గతం కంటే మెరుగ్గా ఉంటుంది. రచయితలు, కళాకారులకు శుభవార్తలు. 14,15 తేదీల్లో



కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ధనవ్యయం. దూరప్రయాణాలు. శివస్తుతి మంచిది.

కొంత శ్రమానంతరం కార్యక్రమాలు పూర్తి కాగలవు. వాహనాలు,ఆభరణాలు కొనుగోలు చేస్తారు. అవసరాలకు సొమ్ము అందుకుంటారు. పెట్టుకోవాలి. ఉద్యోగులకు విధి నిర్వహణ ఆశా జనకంగా ఉంటుంది. క్రీడాకారులు, పరిశోధకులకు కార్యసిద్ధి. 15,16 తేదీల్లో వ్యయప్రయాసలు. కుటుంబంలో ఒత్తిడులు. శివపంచాక్షరి పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ముఖ్యమైన కార్యక్రమాలలో ముందడుగు వేస్తారు. ఆప్తుల నుంచి కీలక సమాచారం అందు తుంది. ఆస్తి వివాదాలను చాకచక్యంగా పరిష్కరించు కుంటారు. విద్యార్థులకు కొంత ఊరట లభిస్తుంది. కాంట్రాక్టర్లకు అప్రయత్నంగా అవకాశాలు దక్కుతాయి. శారీరక రుగ్మతలు కొంత చికాకు పరు స్తాయి. వ్యాపారులు అనుకున్న లాభాలు దక్కించు కుంటారు. 16,17తేదీల్లో ఖర్చులు. స్నేహితుల నుంచి ఒత్తిడులు. ఆంజనేయ దండకం పఠించండి.

పదరసం-432

ఆధారాలు

అడ్డం

1. ఏ పూజ,పనిచేస్తున్నా ముందు పూజించే దేవుడు (5)
4. ఒక నక్షత్రం (2)
5. ఇంత వెర్రి ఉంటుందా? (4)
6. సముద్రాలను రక్షించే దేవత తిరగబడింది (5)
9. చెప్పకూడనిది (3)
10. బెరుకు (2)
12.... పదనిస (4)
15. నిజం (2)
16. అటు నుంచి ఇక్కడ కాదు (3)
17. బరువు -2)
19. అన్నం వండటానికి బియ్యంలో పోసే నీరు (4)
21. పడమటి దేశస్థులు (4)
23. భీముడు (వంటవాడు) (4)
24. కుదుతుంది జాగ్రత్త (2)

నిలువు

1. ఒక శృంగార నాయిక (4)
2. శ్రీకృష్ణుని భార్య (2)
3. నవ్వులపాలు (4)
4. దుర్యోధనుడు భంగపడ్డ మందిరం (4)
7. పెళ్లిళ్ల విషయంలో (ఆరోగ్యరీత్యా) ఇది మంచిది కాదంటారు (5)
8. తెలుగులో రోబో (5)
11. మోసం, ద్రోహం తలక్రిందులైంది (11)
13. పోక (వక్క)లను ముక్కలు చేసేది (5)
14. మూడు నిలువు లాంటిదే (5)
18. వెన్నెలకు విచ్చేది (3)
20. చేతిగుడ్డ (3)
22. అవకాశం, సౌకర్యం (2)



పదరసం - 432

పేరు: .....

చిరునామా:.....

.....

పిన్‌కోడ్ : ..... మొబైల్ : .....

సమాధానాలను పైగడులలో పూరించి,కత్తిరించి కవర్‌పై పదరసం నెం.వేసి 2023 సెప్టెంబర్ 25 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

పదరసం - 426 సమాధానాలు



పదరసం-430 సమాధానాలుగా 426 పట్టిక రావలసి ఉంది. సాంకేతిక లోపం వల్ల 425వ పట్టిక ప్రచురితమైంది. అసౌకర్యానికి చింతిస్తున్నాం.

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

పదరసం - 428సమాధానాలు



విజేతలు: తు.శారద, జొ.తేజశ్విని, బో.పండరి, తు.శివశంకర్, చిం.దేవ లక్ష్మి, రు.సుగుణ, నా.రాములు, ఎ.ప్రదీప్, జి.ధనలక్ష్మి, ఆంజనేయులు, డి.స్వాతి, ఆర్.అంజనీదేవి, అ.రజని, టి.వి.సుచిత్ర, త.మాధవి, బ.అనిల్, కె.సాయికిరణ్,బూ.రవీందర్, కె.అల్లీరాణి, ఎస్.మంజరి, జి.వి.మురళీ మోహన్,విజయలక్ష్మి, కె.విమలాదేవి, బి.రామచంద్ర మూర్తి,వై. హనుమంతరావు, వ.రామలింగాచారి, వి.సత్యనారాయణమూర్తి, బి.ఇందు శేఖర్,శార్వాణి,జి.వెంకటసుధ,లక్ష్మి,మ.విజయలక్ష్మి, కె.ప్రశాంత్, వా.విహాన్, డా.బి.ధన్వంతరి, వై.రాధాకిషన్, గు.ఆదినారాయణరెడ్డి, గ. ప్రసన్న, ఏ.టి.సుందరి, నే. బాలశైలజ, తి. నాగచంద్రిక, గ.హేమ, కె.నర్సింగ్‌రావు, త.అనఘశర్మ, వి.పద్మారంగనాథ్, కె.వి.రామమూర్తి, రా.శేషు, జ. ముకుందము, ఉ. భాస్కరయ్య, పు.రోహిణీభరద్వాజ్, ఎ.గాయత్రి, కొల్లా సీతారావమ్మా, కె.స్వప్న

ఈ వారం విజేత : ఆర్.ఎస్.పి.కౌముది, తెనాలి.

అరుణ

విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన సినిమా 'ఖుషి'. వీరిద్దరూ 2018లో వచ్చిన 'మహానటి'లో కలిసి నటించారు. ఆ తర్వాత ఎవరికి వారు పాన్ ఇండియా స్టార్స్‌గా గుర్తింపు తెచ్చుకునే పనిలో పడ్డారు. విజయ్ దేవరకొండ 'లైగర్' సినిమాతోనూ, సమంత 'శాకుంతలం' మూవీతోనూ ఉత్తరాదిన తమ సత్తా చాటాలని అనుకున్నారు. కానీ సాధ్యం కాలేదు. ఇప్పుడు వీరిద్దరూ కలిసి నటించిన 'ఖుషి' సినిమాను బహుశా అందుకే కావచ్చు కేవలం దక్షిణాది భాషలకే పరిమితం చేశారు. అటు 'లైగర్'తోనూ, ఇటు 'శాకుంతలం' తోనూ పోల్చితే 'ఖుషి' కాస్తంత బెటర్ మూవీగా పేరు తెచ్చుకుంది.

పరాజయాల పోలికతో గట్టెక్కిన ఖుషి

కథ విషయానికి వస్తే చాలా చిన్నది. నాస్తిక సంఘం నాయకుడైన లెనిన్ సత్యం (సచిన్ ఖేడేకర్) కొడుకు విప్లవ్ (విజయ్ దేవరకొండ) కాకినాడకు చెందిన ప్రవచన కర్త చదరంగం శ్రీనివాసరావు (మురళీశర్మ) కూతురు ఆరాధ్య (సమంత)తో ప్రేమలో పడతాడు. కుటుంబ పెద్దలు తమ పెళ్లికి అంగీకరించక పోవడంతో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటారు. అన్యోన్య దంపతులుగా జీవితాన్ని సాగించి, ఓ రోల్ మోడల్‌గా నిలబడాలని అనుకుంటారు. ప్రేమ వివాహం చేసుకున్న ఈ దంపతుల మధ్య ఎలాంటి అభిప్రాయభేదాలు వచ్చాయి? వాటిని వారు ఎలా పరిష్కరించుకున్నారు? ఈ క్రమంలో కుటుంబనభ్యుల అభిప్రాయాలలో వచ్చిన మార్పులు ఏమిటీ? అనేదే ఈ సినిమా.

చిత్రం ఏమంటే..ఈ కథలోని ప్రధానమైన స్పర్థ ద్వితీయార్థంలో కానీ మొదలు కాదు. పాత్రల లక్షణాలను, వారి ఇగో లోతులను తెలియచేయడానికి దర్శకుడు ప్రథమార్థం మొత్తం వాడేసుకున్నాడు. అయితే ప్రేక్షకులకు థ్రిల్ కలగాలనే ఆశతో హీరోయిన్‌ను ముస్లిం అమ్మాయిగా చూపించి, అదంతా సరదా ఆట అని తెలిపేశాడు. ఈ సినిమా ట్రైలర్‌లోనే ఆ అంశాన్ని రివీల్ చేశారు కాబట్టి థియేటర్‌లో సినిమా చూసే ప్రేక్షకుడు ఆ సన్నివేశాలతో అస్సలు కనెక్ట్ కాడు. దానికి తోడు లేని హీరోయిన్ తమ్ముడిని వెదకడం కోసం హీరో ప్రాణాలకు తెగించి ప్రయత్నించడం, దానిని ప్రత్యక్షంగా చూస్తున్నా హీరోయిన్ పెదవి విప్పి అదంతా నాటకం అని చెప్పకపోవడం ఎబ్బెట్టుగా ఉంది. కథను సాగదీయడం తప్పితే మరొకటి ఈ ఎపిసోడ్స్‌లో కనిపించదు. అలానే హీరోయిన్‌ను భారత గూఢచారిగా భావించిన టెర్రరిస్టులు బైక్స్‌పై వెంటాడి అంతం చేయాలని చేసే సన్నివేశాలు పరమ సినిమాటిక్‌గా ఉన్నాయి. దాంతో హీరో హీరోయిన్ల మధ్య ఫస్ట్ హాఫ్‌లో చూపించిన ప్రేమ సన్నివేశాలు పండలేదనే చెప్పాలి. ఇక ఒకరిని ఒకరు ఇష్టపడిన తర్వాత ఆస్తిక, నాస్తిక అభిప్రాయాల కారణంగా వారు రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోవడం అనేది సబబుగానే అనిపిస్తుంది. అయితే ఆ తర్వాత వారు విడిపోవడానికి చూపించిన కారణాలు అంత బలంగా లేవు. పెళ్లి అయిన ఏడాదిలోనే పిల్లలు పుట్టలేదని, దానికి తన తండ్రి చెప్పినట్టు హోమం చేయక పోవడమే కారణమని హీరోయిన్ భావించడం, అందుకోసం హీరోను ఒత్తిడి చేయడం, అతను ఆమె బాధను అర్థం చేసుకోకుండా గొడవ పడటంతో పుట్టింటికి వెళ్లిపోవడం ఇవేవీ బలంగా లేవు. చివరకు నాస్తికుడైన హీరో తండ్రి, కొడుకు కోసం ఓ మెట్టు దిగినట్టు చూపించారు. అలానే అటు ప్రవచనకర్త అన్ని సంవత్సరాలుగా తాను నమ్మి ఆచరిస్తూ వచ్చిన హోమాలు, వాటి ఫలితాలను పట్టించుకోనట్టుగా చూపారు. మొత్తం మీద ఇటు ఆస్తికులైనా, అటు నాస్తికులైనా... అనుబంధాలకు ప్రాధాన్యమివ్వాలి తప్పితే... తాము నమ్మిన సిద్ధాంతాలకు కాదని దర్శకుడు ఆయా పాత్రల ద్వారా చూపించాడు. సంతోషం! కష్టం వచ్చినప్పుడు ఎంతటి నాస్తికులైనా... ఆస్తికులుగా మారిపోవడం మనం చూస్తుంటాం. అలానే పరమ ఆస్తికులు అనుకునే వారు తమ కుటుంబంలో జరిగే కొన్ని ఉపద్రవాల కారణంగా మనసు విరిగి నాస్తికులు కావడం కూడా జరుగుతుంటుంది. కానీ వాటికి ఎంతో బలమైన కారణాలు ఉంటాయి. అలా కాకుండా ఈ సినిమాలో ఈ వ్యవహారాన్ని చాలా సింపుల్‌గా చుట్టేశారు. దాంతో సినిమా తేలిపోయింది.

విజయ్ దేవరకొండ తన పాత్రను బాగానే చేశాడు. కొన్ని సన్నివేశాలలో 'గీత గోవిందం' మూవీని గుర్తుకు చేశాడు. సమంత 'శాకుంతలం'తో పోల్చితే బెటర్‌గా ఉంది. అయితే ఆమె పాత్రకు దర్శకుడు సరిగా డిజైన్ చేయలేదు. పరమ ఆస్తిక కుటుంబం నుండి వచ్చిన సమంత కశ్మీర్‌లో ఓ చిన్న కారణంగా బురఖా వేసుకోవడం అనేది సమంజసంగా అనిపించదు. హీరో తల్లిదండ్రులుగా శరణ్య, సచిన్, హీరోయిన్ తండ్రిగా మురళీశర్మ, ఆయన తల్లిగా లక్ష్మి చక్కగా నటించారు. 'వెన్నెల' కిశోర్, రామకృష్ణ హీరో పక్కన ఉండి కాస్తంత వినోదాన్ని అందించారు. రోహిణి, జయరాం, శత్రు, శరణ్య ప్రదీప్, శ్రీకాంత్ అయ్యంగార్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. బ్రహ్మానందం ఎంట్రీ కొసమెరుపు. హేషమ్ అబ్దుల్ వహబ్ అందించిన సంగీతం బాగుంది. పాటలకు సాహిత్యాన్ని కూడా దర్శకుడు శివ నిర్వాణే అందించాడు. అలానే మురళీ సినిమాటోగ్రఫీ మూవీని కాస్త నిలబెట్టింది. మొత్తంగా చూసుకుంటే... కథాబలం లేని ఈ సినిమా అన్ని వర్గాలను అలరించడం కష్టమే. అయితే... హీరో హీరోయిన్ల గత పరాజయ చిత్రాలతో పోల్చుకుని ఇది కాస్తంత ఫర్వాలేదని తృప్తిపడుతున్నారు. భారీ పరాజయాన్నో, భారీ విజయాన్నో కాకుండా 'ఖుషి' ఎబౌ యావరేజ్ కేటగిరిలో నిలుస్తుందని అనుకోవచ్చు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

మన ప్రియతమ భారత ప్రధాని
శ్రీ నరేంద్రమోదీ గారికి
(SEPT -17)
జన్మదిన శుభాకాంక్షలు..
తెలంగాణ విమోచన
దినోత్సవ
(SEPT -17)
శుభాకాంక్షలు..
శ్రీమతి & శ్రీ చింతల అరుణ - సురేందర్ యాదవ్
నాగోల్ డివిజన్ కార్పొరేటర్
బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి

జై శ్రీరామ్
జై తెలంగాణ
భారత్ మాతాకీ జై
17
సెప్టెంబర్
మీకు, మీ కుటుంబ సభ్యులకు
తెలంగాణ
విమోచన దినం
శుభాకాంక్షలు
మన ప్రియతమ భారత ప్రధాని
శ్రీ నరేంద్ర మోదీ గారికి
17
SEP
జన్మదిన శుభాకాంక్షలు
విశ్వకర్మ యోజన పథకం
సెప్టెంబర్ 17న ప్రారంభమయ్యే విశ్వకర్మ యోజన పథకం గ్రామాల్లోని
సంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారుల వ్యాపారాన్ని
మరింత బలోపేతం చేసేందుకు రూ.13000 కోట్లు
కేటాయించిన ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ.
బేజాడి బీరప్ప
జనగామ అసెంబ్లీ
బిజెపి జనగామ జిల్లా, ఉపాధ్యక్షులు

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 47